

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM హైదరాబాద్ : fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
13-3-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 41 పేజీలు: 8+4 వెల: 6.50


కవితకు సిబిఐ సమన్లు.. 16న విచారణకు రావాలని ఆదేశం 3

గ్యాస్ సంక్షోభం మధ్య పుకార్లు వ్యాప్తి: ప్రధాని 5

# అంతా అస్తవ్యస్తం



గ్యాస్ కొరతతో మూతపడుతున్న హోటళ్లు

ఆలయాల్లో ప్రసాదాలకు అడ్డంకులు

రంజాన్ మాసంలో హలీం తయారీకి ఇక్కట్లు

సిలిండర్ బ్లాక్‌లో రూ.4 నుంచి రూ.5వేలు

తక్షణ చర్యలకు ఉపక్రమించిన కేంద్ర, రాష్ట్రాలు

## బుకింగ్ గడువు 45 రోజులకు పెంపు

**న్యూఢిల్లీ, మార్చి 12:** వంటగ్యాస్ బుకింగ్ పిరియడ్‌పై కేంద్రం కీలక ప్రకటన చేసింది. మరోసారి బుకింగ్ కాలాన్ని పెంచింది. >>2

**న్యూఢిల్లీ, మార్చి 12:** అంతర్జాతీయంగా నెలకొన్న యుద్ధ మేఘాలు సామాన్యుడి బతుకును ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. దేశవ్యాప్తంగా తలెత్తిన గ్యాస్ కొరత కరోనా కాలం నాటి భయానక లాక్‌డౌన్ రోజులను గుర్తుచేస్తోంది. ఇంధనం లేక వాహనాలు షెడ్లకే పరిమితం కాగా, గ్యాస్ దొరక్క హోటళ్లు, క్యాంటీన్లు మూత పడుతున్నాయి. >>2



గురువారం సౌదీ నుంచి ముంబయికి చేరుకున్న క్రూడాయిల్ నౌక



మెడికోవర్ ఆసుపత్రి ప్రారంభంలో పాల్గొన్న సిఎం రేవంత్, మంత్రి దామోదర తదితరులు

ప్రైవేటు డాక్టర్లకు సిఎం రేవంత్ సూచన

65 లక్షల మంది హెల్త్ డేటా సిద్ధం

ఆరోగ్యశ్రీ, సిఎంఆర్ఎఫ్ కోసం రూ.1800 కోట్లు

నాణ్యమైన వైద్యం సామాన్యులకు అందించాలి: ముఖ్యమంత్రి రేవంత్

## యేడాదికి ఓ నెల ప్రభుత్వాసుపత్రుల్లో

# పనిచేయండి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి12:** రాష్ట్రంలో 65 లక్షల మంది హెల్త్ డేటాను తయారు చేస్తున్నామని, వాళ్ళకి త్వరలో డిజిటల్ హెల్త్ కార్డ్ అందజేస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర సమగ్రాభివృద్ధి కేవలం భవన నిర్మాణాలతో సాధ్యం కాదని నాణ్యమైన విద్య,వైద్యం సామాన్యుడికి చేరినప్పుడే అసలైన ప్రగతి అని అన్నారు. వైద్యం యాంత్రికంగా ఉండకూడదు, అది మానవత్వంతో కూడిన సేవగా ఉండాలి అనే నినాదంతో కాంగ్రెస్ సర్కార్ కీలక అడుగులు వేస్తోందని ఆయన తెలిపారు. గురువారం ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌లో మేడికోవర్ హాస్పిటల్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కోటీ 30లక్షల కుటుంబాలకు జీవిత భీమాను అందజేసేందుకు ప్రణాళికను సిద్ధం చేశామన్నారు.ఈ సంవత్సరం ఆరోగ్యశ్రీ,సిఎంఆర్ఎఫ్ కోసం రూ.1800 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. 20 ఏళ్ల ఆరోగ్య శ్రీ డేటాను ఉపయోగించి హెల్త్ డేటా తయారు చేస్తున్నామని పేర్కొన్నారు. క్యాన్సర్ నిరోధించడంపైన రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టిందని, అందుకనే ప్రముఖ అంకాలజిస్ట్ డాక్టర్ నోరి దత్తాత్రేయ ను సలహా దారుడిగా నియమించుకున్నామని తెలిపారు. దేశంలో హైదరాబాద్ నుంచి 40 శాతం ఫార్మా ఉత్పత్తులు ఉన్నాయని,.కరోనా వాక్సిన్ ల్లో మూడు మన జీనోమ్ వ్యాలీ నుంచే ఉత్పత్తి కావడం మనకు గర్వ కారణమని చెప్పారు. 'నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి,పీవీ నరసింహారావు సరళీకరణ >>2

## నెట్‌ఫ్లిక్స్‌తో హైదరాబాద్‌కు హాలీవుడ్ వచ్చినట్లే

ఐలైన్ స్టూడియోను ప్రారంభించిన సిఎం రేవంత్ 7



## 16 నుంచి ఒంటిపూట బడులు

ఉదయం 8 నుంచి 12.30 దాకా క్లాసులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 12:** పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఒంటిపూట బడులు ప్రారంభించాలని విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. ఈ నెల 16 నుంచి రాష్ట్రంలో ఒంటిపూట బడులు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ 24 వరకు ఒంటిపూట బడులు కొనసాగుతాయి. ఒంటిపూట బడులు ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12.30 వరకు >>2



## బ్లాక్‌లో విక్రయిస్తే కొరడా

ఎల్పీజీ ఏజెన్సీలను హెచ్చరించిన మంత్రి ఉత్తమ్

నేడు గ్యాస్ ఏజెన్సీలతో ఉన్నతస్థాయి సమావేశం

**హైదరాబాద్, మార్చి 12, ప్రభాతవార్త:** వంట గ్యాస్‌ను బ్లాక్ బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎల్‌పిజి ఏజెన్సీలను రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి హెచ్చరించారు. రాష్ట్రంలో డొమెస్టిక్(గృహ వినియోగ గ్యాస్) గ్యాస్‌కు ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతానికి కమర్షియల్ సిలిండర్ల కొరత ఉందని తెలిసిందన్నారు. శుక్రవారం గ్యాస్ ఏజెన్సీలతో సమావేశమవుతామని తెలిపారు. రాష్ట్రంలో గ్యాస్ డిమాండ్, సప్లైపై ఆరా తీస్తామని చెప్పారు. ప్రజలకు గ్యాస్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ విషయమై గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. వంట గ్యాస్ విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. శుక్రవారం సమావేశంలో అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతామని తెలిపారు. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో తెలంగాణలో గ్యాస్ సిలిండర్ల సరఫరాకు ఇబ్బందులు నెలకొంటున్నాయి. దాంతో హోటళ్లు, హాస్టల్స్, మెస్‌లకు అవసరమైన మేర కమర్షియల్ సిలిండర్ల సరఫరా లేకపోవడంతో నగరంలో చాలా ప్రాంతాల్లో మూతపడ్డాయి. ఈ నేపథ్యంలో గ్యాస్ సిలిండర్ల >>2




## అభివృద్ధిలో తెలంగాణ టాప్

సంక్షేమం, మానవ వనరులకు 39 % వ్యయం

ఎఫ్ఆర్ఎంబికి మించిన రుణాలపై ఆందోళన

రాష్ట్ర సర్కార్ పనితీరుపై నీతిఆయోగ్ నివేదిక వెల్లడి

**హైదరాబాద్, మార్చి 12, ప్రభాతవార్త:** అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం దూసుకుపోతోందని నీతిఆయోగ్ ప్రశంసించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ గణనీయంగా అభివృద్ధి చెందిందని, దీనికి అభివృద్ధి వ్యయం పెరుగుదల కారణమని పేర్కొంది. మౌలిక సదుపాయాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై రాష్ట్ర సర్కార్ దృష్టి సారించిందని తెలిపింది. నీతి ఆయోగ్ తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం ప్రధానంగా సామాజిక మరియు ఆర్థిక సేవలకు పెరిగిన కేటాయింపుల ద్వారా ముఖ్యంగా మూలధన వ్యయంలో గణనీయమైన పెరుగుదల చోటు చేసుకుందని తెలియచేసింది. నివేదికలోని వివరాల మేరకు 2019-20 నుండి 2023-24 మధ్య కాలంలో రాష్ట్ర అభివృద్ధి రెవెన్యూ వ్యయంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. సామాజిక సేవలపై ముఖ్యంగా సంక్షేమం మరియు మానవ వనరుల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చేసే వ్యయం, మొత్తం రెవెన్యూ వ్యయంలో సుమారు 38 నుండి 39 శాతంగానే కొనసాగుతోంది. అంతేకాకుండా, ఈ కాలంలో ఆర్థిక సేవలకు సంబంధించిన వ్యయం వేగంగా పెరిగి, 22 శాతం నుండి 35 శాతానికి చేరింది. మౌలిక సదుపాయాల అభివృద్ధి, రాష్ట్ర వృద్ధి లక్ష్యాలపై ప్రభుత్వానికి ఉన్న ప్రాధాన్యతకు ఇది అద్దం పడుతోంది. 2019-20 ఆర్థిక సంవత్సరంలో అభివృద్ధి సంబంధిత మూలధన వ్యయం రూ. 16,860 కోట్లుగా ఉండగా, 2023-24 నాటికి అది రూ.43,918 కోట్లకు పెరిగింది. ఇది 160 శాతానికి పైగా వృద్ధిని సూచిస్తుంది. అలాగే 2019-20లో రూ.1,02,543 కోట్లుగా ఉన్న రాష్ట్ర స్థాయి మొత్తం వ్యయం, 2023-24 నాటికి రూ.1,69,293 కోట్లకు భారీగా పెరిగింది. ఈ వ్యయం స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తిలో సుమారు 11-12 శాతంగా కొనసాగుతోంది. అయితే రుణాల విషయంలో నీతిఆయోగ్ ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్ర రుణాలు ఎఫ్ఆర్ఎంబిలో 33.10 శాతం పరిమితి లోపే ఉండాలని, అయితే, 2023-24 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రుణాలు, ఇతర రుణ బాధ్యతలు రూ.5,17,659 కోట్లకు చేరాయి. ఎఫ్ఆర్ఎంబిలో 34.47 శాతంగా ఉన్న ఈ మొత్తం చట్టం నిర్దేశించిన పరిమితిని మించిపోవడంతో గత ఐదేళ్లుగా రాష్ట్ర రుణభారం క్రమంగా పెరుగుతూ వస్తోంది. కాగా రాష్ట్ర మొత్తం >>2



## రేపటి నుంచి టెన్త్ పరీక్షలు

అయిదు నిమిషాలు ఆలస్యమైనా అనుమతి 'నో'

**హైదరాబాద్, మార్చి 12, ప్రభాతవార్త:** పదో తరగతి వార్షిక పరీక్షలు ఈ నెల 14 నుంచి ప్రారంభంకానున్నాయి. పరీక్షలు శనివారం ప్రారంభమై ఏప్రిల్ 16వ తేదీ వరకు జరుగుతాయి. అయితే పరీక్షలకు ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చే విద్యార్థులను కూడా అనుమతించాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. అయిదు నిమిషాల లేట్ అనంతరం వచ్చే వారిని పరీక్షా కేంద్రంలోకి >>2

## ఎస్సీలకు 18% నిధులివ్వాలి

బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యమివ్వాలన్న మంత్రి వివేక్

సామాజిక న్యాయం కాంగ్రెస్ డిఎన్ఎ: మంత్రి పొన్నం

రోజుకు 100 మందికి కాంగ్రెస్ సభ్యత్వం ఇస్తే 100 సీట్లు ఖాయం: పిసిసి చీఫ్ మహేష్

**హైదరబాద్,మార్చి 12,ప్రభాతవార్త:** కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చే బాధ్యత టిపిసిసి ఎస్‌సి విభాగం చైర్మన్ కవ్వంపల్లి సత్యనారయణ పై ఉందనీ ముఖ్యంగా తెలంగాణ బడ్జెట్‌లో 18శాతం నిధులు కేటాయించలేలా పూనుకోవాలని కార్మికశాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి అన్నారు. బుధవారం టిపిసిసి ఎస్సీ విభాగ చైర్ పర్సన్‌గా మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పదవి స్వీకార మహోత్సవానికి ముఖ్య అతిథిగా టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ ,ఎమ్మెల్యేలు వేముల వీరేశం,లక్ష్మీ ్మ కాంత్, యెన్నం శ్రీనివాస్, మేడిపల్లి సత్యం,నాగరాజు, వినోద్,ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, ఫైనాన్స్ చైర్మెన్ రాజయ్య,ఎఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్ మాజీ ఎమ్మెల్యే మోత్కుపల్లి నర్సింహులు, జేబిరాజులు హాజరైనారు.ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ రుణమాఫిలో ఎస్సీ రైతులకు తక్కువ లబ్ధి జరిగిందని ఆవేదన చెందారు. ఎస్సిలకు 18 శాతం రిజర్వేషన్ కల్పించడంతో పాటు కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో కూడా అంతే వాటా అందించాలని కోరారు. దళితులకు కాంట్రాక్టులు, సబ్సీడిలు అందించేలాకృషిచేయాలని కోరారు. రవాణాశాఖ మంత్రి సామాజిక న్యాయం కాంగ్రెస్ నాయకుల డిఎన్ఎలో ఉందని నెహ్రూ నుంచి మొదలు కొని రాహుల్ వరకు అదే దిశలో చిత్తశుద్ధితో కార్యచరణ తీసుకొంటున్నారని అన్నారు. విద్యతోనే ఎస్‌సిల ఆర్థిక,సామాజిక అభ్యున్నతి జరుగుతోందని ఎస్సీల సమస్యలు కవ్వంపల్లి ప్రభుత్వం దృష్టికి తీసుకొని వచ్చేందుకు ఈ పదవి ఎంతగానో తోడ్పాటు నిస్తుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ దేశ ఐక్యతకు పాటుపడేలా అందరికి సమ న్యాయం కల్పిస్తోందని వివరించారు. సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఎస్సిసెల్ కాంగ్రెస్‌కు గుండె కాయ లాంటిదనీ తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి దళితులే కారణమనీ అన్నారు. దేశంలో పేద వర్గాలకు అండగా ఉండేది కాంగ్రెస్ పార్టీనే కావడంతో రాబోయే మూడు సంవత్సరాలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ మళ్ళీ అధికారంలో వస్తుందనీ ఆశాభావం >>2



టిపిసిసి ఎస్సీ విభాగ చైర్ పర్సన్‌గా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పదవీ స్వీకార కార్యక్రమంలో మంత్రులు పొన్నం, అడ్లూరి లక్ష్మణ్, పిసిసి చీఫ్ మహేష్ కుమార్

## ముగిసిన విచారణ

ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల కేసుపై సుప్రీం తీర్పు వెల్లడి

ఫిర్యాదుదారులకు స్పీకర్ తీర్పు కాపీలివ్వాలని ఆదేశం



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి12:** ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల కేసులో సుప్రీంకోర్టు విచారణ ముగించింది. బీఆర్ఎస్ పిటిషన్లపై విచారణ ముగిసినట్లు ధర్మాసనం ప్రకటించింది.ఇప్పటికే పిటిషన్లను స్పీకర్ పరిష్కరించినట్టు న్యాయ వాది అభిషేక్ మను సింఘ్వీ తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నిర్ణయం వెలువరించారన్న >>2

7 

## గ్యాస్ కొరతపై కేంద్రం జోక్యం చేసుకోవాలి

కేంద్రమంత్రి హర్దీప్‌సింగ్ పూరీకి కెటిఆర్ లేఖ

7 

## నూనెగింజల కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం

ఇరాన్ విద్యుత్ వ్యవస్థను నాశనం చేస్తాం: ట్రంప్

షరతులు పాటిస్తేనే యుద్ధానికి ముగింపు: పెజెష్కియాన్

తండ్రి హత్యకు ప్రతీకారం తప్పదు: మొజ్తబా ఖమేనీ



## ప్రతీకార దాడులు ముమ్మరం

మండుతున్న దుబాయ్, కువైట్‌లోని పలు ప్రాంతాలు

**టెహ్రాన్ / జెరూసలెం, మార్చి 12:** మధ్యప్రాచ్యదేశాల్లో యుద్ధ ఉద్రిక్తతలు మరింత తీవ్రం అయ్యాయి. ఇజ్రాయెల్, అమెరికాల సంయుక్త దాడులు గురువారం కూడా ఉధృతంగా కొనసాగాయి. ఇరాన్‌లోని మొత్తం 130 లక్షాయలపైనే ఈ దాడులు విస్తృతంగా కొనసాగాయి. ఇప్పటివరకూ దాడుల్లో 1100 మందికిపైగా చిన్నారులు చనిపోయారని మధ్యప్రాచ్య ఏజెన్సీలు చెపుతున్నాయి. ఒక్క ఇరాన్ స్కూలులోనే 200 మందికిపైగా చనిపోతే 91 మంది లెబనాన్‌లోను, నలుగురు ఇజ్రాయెల్, ఒకరు కువైట్‌లో చనిపోయినట్లు తేలింది. యునిసెఫ్ తన నివేదికలో ఇదే తీరు కొనసాగితే మరింత సంక్షోభం ఎదురవుతుందని వేలాదిమంది చనిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించింది. గల్ఫ్‌దేశాలలోని అమెరికా బేస్‌లపై దాడులతోపాటు శత్రుదేశాల్లోని మిలిటరీ స్థావరాలను కూడా ఇరాన్ టార్గెట్‌చేస్తోంది. గల్ఫ్‌దేశాలపై ఇరాన్‌చేస్తున్న దాడులు ఆదేశాల ఆర్థికవ్యవస్థ, భద్రతను ఆందోళనకు గురిచేస్తున్నాయి. దుబాయ్ డౌన్‌టౌన్‌లోని అల్‌బదా నిఆసప్రాంతంలోడ్రోన్ పేలుడు జరిగింది. దుబాయ్‌క్రీక్ హార్బర్‌ప్రాంతంలో ఒకభవనాన్ని డ్రోన్ ఢీకొట్టింది. దుబాయ్‌తీరంలోవెళుతున్న కంటైనర్‌షిప్‌పై క్షిపణి దాడిజరిగింది. బహ్రెయిన్‌లోని మహర్రాక్ ద్వీపంపై ఇరాన్‌దాడి చేసింది. కువైట్‌లో కూడా >>2



గురువారం యాదాద్రి ఆలయంలో ధ్వజస్తంభం వద్ద మొక్కుతున్న గవర్నర్ శివప్రతాప్ శుక్లా దంపతులు

# యాదాద్రిలో గవర్నర్ దంపతులు

**యాదగిరిగుట్ట మార్చ్ 12 ప్రభాత వార్త:** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం లో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా గురువారం కుటుంబ సభ్యులతో స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆలయానికి వచ్చిన ఆయనకు వేద పండితులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితులు ఆలయ సంప్రదాయంతో పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. గవర్నర్ ధ్వజ స్తంభం వద్ద బలిపీఠానికి నమస్కరించుకొని స్వామి వారి అంతరాలయంలోఅర్చనాది పూజా కార్యక్ర మాలునిర్వహించారు. ఆయనకు ఆలయ అర్చకులు స్వామి అమ్మవారి అష్టోత్తరంతో ప్రత్యేక పూజలు గావించి హారతిని ఇచ్చి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయనకు ఆలయ అర్చకులు వేద పండితుల సమక్షంలో ఘనంగా చతుర్వేద శ్లోకాలతో ఘనంగా ఆశీర్వచనాన్ని గావించారు. అనంతరం ఆయనకు కార్య నిర్వాహణాధికారి భవాని శంకర్ స్వామి అమ్మ వారిలో మెమొంటోను అందచేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్త స్వామి వారి ప్రసాదాన్ని గవర్నర్ కు అందచేశారు. అనంతరం అనుబంధ దేవాలయం శ్రీ పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో స్పటిక లింగానికి గవర్నర్ దంపతులు పంచామృ తాలతో అభిషేకం చేశారు. యాదగిరిగుట్టకు వచ్చిన రాష్ట్ర గవర్నర్ కు ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య,జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ , రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి గవర్నర్ కు పూల మొక్కలు బహుకరించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఒంటిపూట బడులు

>> పాఠశాలలు కొనసాగనున్నాయి. అనంతరం వేసని సెలవులు ప్రకటించనున్నారు. వేసని సెలవులు ముగిసిన అనంతరం జూన్ నెల నుంచి 2026–27 విద్యాసంవత్సరం ప్రారంభం కానుందని విద్యాశాఖ అధికారులు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో భానుడు ఉగ్రరూపాన్ని దాల్చుతున్న విషయం తెలిసిందే. గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమేపీ పెరిగిపోతున్నాయి. మార్చి నెల రెండో వారం ఆరంభంలోనే ఇలా ఉంటే ఏప్రిల్,మే నెలల పరిస్థితి ఏమిటనే ఆందోళనకు దారితీస్తోంది. దీంతో పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు ఒంటిపూట బడులు ప్రారంభించారు. ఈ వేసవికాంలో విద్యార్థులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అలాగే తల్లిదండ్రులు పిల్లలు అనారోగ్యానికి గురికాకుండా చూసుకోవాలని అధికారులు సూచించారు. అయితే, పదో తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు యథావిధిగా కొనసాగుతాయని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అలాగే, పదో తరగతి పరీక్షా కేంద్రాలుగా ఉన్న పాఠశాలలు పరీక్షలు జరిగే రోజుల్లో మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేయాల్సి ఉంటుంది. మిగతా రోజుల్లో ఈ కేంద్రాలు కూడా సాధారణ హాఫ్‌డే టైమింగ్స్‌ను పాటిస్తాయి.

# రేపటి నుంచి టెన్త్ పరీక్షలు

>> ఎట్టిపరిస్థితుల్లో అనుమతించరు.ఉదయం 9:35 గంటల తర్వాత వచ్చే విద్యార్థులను పరీక్షకు అనుమతించబోమని పాఠశాల విద్యాశాఖ తేల్చిచెబుతోంది. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,676 సెంటర్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ బడుల్లో 1,582 సెంటర్లు, ప్రైవేట్ బడుల్లో 1,094 సెంటర్లు ఏర్పాటు చేశారు. ఈ సారి 5,17,727 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. పదో తరగతి పరీక్షల సందర్భంగా సెల్‌ఫోన్ల వినియోగంపై అధికారులు కఠిన ఆంక్షలు విధించారు. పరీక్ష కేంద్రాలను నో సెల్‌ఫోన్ జోన్లుగా ప్రకటించారు. పరీక్షా సిబ్బంది, స్కాడ్ సహా ఇతర అధికారులందరికీ ఈ నిబంధనలు వర్తిస్తాయి. తనిఖీలకు వచ్చే అధికారులు సైతం సెల్‌ఫోన్లు తీసుకెళ్లకూడదు. సెల్‌ఫోన్లను ఆరుబయటే పెట్టాల్సి ఉంటుంది.

ఎవరొచ్చినా తనిఖీలు చేసిన తర్వాతే లోపలికి అనుమతిస్తారు. ఎవరైనా ఈ నిబంధనలు ఉల్లంఘించి సెల్‌ఫోన్లతో విధులకు హాజరైతే వారిని సస్పెండ్ చేస్తామని ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు. పరీక్షా నిర్వహణా సిబ్బంది పేపర్ లీకేజీలకు పాల్పడితే ఉద్యోగం నుంచి తొలగిస్తారు. ఈ నెల 14 నుంచి పదో తరగతి పరీక్షలు జరగనుండగా, ఏప్రిల్ 1 నుంచి జవాబుపత్రాల మూల్యాంకనం జరగనుంది.

కాగా.. విద్యార్థులు 8.30కల్లా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, ఒకరోజు ముందుగానే కేటాయించిన పరీక్షా కేంద్రాలను సందర్శించి రవాణ సదుపాయాల విషయంలో పకడ్బంధీ ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులు సూచించారు. అదేవిధంగా విద్యార్థుల వెంట హాల్‌టికెట్, పరీక్షా ప్యాడ్, పెన్ను, పెన్సిల్, స్కేల్, షార్ప్‌నర్, ఎరేజర్, జియోమెట్రిక్ ఉపకరణాలనే తీసుకురావాలని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల్లో ఆయా పాఠశాలల యూనిఫామ్‌లు వేసుకుని రాకూడదని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ స్పష్టం చేశారు.

# బ్లాక్‌లో విక్రయిస్తే కొరడా

>> కొరత నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. కాగా.. ప్రజలకు కేంద్రం మరోసారి షాకిచ్చింది. వంటగ్యాస్ సిలిండర్ల బుకింగ్ గడువును మరోసారి పెంచింది. ఇప్పటికే పట్టణాల్లో సిలిండర్‌కు, సిలిండర్‌కు మధ్య కనీస గడువును 21 రోజుల నుండి 25 రోజులకు పెంచగా... తాజాగా గ్రామాల్లోనూ నిబంధనలు విధించారు. గ్రామాల్లో కూడా సిలిండర్‌కు, సిలిండర్‌కు మధ్య కనీస గడువును 25 రోజుల నుండి 45 రోజులకు పెంచారు. ఈ కొత్త నిబంధన, అక్రమ నిల్వలను అరికట్టేందుకు, సరఫరాను క్రమబద్ధీకరించేందుకు అమలులోకి తీసుకొస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు.. దేశవ్యాప్తంగా గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధర రూ.60 పెరిగింది.

అలాగే హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర వ్యాపార సంస్థలు వినియోగించే కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధర రూ.115 పెరిగింది. ఈ పెంపు వెంటనే అమల్లోకి రావడంతో వినియోగదారులు అదనపు భారం భరించాల్సి వస్తోంది. హైదరాబాద్‌లో గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధర ప్రస్తుతం రూ.965గా ఉంది.

# ఎస్సీలకు 18% నిధులివ్వాలి

>> వ్యక్తం చేశారు.మాదిగలకు మంత్రి పదవి ఎక్కడ ఇస్తారని మందులసామెల్ చొరవతీసుకొని మాదిగ ఎమ్మెల్యేలను ఒక్కతాటిపై నిలబెట్టి ఢిల్లీకి తీసుకొని పోయారని దీనికి ఎఐసిసి సంపత్‌కుమార్ అండ ఉండటంతో నేను మంత్రినైనాని లక్ష్మణ్ తన అనుభవాలను చెప్పుకొన్నారు.టిపిసిసి చీఫ్ ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో ఎమ్మెల్యే,ఎంపి టికెట్లు ఎస్సీ రిజర్వేషన్ స్థానాలలో టిపిసిసిసి ఎస్ సి విభాగం చైర్‌పర్సన్ కవ్వంపల్లి సత్యనారాయణ సిఫార్సు పైనే ఆధారపడి ఇస్తామని ప్రకటించారు.దళిత వాదంతో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం జరిగిందనీ ఎస్సీ,ఎస్టీ,బిసి మైనార్టీలకు అండగా ఉన్న ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమే అని ఆయన అన్నారు. రెడ్డి సామాజికవర్గంకు ముఖ్యమంత్రి ,బిసికి పిసిసి అధ్యక్ష పదవి, దళితులు డిప్యూటీ సిఎం, స్పీకర్ పదవి,నాలుగు మంత్రి పదవులు ఇచ్చారని ఇది కేవలం కాంగ్రెస్ లో మాత్రమే సాధ్యమనీ వివరించారు. 90 ఏళ్ల తర్వాత కుల సర్వే చేసి అఫిషియల్ డాక్యుమెంట్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదనీ ఆయన తెలిపారు. క్లిష్ట సమయాల్లో దళితులు కాంగ్రెస్ పార్టీ కి అండగా నిలిచారనీ దళితులకు, ఆదివాసీలకు, బిసిసముచిత స్థానం ఇచ్చారనిని అన్నారు .. కెసిఆర్ రాష్ట్రాన్ని 8 లక్షల కోట్ల అప్పులో ముంచి పోయారనీ ఆవేదన చెందారు. 17 శాతం ఉన్న ఎస్సీలకు 5 ముఖ్యమైన స్థానాలు ఇచ్చామనీ రాబోయే పదవుల పంపకాల్లో ఎస్సీలకు తగిన ప్రాధాన్యత కల్పిస్తామనీ ఆయన హామి ఇచ్చారు. రాజయ్యను అర్ధరాత్రి డిప్యూటీ ముఖ్యమంత్రి పదవి నుంచి కెసిఆర్ ఎలా తొలగించారో గుర్తు చేశారు. సభ్యత్వ కార్యక్రమంలో రోజుకు 100 మంది చేరేలా కృషి చేయాలనీ అలా చేస్తే 100 సీట్లతో కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి వస్తామని ధీమాను మహేష్ కుమార్ వ్యక్తంచేశారు.తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ మాట్లాడుతూ దళితులకు, ఆదివాసులకు ప్రమాదం పొంచి ఉందిదళితులు కూలిపోతున్నారనీ,ఆదివాసులు అంత రించి పోతున్నారనీ కార్పొరేట్ సంస్థలు ఎవడేవడో దళిత,గిరిజన సంపదను వేల కోట్లు దోచుకు పోతున్నారనీ అన్నారు. తెలంగాణలో ప్రతి దళితవాడలో ప్రతి దళితుడు కాంగ్రెస్ సభ్యత్వం తీసుకొనేలా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేస్తానని హామి ఇచ్చారు. ఎస్‌సి బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి కృషిచేస్తానని ఆయన తెలిపారు. కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉంటూ నలుగురు ఎమ్మెల్యేలను గెలిపించాననీ ఆయన తెలిపారు.

## వారం - వర్జ్యం

13-03-2026, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, పూర్వాభాద్ర కార్తె
నవమి ఉ.6.29
పూర్వాషాఢ రా.3.01
వర్జ్యం : ఉ.11.37-మ.1.20
దు.ఉ.8.42-9.30,2) మ.3.06-3.54
శుభసమయం : సా.6.30-7.30
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** మీకు న్యాయం చేయవలసిన వాళ్ళు సంపూర్ణంగా న్యాయం చేయరు. వృత్తిలో కొన్ని మార్పులు వస్తాయి.

**వృషభం:** కోర్టు సంబంధిత భూ వివాదాలు, స్థిరాస్తులకు సంబంధించిన వివాదాలు ఒక పరిష్కార దశకు చేరుకుంటాయి.

**మిథునం:** కళా, సాంస్కృతిక ఉద్యోగ రంగాలలోని వారికి పోటీ ఎదురవుతుంది. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు.

**కర్కాటకం:** స్త్రీలతో విభేదాలు, స్పర్థలు, శృతిమించకుండా ముందే జాగ్రత్తలు తీసుకోండి. పనులు నిదానంగా పూర్తిచేస్తారు.

**సింహం:** సామరస్యమైన చర్చలు సాగించి అపోహలను దూరం చేసుకుంటారు. ఖర్చులు అధికంగా ఉంటాయి.

**కన్య :** వ్యాపార సంబంధమైన కాగితాలు, డాక్యుమెంట్స్ మొదలగునవి చేతి కందుతాయి. పాత ఋణాలు తీరుస్తారు.

**తుల :** వృత్తి, ఉద్యోగాలపరంగా మీ కృషికి తగినటువంటి మంచి ఫలితాలను అందుకోగలుగుతారు. ధనలాభం.

**వృశ్చికం:** మాటలను కటువుగా ఉపయోగించే వైఖరి, ఆలోచించకుండా వెంటనే సమాధానం చెప్పడంవలన చేదు అనుభవాలు తప్పవు.

**ధనుస్సు:** వాణిజ్య ప్రకటనలకు, ఇంటర్వ్యూలకు, ప్రచురణలకు అనుకూల సమయము. స్పెక్యులేషన్‌కు దూరంగా ఉండండి.

**మకరం:** పెట్టుబడులకు అనుకూలంగా ఉంటుంది. కోర్టుకేసుల నుండి బయట పడతారు. స్థలాలు కొనుగోలు.

**కుంభం:** లావాదేవీలు, మధ్యవర్తిత్వము, వివాదములు మొదలగువాటి యందు జాగ్రతలను పాటించండి.

**మీనం:** కార్యాలయములో నూతన బాధ్యతలు స్వీకరించవలసి వస్తుంది. సంఘసేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# అంతా అస్తవ్యస్తం

>> దేశవ్యాప్తంగా లక్షలాది మంది తమ జీవనోపాధిని కోల్పోయి వీధిన పడుతున్నారు. ఢిల్లీ, నోయిడా వంటి నగరాల్లో గ్యాస్ సిలిండర్ల సరఫరా పూర్తిగా అస్తవ్యస్తమైంది. దీనితో ఇపుడు 50శాతానికిపైగా హోటళ్లు మూసివేయక తప్పడంలేదు. ఒక్క హోటల్ రంగంలోనే వేల సంఖ్యలో రెస్టారెంట్లు తాత్కాలికంగా మూతపడ్డాయి. ఇందులో పనిచేసే వెయిటర్లు, క్లీనర్లు, వంట మనుషులు మళ్లీ తమ సొంతూళ్లకు పయనమవుతున్నారు. కరోనా సమయంలో ఎలాగైతే పనిలేక ఇంటికి వెళ్ళామో ఇప్పుడు గ్యాస్ లేక మళ్లీ అదే పరిస్థితి వస్తోందని నోయిడాలోని ఒక రెస్టారెంట్ కార్మికుడు ఆవేదన వ్యక్తం చేశాడు. కొరతను ఆసరాగా చేసుకుని అక్రమ వ్యాపారులు కోట్లు గడిస్తున్నారు. సాధారణంగా దొరకాల్సిన వాణిజ్య సిలిండర్లు ఇప్పుడు కేవలం బ్లాక్ మార్కెట్లోనే దర్శనమిస్తున్నాయి. ధర రూ. 5,000 దాటినప్పటికీ గ్యాస్ దొరుకుతుందన్న గ్యారెంటీ లేదు. మరోవైపు, డొమెస్టిక్ గ్యాస్‌ను అక్రమంగా హోటళ్లకు మళ్లిస్తుండటంతో సామాన్యులకు కూడా వంట గ్యాస్ అందడం లేదు. ఉపాధి కోల్పోయిన లక్షలాది కుటుంబాలను ఆదుకోవడానికి ప్రభుత్వం తక్షణమే రంగంలోకి దిగాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇంధన సరఫరాను పునరుద్ధరించకపోతే, ఈ సంక్షోభం మరిన్ని ప్రాణాలను, ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గ్యాస్ కొరతను సాకుగా చూపి ఏజెన్సీలు కృత్రిమ కొరతను సృష్టిస్తున్నాయి. అధికారికంగా బుక్ చేసుకున్న వారికి స్టాక్ లేదు అని చెబుతూనే, రూ.3,500 నుంచి రూ.4,000 వరకు ముట్టజెప్పే వారికి గుట్టుచప్పుడు కాకుండా సిలిండర్లు సరఫరా చేస్తున్నాయి. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్‌లో డిమాండ్ ఎక్కువగా ఉండటంతో, పొరుగు రాష్ట్రం మహారాష్ట్రలోని సోలాపూర్ నుంచి కూడా సిలిండర్లను అక్రమంగా తరలించి మాదాపూర్ వంటి ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**ప్రముఖ హోటళ్లపై ప్రభావం**

వాణిజ్య సిలిండర్ల ధరలు ఆకాశాన్ని తాకడంతో చిన్న హోటళ్లు మూతపడుతుండగా, ఐకానిక్ హోటల్స్ కూడా చేతులెత్తేస్తున్నాయి.హైదరాబాద్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన బావర్చి హోటల్ ఒకరోజు మూతపడటం నగరంలో గ్యాస్ సంక్షోభానికి నిదర్శనంగా నిలిచింది. ఐటీసీ వంటి దిగ్గజ హోటల్ గ్రూపులు సైతం తమ ఆహార సేవలలో అంతరాయం కలగవచ్చని కస్టమర్లకు ముందే సమాచారం ఇస్తున్నాయి. ప్రముఖ దేవాలయాల్లో ప్రసాదాల తయారీ, అన్నదాన కార్యక్రమాలు ప్రశ్నార్థకంగా మారాయి. రోజుకు 5 వేల కిలోల గ్యాస్ అవసరమయ్యే ఆలయంలో కేవలం 4 రోజుల నిల్వలు మాత్రమే ఉన్నాయి. ఉజ్జయినీ మహంకాళి, గణేశ్ ఆలయాల్లో 23 రోజులకు మించి గ్యాస్ లేదు. ఈ విపత్కర పరిస్థితులపై దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు చమురు సంస్థలతో అత్యవసర సమీక్ష నిర్వహించి, సరఫరాలో ఆలయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. గ్యాస్ సిలిండర్ కొనలేక, ఆటో డ్రైవర్లు, రోజువారీ కూలీలు కట్టెలపొయ్యిలపైనే ఆధారపడుతున్నారు. గ్యాస్ సిలిండర్ కొనలేక, ఆటో డ్రైవర్లు, రోజువారీ కూలీలు మరియు విద్యార్థులు కట్టెల పొయ్యిలను ఆశ్రయిస్తున్నారు. దీన్ని కూడా వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. నిన్నటి దాకా కిలో రూ.10 ఉన్న కట్టెల ధరను డిమాండ్ పెరగడంతో రూ.20 వరకు పెంచి సామాన్యుడిని మరింత ఇబ్బందుల్లోకి నెట్టేస్తున్నారు.

**సిఎన్‌జి గ్యాస్‌కు తీవ్ర కొరత**

ఇరాన్ యుద్ధం పుణ్యమా అని గ్యాస్ ఆధారిత వాహనాలకు ఎక్కడలేని ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మెట్రోనగరాల్లో గ్యాస్‌కు కొరత ఏర్పడింది. కోల్‌కత్తా, ఢిల్లీ, ముంబయి, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి నగరాల్లో ఈకొరత మరింత తీవ్రంగా ఉంది. ఇక రెండు,మూడోశ్రేణి పట్టణాల్లో అయితే ఆటోల ఇబ్బందులు చెప్పనలవి కాకుండా ఉన్నాయి. డీలర్లు కృత్రిమ కొరతను సృష్టిస్తూ అధికధరలకు విక్రయిస్తున్నారు. మార్చి 1వ తేదీ వరకు కిలో రూ.63 ఉన్న ఎల్పీజీ ధర, ఇప్పుడు ఏకంగా రూ.100 దాటడం రవాణా రంగాన్ని కుదిపేస్తోంది. మెట్రోనగరాల్లో రోజుకు 4 లక్షల కిలోల సీఎన్‌జీ డిమాండ్ ఉండగా, ప్రస్తుతం అందులో సగం కూడా అందడం లేదు. ఇంధన ధరల పెరుగుదలకు తోడు సరఫరా కొరత డ్రైవర్లను వేధిస్తోంది. గ్యాస్ కోసం బంకుల వద్ద రెండు, మూడు గంటల పాటు క్యూలో నిలబడాల్సి వస్తోంది. దీంతో రోజువారీ అద్దెకు వాహనాలు నడిపే డ్రైవర్లు తాము సంపాదించిన ఆదాయాన్ని గ్యాస్‌కే పోయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఇప్పటికే ఆదాయం కోల్పోయామని, ఇప్పుడు ఈ ధరల పెరుగుదల తమను మరింత కుంగదీస్తోందని ఆటో యూనియన్ నాయకులు వాపోతున్నారు. ఈ ఇంధన సంక్షోభం ప్రభావం విద్యార్థులపై కూడా పడుతోంది. ప్రస్తుతం పరీక్షల సమయం కావడంతో సకాలంలో ఆటోలు దొరకడం లేదు. గ్యాస్ దొరక్క డ్రైవర్లు ట్రిప్పులు రద్దు చేస్తుండటంతో, విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. ఇది తమ పిల్లల భవిష్యత్తును దెబ్బతీస్తుందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభుత్వ పర్యవేక్షణ...**

ఇంధన కొరత ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నామని, హార్ముజ్ జలసంధినుంచి కూడా రెండు నౌకలు వస్తున్నాయని, ఇప్పటికే ఒకనౌక భారత్‌కు చేరిందని కేంద్ర ఇంధన మంత్రిత్వశాఖ ప్రకటించింది. నిత్యం పర్యవేక్షణ జరుగుతోందని, బ్లాక్ మార్కెటింగ్, కృత్రిమ కొరత వంటి వాటిపై కఠిన చర్యలకు ఉపక్రమిస్తున్నట్లు కేంద్రంప్రకటించింది. ఏది ఎలా ఉన్నా ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్‌ల యుద్ధం జరుగుతున్నంతసేపూ గ్యాస్ కొరత ఇదే తీరులో ఉంటుందని వినియోగదారులు వాపోతున్నారు.




గ్యాస్ కొరతపై పార్లమెంటు మెట్ల వద్ద గురువారం ఆందోళన చేస్తున్న రాహుల్ గాంధీ ఇతర ఎంపీలు

# ముగిసిన విచారణ

>> సింఘ్వీ, పెండింగ్‌లో ఉన్న ఇద్దరిపై బుధవారం తుది తీర్పు ఇచ్చినట్టు తెలిపారు. సుప్రీంకోర్టులో ఇంకా విచారణ కొనసాగించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. స్పీకర్ న్యాయవాది సింఘ్వీ వాదనతో సుప్రీంకోర్టు ధర్మాసనం ఏకీభవించింది. 2 రోజుల్లో స్పీకర్ తన తీర్పు కాపీలు ఫిర్యాదుదారులకు ఇవ్వాలని పేర్కొంది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల కేసులో విచారణ ముగిసినట్లు జస్టిస్ సంజయ్ కరోల్ ధర్మాసనం ప్రకటించింది. తమ పార్టీకి చెందిన పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారని, ఫిరాయింపు నిరోధక చట్టం కింద వారిని అనర్హులుగా ప్రకటించాలని స్పీకర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, చింత ప్రభాకర్, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, కేపీ వివేకానంద, పాడి కౌశిక్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. పార్టీ ఫిరాయించినట్లు ఆరోపణలు ఎదుర్కొన్న ఎమ్మెల్యేలు వీరే... అరెకపూడి గాంధీ (శేరిలింగంపల్లి), బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి (గద్వాల), ఎం.సంజయ్ (జగిత్యాల), పోచారం శ్రీనివాస్‌రెడ్డి (బాన్సువాడ), కాలె యాదయ్య (చేవెళ్ల), గూడెం మహిపాల్‌రెడ్డి (పటాన్‌చెరు), దానం నాగేందర్ (ఖైరతాబాద్), తెల్లం వెంకట్రావు (భద్రాచలం), కడియం శ్రీహరి (స్టేషన్‌ఘన్‌పూర్), ప్రకాశ్‌గౌడ్ (రాజేంద్రనగర్) ఉన్నారు. వీరిపై అనర్హత వేటు వేయాలని బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులపై స్పీకర్ నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ పార్టీ న్యాయ స్థానాన్ని ఆశ్రయించింది. విచారించిన సుప్రీంకోర్టు పార్టీ ఫిరాయింపు ఫిర్యాదులపై నిర్ణయం తీసుకోవడానికి స్పీకర్‌కు ఒకసారి 3 నెలలు, తర్వాత మరో 4 వారాల సమయాన్ని ఇచ్చింది. ఈ నేపథ్యంలో న్యాయనిపుణులు, అడ్వకేట్ జనరల్‌తో చర్చించిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆ 10 మంది శాసన సభ్యులకు నోటీసులు జారీ చేశారు.10 మంది ఎమ్మెల్యేలు తమ వివరణలను సభాపతి ప్రసాద్ కుమార్‌కు సమర్పించారు. తాము బీఆర్ఎస్ పార్టీ మారలేదని, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే కొనసాగుతున్నామని వారు తమ వివరణల్లో పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధి పనుల్లో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశామని, ఈ సందర్భంగా సీఎం తమను సత్కరించడమే తప్ప తాము పార్టీ కండువా కప్పుకోలేదని వారు అఫిడవిట్ సైతం దాఖలు చేశారు. ఈ సందర్భంగా విచారణ జరిపిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ 10 ఎమ్మెల్యేలకు రెండు,మూడు దఫాల్లో క్లీన్‌చిట్ ఇచ్చారు. ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోనే ఉన్నట్టు స్పీకర్ వెల్లడించారు. వారు పార్టీ మారారని ఎలాంటి స్పష్టమైన ఆధారాలు లేవని తెలిపారు.

# ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేయండి

>> విధానాలు తీసుకువచ్చి హైదరాబాద్ అభివృద్ధికి పునాదులు వేశారు..చంద్రబాబు నాయుడు హైటెక్ సిటీని పూర్తి చేసి ఐటీ హబ్ గా మార్చారు అని గుర్తు చేశారు. నాణ్యమైన విద్యను అందిచాలన్న ఆలోచనతో విద్యా విధానంలో మార్పులు తెస్తున్నం..వచ్చే విద్యా సంవత్సరం నుంచి నర్సరీ నుంచి 12 తరగతి కొత్త విద్యా విధానం అమలులోకి తీసుకువస్తామని తెలిపారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేసి విద్యార్థులకు నాణ్యమైన బ్రేక్ ఫాస్ట్,భోజనంతో పాటు ట్రాన్స్పోర్ట్ కల్పిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా లేదా 50 శాతం రాయితీతో ట్రాన్స్పోర్ట్ సౌకర్యం కల్పిస్తామన్నారు..విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపు కోసం స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యను అందిస్తే సంక్షేమ కార్యక్రమాలు ఇవ్వాల్సిన అవసరం ఉండదన్నారు. మహిళలు ఆరోగ్యం బాగుంటే కుటుంబం బాగుంటుందని చెప్పారు. ఉస్మానియా,టిమ్స్ హాస్పిటల్‌ల నిర్మాణం,మౌలిక సదుపాయాల కోసం 10 వేల కోట్లు ఖర్చు పెడుతున్నామని తెలిపారు. సామాన్యులు భరించలేని విధంగా వైద్యం ఖర్చులు పెరిగిపోయాయి..ప్రైవేట్ రంగం లో ఉన్న డాక్టర్లు ఏడాదిలో ఒక నెల ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేయాలని సూచించారు. హైదరాబాద్ దేశంలో ప్రముఖ హెల్త్‌కేర్ హబ్‌గా అభివృద్ధి చెందుతోందని, అత్యాధునిక వైద్య సాంకేతికతతో కూడిన ఆసుపత్రుల స్థాపన ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి కట్టుబడి ఉందని తెలిపారు. మెడికోవర్ ఆసుపత్రుల ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ జి.అనిల్ కృష్ణ మాట్లాడుతూ హైదరాబాద్ ప్రజలకు ప్రపంచ స్థాయి వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ ఆసుపత్రిని ప్రారంభించామని చెప్పారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎ.శరత్‌రెడ్డి,పి.హరికృష్ణ,డైరెక్టర్ డాక్టర్ ఎ.ఆర్. కృష్ణ ప్రసాద్ ప్రసంగించారు. ఈ ఆసుపత్రి ప్రారంభంతో భారత దేశంలో మెడికవర్ ఆసుపత్రుల సంఖ్య 25కి చేరింది. ఈ నూతన ఆసుపత్రి దేశంలోనే అత్యంత ఎత్తైన ఆసుపత్రి భవనాలలో ఒకటిగా నిర్మించారు. అత్యాధునిక సదుపాయాలు, ఆధునిక వైద్య సాంకేతికతతో రూపొందించిన ఈ ఆసుపత్రిలో 550 పడకల సామర్థ్యం ఉంది. 5 సెకన్లలో గుండె స్కాన్ పూర్తి చేసే అత్యాధునిక హార్ట్ స్కానింగ్ టెక్నాలజీని మొదటిసారిగా తెలుగు రాష్ట్రాల్లో ప్రవేశపెట్టారు. 640-స్లైస్ సీటీ స్కాన్ సాంకేతికతను ఏర్పాటు చేసి మరింత స్పష్టమైన చిత్రీకరణతో ఖచ్చితమైన నిర్ధారణకు అవకాశం కల్పించారు.

# బుకింగ్ గడువు 45 రోజులకు పెంపు

>> రెండు సిలిండర్ల బుకింగ్ గ్యాప్ 25 రోజులుండగా, ఇప్పుడు దీనిని 45 రోజులకు పెంచుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ నిర్ణయం గ్రామీణ ప్రాంతాలకు మాత్రమే వర్తిస్తుందని వెల్లడించింది. పట్టణాల్లో, నగరాల్లో 25 రోజుల నిబంధన కొనసాగనుందని ఈ మేరకు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ ప్రకటన విడుదల చేసింది.

# తెలంగాణ టాప్

>> ఆదాయంలో సొంత పన్నుల రెవెన్యూ ప్రాథమిక వాటాగా ఉన్నప్పటికీ, పన్నేతర వసూళ్లు కూడా వేగంగా పెరుగుతున్నట్లు తేలింది. అయితే, ఇదే సమయంలో కేంద్ర గ్రాంట్లలో రాష్ట్ర వాటా తగ్గుతున్నట్లు స్పష్టం చేసింది. కీలక ఆర్థిక సూచికల పరంగా, రాష్ట్రం ఒక సాధారణ ఆదాయ మిగులును కొనసాగించడంతో పాటు, ఆర్థిక లోటును చట్టబద్ధమైన పరిమితుల్లో నిర్వహిస్తోంది. అలాగే అభివృద్ధి వ్యయంలో రాష్ట్రం గణనీయమైన పెరుగుదల చోటు చేసుకుందని తెలియచేసింది. రాష్ట్రవ్యాప్తంగా సమకూరే మొత్తం ఆదాయంలో, రాష్ట్ర సొంత పన్ను ఆదాయం సుమారు 80 శాతంగా ఉంది. కేంద్ర ప్రభుత్వం నుండి లభించే గ్రాంట్ల వాటా కేవలం 6 శాతం మాత్రమేనని, అది క్రమంగా తగ్గుముఖం పడుతున్నట్లు ఆ నివేదికలో నీతిఆయోగ్ పేర్కొంది.

# దాడులు ముమ్మరం

>> ఒకనివాసభవనంపై ఇరాన్‌డ్రోన్ దాడిచేసింది. సౌదీలోని షైబా చమురుక్షేత్రంపైనా ఇరాన్ దాడులుచేసింది. ఇరాక్ సముద్రజలాల్లో అమెరికా ఆయిల్‌ట్యాంకర్‌పై ఇరాన్ స్యూసైడ్‌బోట్ దాడిచేయడంతో ఒక భారతీయుడు చనిపోయాడు. అలాగే మొత్తం రెండునౌకలపై ఇరాన్‌దాడులుచేసినట్లు తేలింది.

**ఇరాన్ అణుకేంద్రం ధ్వంసంచేసాం..ఇజ్రాయెల్ ఐడిఎఫ్**

ఇరాన్‌లో ఉన్న ఒక న్యూక్లియర్ కేంద్రాన్ని తమ దాడుల్లో ధ్వంసంచేసినట్లు ఇజ్రాయెల్ రక్షణదళాలు వెల్లడించాయి. టెహ్రాన్‌కు ఆగ్నేయంగా 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న తలేఘాన్ కాంపౌండ్‌పై ఇజ్రాయెల్ వైమానికదళాలు దాడిచేసినట్లు ఐడిఎఫ్ వెల్లడించింది. ఎఎండిప్రాజెక్టుకోసం ఇక్కడే పరీక్షలుచేసిందని, అందుకే ఈ కేంద్రాన్ని ధ్వంసంచేసామని ప్రకటించింది. ఇదిలా ఉంటే తాను తలుచుకుంటే గంటలోనే ఇరాన్ విద్యుత్ వ్యవస్థను నాశనంచేసేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికలు జారీచేయడం ఉద్రిక్తతలను మరింతగా రెచ్చగొడుతున్నట్లు కనిపిస్తోంది. అలాగే హెజ్బొల్లా దాడులు కూడా ఉధృతం అయ్యాయి. ఒక్కరాత్రే సుమారు 200 రాకెట్లతో ఇజ్రాయెల్‌వైపు దాడులకు దిగింది. ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్‌కుసైతం చిక్కకుండా దాడులుచేసింది. యుద్ధంకోసం ఇప్పటివరకూ 17 బిలియన్ డాలర్లు ఖర్చుచేసినట్లు అమెరికా రక్షణ వ్యవస్థకేంద్రం పెంటగాన్ ప్రకటించింది. తొలి ఆరురోజులకే 11.3 బిలియన్ డాలర్లు వ్యయం అయింది.

**యుద్ధంముగించేందుకు షరతులు...పెజెష్కియాన్**

తమదేశంపై ఇజ్రాయెల్, అమెరికాలు యుద్ధం ముగించాలంటే షరతులు పాటించాల్సిందేనని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ పేర్కొన్నారు. ఇరాన్ సహజ హక్కులను గుర్తించాలని, ఇరాన్ హక్కుల్ని గుర్తించడం, నష్టపరిహారం చెల్లించడం, భవిష్యత్తులో ఎలాంటిదాడులు ఉండవన్న గ్యారంటీలు ఇవ్వాలని పెజెష్కియాన్ అన్నారు.

**ప్రతీకారం తీర్చుకుంటాం...మొజ్తబా ఖమైనీ**

మినాబ్ స్కూలుపై జరిపిన అమానుష దాడికి ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ కొత్తసుప్రీం లీడర్ మొజ్తబా ఖమైని హెచ్చరించారు. తన తండ్రి హత్యతోపాటు చిన్నారుల హత్యకు అమెరికా, ఇజ్రాయెల్‌లు శిక్ష అనుభవించక తప్పదని, అమరుల శాంతికి ప్రతీకారం తప్పదని ఇరాన్ సుప్రీం లీడర్ తన మొట్టమొదటి సోషల్‌మీడియా పోస్టులో హెచ్చరించారు.

# ట్రంప్ మాటలు మోడీ మాట్లాడుతున్నారు : రాహుల్

**హైదరాబాద్,మార్చి 12,ప్రభాతవార్త:** పశ్చిమాసియా దేశాల్లో జరుగుతున్న యుద్ధంపై భారత ప్రధాని అనుసరిస్తున్న వైఖరీ దేశప్రయోజనాలకు భంగం కలిగించేలా ఉందని, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాటలు మోడీ మాట్లాడుతున్నారని లోక్‌సభ ప్రతిపక్షనాయకుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. గురువారం ఎల్.పి.జి.సిలిండర్ ధరల పెరుగుదల,కొరతపై పార్లమెంట్ మకర్ ద్వార్ వద్ద ఇండియా కూటమి ఎంపిల నిరసఇండియా కూటమి ఎంపిల ధర్నాలో రాహుల్ పాల్గొన్నారు. రాహుల్ మాట్లాడుతూ ఎల్.పి.జి గ్యాస్ సిలిండర్ల కొరతపై ప్రధాన మంత్రి మోడీ మాట్లాడటం లేదనీ ఆయన విధానంతోనే గ్యాస్ కొరత ఏర్పడిందనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పశ్చిమాసియా దేశాల్లో జరుగుతున్న యుద్ధంపై పార్లమెంట్ లో ఎందుకు చర్చ చేపట్టలేదనీ ఆయన నిలదీశారు.

# కవితకు సిబిఐ సమన్లు

## 16న విచారణకు రావాలని ఆదేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 12:** ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నివాసానికి గురువారం సీబీఐ అధికారులు వచ్చారు. మధ్యాహ్నం హైదరాబాద్‌లోని కవిత నివాసానికి వెళ్లిన సీబీఐ అధికారులు, ఈ నెల 16వ తేదీన విచారణకు హాజరు కావాలని కోరుతూ ఆమెకు సమన్లు అందజేశారు. ఫిబ్రవరి 27న ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు ఈ కేసులో



కవితతో పాటు అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా సహా 23 మందిని డిశ్చార్జ్ చేస్తూ సంచలన తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. సీబీఐ మోపిన అభియోగాలు నిరాధారమని కోర్టు అప్పట్లో పేర్కొంది. ట్రయల్ కోర్టు ఇచ్చిన డిశ్చార్జ్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ సీబీఐ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు... ట్రయల్ కోర్టులో ఈడీ కేసు విచారణను వాయిదా వేయాలని ఆదేశించడంతో పాటు, ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలోనే సీబీఐ అధికారులు కవితకు సమన్లు అందించారు. ఈ అంశంపై కవిత ఎక్స్ వేదికగా స్పందిస్తూ... 'ఈరోజు (గురువారం) మధ్యాహ్నం సీబీఐ అధికారులు నాకు నోటీసులు అందజేశారు. దీనిపై నా లీగల్ టీమ్‌తో చర్చిస్తున్నాను. చట్టంపై నాకు నమ్మకం ఉంది. విచారణకు సంపూర్ణంగా సహకరిస్తాను' అని పేర్కొన్నారు.

# విజయ డెయిరీ తెలంగాణ ఆరోపణలపై సమీక్ష

## ఎపి మంత్రి నారా లోకేశ్

**హైదరాబాద్, మార్చి 12, ప్రభాతవార్త:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించి విజయ డెయిరీ విషయంలో నెలకొన్న వివాదంపై ఎట్టకేలకు ఆ రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. విజయ డెయిరీ పేరుతో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మేఘన అనే సంస్థ కల్తీ పాలు అమ్ముతుందని తెలంగాణ విజయ డెయిరీ ఛైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి ఇటీవల ఆరోపించారు. హైదరాబాద్‌లోని ఆంధ్రప్రదేశ్ విజయ డెయిరీ ఫ్రాంఛైజ్ నిర్వహణపై తెలంగాణ విజయ డెయిరీ ఛైర్మన్ చేసిన ఈ ఆరోపణలు, అభ్యంతరాలపై తమ ప్రభుత్వం సమీక్షిస్తున్నట్టు ఆ రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ఈ మేరకు గురువారం ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. విజయ డెయిరీ పాల శాంపిళ్ల తీసుకొని ఏపీడీడీసీఎఫ్ నాణ్యత పరీక్షలు నిర్వహిస్తుందని స్పష్టం చేశారు. అంతేకాకుండా సీఎఎల్‌ఎఫ్ఎన్డీడీబీ పరీక్ష నివేదికలను పరిశీలిస్తామన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ర్యాండమ్‌గా శాంపిళ్ల సేకరిస్తున్నారని వివరించారు. వన్ నేషన్, వన్ మార్కెట్ అనేది ప్రధాని మోదీ నినాదమని ఈ సందర్భంగా ఉదహరించారు. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పాల ఉత్పత్తులను ఇతర రాష్ట్రాల్లోనూ విక్రయించవచ్చని పేర్కొన్నారు.



# టైమ్‌స్లాట్, ఎస్ఇడి దర్శన భక్తులు సమయానికి క్యూలైన్‌కు చేరుకోండి

## ఇబ్బందులు లేకుండా స్వామి దర్శనం

**తిరుమల,మార్చి 12ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు వస్తున్న భక్తుల సంఖ్య రోజురోజుకూ అనూహ్యంగా రెట్టింపవుతోంది. పెరుగుతున్న భక్తుల సంఖ్యకు తగ్గట్లు ఆఫ్‌లైన్‌లో టైమ్‌స్లాట్ ఎస్ఎస్‌డి దర్శన టోకెన్లు, ఆన్‌లైన్‌లో ముందుగానే ఎస్ఇడి 300 రూపాయలు దర్శన టిక్కెట్లు జారీచేస్తున్న విషయం విదితమే. ఈ దర్శనాల టిక్కెట్లు,టోకెన్ కలిగిన భక్తులు నిర్దేశిత సమయం కంటే ముందే తిరుమల వైకుంఠమ్ క్యూలైన్ల వద్దకు చేరుకుని అసౌకర్యం కలిగిస్తున్నారని టిటిడి తెలిపింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని వేసవిసెలవులు ఆరంభానికి ముందే కొన్ని చర్యలకు ఉపక్రమించింది. తిరుమల శ్రీవారి దర్శనానికి అమలవుతున్న పలు విధానాల్లో ఆఫ్‌లైన్‌లో టైమ్‌స్లాటెడ్ టోకెన్లు పొందిన, ఆన్‌లైన్‌లో ఎస్ఇడి టిక్కెట్లు కలిగిన భక్తులు నిర్ధేశిత సమయానికే క్యూలైన్ వద్దకు చేరుకోవాలని టిటిడి తెలిపింది. రోజువారీగా ఆయా సమయాల్లోనే భక్తులు వస్తే సులభంగా క్యూలైన్లలోనికి ప్రవేశించి స్వామివారిని దర్శించుకోవచ్చని తెలిపింది. స్లాటెడ్ సర్వ దర్శనం టోకెన్లు, ప్రత్యేక దర్శనం టికెట్లు (300 రూపాయలు)కలిగిన భక్తులు వారికి కేటాయించిన స్లాట్ ప్రకారం నిర్దేశిత సమయంలోనే అనుమతించడం జరుగుతుందని టిటిడి స్పష్టం చేసింది.

ఈ నిబంధనను టిటిడి ఇప్పుడు పటిష్టంగా అమలు చే స్తోంది. భక్తులు తమకు కేటాయించిన సమయానికంటే ముందుగా వచ్చి ఇబ్బంది పడవద్దని, సమయం పాటించే భక్తులను ఇబ్బంది పెట్టవద్దని విజ్ఞప్తి చేస్తున్నారు. భక్తులందరికీ సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు టిటిడి అధికారులు తీసుకున్న ఈ నిర్ణయాన్ని దృష్టిలో ఉంచుకుని తమకు కేటాయించిన సమయానికే క్యూలైన్ల వద్దకు చేరుకోవాలని భక్తులకు కోరారు.

# 15న అన్నమయ్య వర్ధంతి మహోత్సవం

**తిరుమల,మార్చి 12ప్రభాతవార్తప్రతినిధి:** పద కవి తా పితామహుడు తాళ్ళపాక అన్నమా చార్యల 523వ వర్ధంతి మహోత్స వం 15న ఆదివారం తిరుమలలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆరోజు మధ్యాహ్నం శ్రీవారి ఆలయం నుండి శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఊరేగింపుగా బయల్దేరి సాయంత్రం నారాయణగిరి ఉద్యానవనాలకు చేరుకుంటారు. అక్కడ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు సప్తగిరి సంకీర్తనా గోష్ఠిగానం నిర్వహించ నున్నారు. ఆ తరువాత స్వామివారు ఉభయ దేవేరులతో కలిసి ఊంజల్‌సేవలో పాల్గొని ఆలయానికి వేంచేపు చేస్తారు.- తాళ్లపాక అన్నమాచార్యుల 523వ వర్ధంతి ఉత్స వాలు రేపటి నుండి 21వ తేదీ వరకు టిటిడి నిర్వహించనుంది. ఈ ఉత్స వాలు అన్నమయ్య జన్మస్థలం తాళ్లపాకలోని ధ్యానమందిరం, 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద, తిరుమల నారాయణగిరి ఉద్యానవనం, తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరం,మహతి కళాక్షేత్రం లో జరుగనున్నాయి. రేపు ఉదయం 6 గంటలకు తిరుపతి అలిపిరి పాదాల మండపం వద్ద మెట్లోత్స వం వైభవంగా నిర్వహించబడు తుంది. 15న సంకీర్తన గోష్ఠిగానం, సాహితీ సదస్సు లు, భక్తి సంగీత కార్యక్రమాలు జరుగనున్నాయి.

# రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్‌కు ప్రోత్సాహం

**హైదరాబాద్, మార్చి 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్, దాని అనుబంధ ఉత్పత్తుల ఏర్పాటును ప్రోత్స హించేందుకు సర్కార్ నజరానాలు ఇస్తోంది. ఎలక్ట్రోలైజర్ ఆధారిత గ్రీన్ హైడ్రోజన్, అనుబంధ ఉత్పత్తుల ప్లాంట్లను స్థాపించే సంస్థలకు ఎలక్ట్రోలైజర్ స్టాక్ ప్లాంట్, వాటికి సంబంధించి పరికరాలపై 30 శాతం పెట్టుబడి రాయితీని అందిస్తోంది.

ఇందులో భాగంగా ప్రతి మెగావాట్‌కు 1,400 టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యానికి కోటి రూపాయల చొప్పున రూ.30 కోట్ల వరకూ గరిష్ఠ పరిమితికి లోబడ ఒక్కో ప్లాంట్‌కు పెట్టుబడి రాయితీ ఇస్తున్నట్లు తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ విషయమై స్పష్టం చేసింది. అలాగే ఇంటిగ్రేటెడ్ గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా, గ్రీన్ మిథనాల్ (బయోజనిక్ కార్బన్తో సహా) పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని కల్పిస్తోంది. ప్లాంట్, పరికరాల (ఎలక్ట్రోలైజర్తో సహా) పరిశ్రమల స్థాపనకు పెట్టే పెట్టుబడులపై 25 శాతాన్ని రాయితీగా అందిస్తోంది. కనీసం 500 మెగావాట్ల వార్షిక ఎలక్ట్రోలైజర్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన తొలి 5 ప్లాంట్లకు మాత్రమే ఈ రాయితీని వర్తించనుంది. అంతేకాకుండా రాష్ట్రంలో జరిపే గ్రీన్ హైడ్రోజన్, అనుబంధ ఉత్పత్తుల అమ్మకాలపై 100 శాతం ఎస్జీఎస్టీని 5 ఏళ్ల పాటు రీయింబర్స్ చేయనుంది.

అదే ఎలక్ట్రోలైజర్, హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ పరిశ్రమల శ్ర ఉత్పత్తుల అమ్మకాలపై ఏడేళ్ల పాటు 100 శాతం ఎస్జీఎస్టీ తిరిగి చెల్లింపు చేస్తోంది.

ఇదే సమయంలో గ్రీన్ హైడ్రోజన్ పరిశ్రమలకు 10 ఏళ్ల పాటు, ఎలక్ట్రోలైజర్ పరిశ్రమలకు 5 ఏళ్ల పాటు 100 శాతం విద్యుత్ పన్ను మాఫీ చేయనుంది. గ్రీన్ హైడ్రోజన్ పరిశ్రమశ్రలు రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థల నుంచి కొనుగోలు చేసే ప్రతి యూనిట్ కరెంటుకు రూ.3 చొప్పున 20 ఏళ్ల పాటు బిల్లులను తిరిగి చెల్లిస్తుంది. ఎలక్ట్రోలైజర్ పరిశ్రమలకు ఐదేళ్ల పాటు యూనిట్ విద్యుత్‌కు ఒక రూపాయి చొప్పున ఈ రాయితీ వర్తిస్తుంది.

అలాగే గ్రీన్ హైడ్రోజన్ పరిశ్రమల ఏర్పాటుకు కొనుగోలు చేసే స్థలాలకు 100 శాతం స్టాంప్ డ్యూటీని చెల్లించాలని ప్రతిపాదించింది.

# కావూరికి కన్నీటి వీడ్కోలు

## హైదరాబాద్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు

### భౌతికకాయం వద్ద ఘనంగా నివాళులర్పించిన మంత్రి పొన్నం, కెటిఆర్, బాలకృష్ణ, మురళీమోహన్, పలువురు మాజీ మంత్రులు, వివిధ పార్టీల నాయకులు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), మార్చి 12, ప్రభాతవార్త:** కేంద్ర మాజీమంత్రి కావూరి సాంబశివరావు(82)కు కన్నీటి వీడ్కోలు పలికారు. ఆయన పార్థివదేహాన్ని బంజారాహిల్స్‌లోని నివాసంలో అభిమానుల సందర్శనార్థం బుధవారం సాయంత్రం నుంచి ఉంచారు. కాగా ఆయన పార్థివ దేహానికి బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ నివాళులు అర్పించారు. ఆయనతోపాటు మాజీ మంత్రులు పువ్వాడ అజయ్, శ్రీనివాస్‌గౌడ్, మాగంటి సునీత గోపీనాథ్ తదితరులున్నారు. ఈ సందర్భంగా కెటిఆర్, కావూరి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ తరుపున, వ్యక్తిగతంగా కావూరికి, ఆయన కుటుంబసభ్యులకు తన ప్రగాఢసానుభూతిని ప్రకటించారు. కావూరి ఒక విలక్షణమైన వ్యక్తని అభివర్ణించారు. 2009లో రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలోనూ ఆయన సిరిసిల్లకు జౌళిశాఖ మంత్రిగా వచ్చారన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కావూరి భౌతిక కాయానికి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం దానం మాట్లా డుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నో అభివృద్ది కార్యక్రమాలకు కావూరి శ్రీకారం చుట్టారని, తెలంగాణలో ఆర్ఇసిలో చదవడమే కాకుండా వరంగల్‌లో తొలిగా తన నిర్మాణ పనిని ప్రారంభించారని గుర్తు చేశారు. అందరితో సత్సంబంధాలు పెట్టుకొన్న అందరికి కావాల్సిన వ్యక్తి అని కొనియాడారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆయన లేని లోటు తీర్చలేనిదన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు పార్టీ తరపున నివాళులు అర్పించారు.



కావూరి భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు

అనంతరం ఆయన మాట్లాడుతూ.. కావూరి పేద ప్రజల పెన్నిధిగా ఉంటూ, 1994లో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రారంభించారంటూ గుర్తు చేశారు. వీరితోపాటు సినీనటుడు నందమూరి బాలకృష్ణ, నామా నాగేశ్వర్‌రావుతోపాటు పలు రాజకీయ పార్టీలకు చెందిన నేతలు, సినీపరిశ్రమకు చెందిన సినీ పరిశ్రమకు చెందిన మురళీమోహన్, మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ పలువురు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు. గురువారం మధ్యాహ్నం తరువాత జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో కావూరికి అశ్రునయనాల మధ్య అంతిమ వీడ్కోలు పలికారు. వారు కావూరి భౌతికకాయానికి నివాళులు అర్పించారు.

ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, యరపతినేని శ్రీనివాసరావు, గిడుగు రుద్రరాజు, మాజీ ఎంపిలు హనుమంతరావు, జేడీ శీలం, టి. సుబ్బిరామిరెడ్డి, నాతి నాగేశ్వర్‌రావు, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి పద్మనాభయ్య,

# ప్రజాసమస్యల పరిష్కారానికే 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'

## రాష్ట్ర బిసి స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్

**హైదరాబాద్, మార్చి 12, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' జూన్ 12 వరకు కొనసాగుతుందని, ప్రభుత్వం నిర్దేశించిన అన్ని కార్యక్రమాలను జయప్రదం చేయాలని, తెలంగాణ బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ నూతీ శ్రీకాంత్ గౌడ్ అధికారులను కోరారు. గురువారం నాడు, దామోదరం సంజీవయ్య సంక్షేమ భవన్, బీసీ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి కార్యక్రమం కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయం ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించడం అందులో ఒక భాగం అని అన్నారు 99 రోజుల కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు అందరినీ భాగస్వాములను చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను, కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కోరారు. పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని, ప్రతిరోజు పార్కులకు వచ్చే వాకర్ల ఈ ప్రత్యేక పరిశుభ్ర కార్యక్రమంలో భాగస్వాములను చేసేందుకు అధికారులు కృషి చేయాలని అన్నారు. మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా వేసవి కావడంతో తాగునీటికి సంబంధించిన పైపుల రిపేర్, పైపులతో కొత్త కనెక్షన్లు వంటివి గుర్తించాలనీ సూచించారు. పాతవాటి రిపేర్లు కొత్త కనెక్షన్లకు మెటీరియల్ సేకరణపై కార్యాచరణ ప్రణాళిక, అధికారులు తయారు చేస్తారని అన్నారు. పంచాయతీ నిధులు 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం ఇతర వనరుల గుర్తింపు పూర్తి చేస్తారని అన్నారు. అన్ని ఇళ్లలో ద్రవ, ఘన, వ్యర్థాలను విడదీసి సేకరించే పని ప్రతి గ్రామ పంచాయతిదనీ ఆయన వివరించారు. వాటిని కంపోస్టు ఎరువు తయారీ వరద నిర్వహణ పద్ధతులపై శిక్షణ, ఈ వేస్ట్, బయో మెడికల్ వేస్ట్, శానిటరీ వేస్ట్, సేకరణ సురక్షితంగా డిస్పోజ్ చేయడం ద్రవ్య వ్యర్థాల నిర్వహణ చర్యలు కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్సు, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్ల వంటి వాటిని చేపడుతారని పేర్కొన్నారు. బీసీ కార్పొరేషన్ కు సంబంధించిన అన్ని పెండింగ్ ఫైళ్లను క్లియర్ చేయాలని, అందుకు కావలసిన కార్యాచరణను రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషనర్ శ్రీమతి బాలమాయాదేవి, ఎండి మల్లయ్య భట్టు, సీఈఓ అలోక్ కుమార్, ఎం.డి.లు ఉదయ్ ప్రకాష్, శ్రీమతి ఇందిరా, శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలకు డిమాండ్

## 15న ఫీజు పోరు దీక్షకు సిపిఎం సంపూర్ణ మద్దతు: జాన్‌వెస్లీ

**హైదరాబాద్, మార్చి 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సుమారు రూ. 7,500 కోట్ల ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈమేరకు గురువారం హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర బిసి విద్యార్థి సంఘం ప్రతినిధులు పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీని కలిశారు. ఈ నెల 15న ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న ఫీజు పోరు దీక్షకు మద్దతు కోరారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్ల కోసం నిర్వహించే ఈ దీక్షకు సీపీఐ(ఎం) పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. జాన్ వెస్లీ మాట్లాడు తూ... నిరుపేద బిసి, ఎస్సి, ఎస్టి, మైనారిటి విద్యార్థుల ఉన్నత చదువులకు వెన్నెముకగా ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ పథకాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేయడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రియంబర్స్‌మెంట్ పెండింగ్ వల్ల విద్యార్థులు ఉన్నత విద్యను మధ్యలోనే ఆపేయాల్సి రావడం అత్యంత దురదృష్టకర మన్నారు. కోర్సులు పూర్తి చేసినా బకాయిల సాకుతో విద్యా సంస్థలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు పైచదువులు, ఉద్యోగ అవకాశాలను కోల్పోయి, తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తులకు మేలు చేసే ప్రభుత్వం, పేద విద్యార్థుల విద్యకు నిధులు కేటాయించకపోవడం శోచనీయమన్నారు. సంక్షేమం గురించి గొప్పలు చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల విషయంలో మొండివైఖరి ప్రదర్శించకుండా బకాయిలను వెంటనే విడుదల చేయాలని హితవు పలికారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విద్యార్థుల ఖాతాల్లో నేరుగా జమ చేయాలని, సర్టిఫికెట్లు ఆపేసిన విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# స్టైపెండ్‌ను తక్షణమే అమలు చేయాలి

## వ్యవసాయ వర్సిటీలో విద్యార్థుల నిరాహార దీక్ష

**హైదరాబాద్ (అత్తాపూర్) మార్చి 12, ప్రభాతవార్త :** విద్యార్థుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుందని విద్యార్థులకు రావాల్సిన స్టైపెండ్ వెంటనే అమలు చేయాలని పలువురు యూనివర్సిటీ విద్యా ర్థులు డిమాండ్ చేశారు. గురువారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన పీజీ మరియు పీహెచ్‌డీ విద్యార్థులు తమ స్టైపెండ్ పెంపును అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆమరణ నిరాహార దీక్షకు దిగి పెద్ద ఎత్తున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నిరహార దీక్ష కూర్చున్న యూనివర్సిటీ స్కాలర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజ్‌కుమార్, కార్యదర్శి మనోజ్ కుమార్ గౌడ్, లోకేష్ ముదిరాజ్, వర్కింగ్ కమిటీ సభ్యులు మోనిక, సౌజన్యాలు మాట్లాడుతూ.. సంవత్సరం నుంచి ధర్నాలు, నిరసనలు, వినతిపత్రాల ద్వారా తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నాలు చేసినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి పరిష్కారం లభించలేదని వారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులపై పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుందని వాపోయారు. యూనివర్సిటీ పరిపాలన ఇప్పటికే పీజీ మరియు పీహెచ్‌డీ విద్యార్థుల స్టైపెండ్ పెంపును ఆమో దించి అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, ప్రభుత్వ అనుమతి లేకపోవడంతో అది ఇంకా అమల్లోకి రాలేదని చెప్పారు. దీంతో తీవ్ర నిరాశకు గురైన పరిశోధక విద్యార్థులు తమ న్యాయమైన డిమాండ్ పూర్తిగా నెరవేర్చే వరకు ఆమరణ నిరాహార దీక్ష కొనసాగిస్తామని హెచ్చరించారు. అదేవిధంగా స్టైపెండ్ పెంపు మాత్రమే కాక, యూనివర్సిటీ అభివృద్ధి కోసం రాష్ట్రానికి వెన్నెముకగా నిలుస్తున్న వెదురుగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ప్రత్యేకంగా 500 కోట్లు బడ్జెట్ కేటాయించాలని విద్య, పరిశోధ నలలో నాణ్యత పెంచి తెలంగాణ వ్యవసాయ రంగంలో కీలక మలుపులు తేవాలన్నారు. డిమాండ్‌లను నేరవేర్చేవరకు ఆమరణ నిరాహారదీక్షకు కొనసాగిస్తామని హెచ్చరించారు. విద్యార్థుల ధర్నా కార్యక్రమానికి ఇతర విద్యార్థులు, పలు సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఈ కార్యక్రమంలో పెద్దఎతున విద్యార్థులు పాల్గొన్నారు.




వ్యవసాయ విశ్వవిద్యాలయం ముందు నిరహారదీక్షలో పాల్గొన్న విద్యార్థులు



వెల్కిచర్లలో బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన తల్లీ, ఇద్దరు కూతుళ్ల (ఫైల్)

# ఇద్దరు కూతుళ్లుసహా తల్లి బావిలో దూకి ఆత్మహత్య

## కుటుంబకలహాలే కారణమంటున్న స్థానికులు.. పోలీసులు

**భూత్పూర్, మార్చి 12, ప్రభాతవార్త:** భార్యాభర్తల తగవులు, కుటుంబ కల హాల కారణంగా ఓ కుటుంబంలోని ఇద్దరు కూతుళ్లు, తల్లి ముగ్గురూ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం వెల్కిచర్లలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. వెల్కిచర్ల గ్రామానికి చెందిన కుర్వ భీరయ్య తనకున్న రెండెకరాల వ్యవసాయ పొలంలో బుధవారం బోరు వేయగా నీళ్లు పడ లేదు. మరో బోరు వేసేందుకు గురువారం భీరయ్య సిద్ధం కాగా, భార్య (మృతురాలు) కుర్వ జంగమ్మ(35) మరో బోరు వేసి అప్పుల పాలు కావద్దని భర్త భీరయ్యను వారించినప్పటికీ వినకుండా మరో బోరు వేసేం దుకు సిద్ధంకాగా, తన మాట వినకుండా తన భర్త మళ్లీ బోరు వేస్తు న్నాడనే కోపం, ఆవేశంతో జంగమ్మ తన ముగ్గురు పిల్లల్ని తీసుకుని తమ వ్యవసాయ పొలం సమీపంలో ఉన్న వ్యవసాయ బావిలోకి తన ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు(జస్వంత్) ముగ్గురిని బావిలో తోసేసి తాను దూకింది. కాగా ముగ్గురిలో ఎనిమిదేళ్ల కుమారుడు(జస్వంత్) బావిలో చెట్టుకొమ్మను పట్టుకుని బతికి బయటపడగా, ఇద్దరు కూతుళ్ల శైలజ (14), జ్యోతి(12), తల్లి జంగమ్మ(35) బావిలో మునిగి ప్రాణాలు విడిచారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు భూత్పూర్ పోలీస్ ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

# ముగిసిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు

**హైదరాబాద్, మార్చి 12, ప్రభాతవార్త:** ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు గురువారం ముగిశాయి. యేడాదిపాటు చదివి ఉత్కంఠతో పరీ క్షలు రాసిన విద్యార్థులు పరీక్షలు ముగియడంతో ఊపిరి తీసుకొని సంతోషంగా పరీక్ష కేంద్రాల్లో కేరింతలు కొడుతూ సందడి చేశారు. ఇంటర్మీ డియట్ పరీక్షలు గత నెల 25న ప్రారంభమయ్యాయి. పక్షం రోజులుగా రాసిన పరీక్షలకు సంబంధించిన అనుభవాలను పరీక్ష రాసిన తీరును స్నే హితులతో పంచుకొన్నారు. వసతిగృహాల్లో ఉండి చదువుకొనే విద్యార్థులు సొంత ఊళ్లకు పోవడానికి మధ్యాహ్నం లగేజిలతో బస్టాండుకు చేరుకొన్నారు. స్నేహితులకు వీడ్కోలు పలుకుతూ కేరింతలు కొడుతూ విద్యార్థులు రాష్ట్రవ్యాప్తంగా సందడి చేశారు. శుక్రవారంతో రెండో సంవత్స రం మాధ్యమిక విద్యార్థుల పరీక్ష కూడా ముగియనున్నది.

# భార్య వేధింపులతో భర్త ఆత్మహత్య

**హైదరాబాద్ (నేరేడ్‌మెట్), మార్చి 12, ప్రభాతవార్త :** దాంపత్య జీవితంలో విభేదాలు తీవ్రమై మానసిక వేదనకు గురి భర్త ఆత్మహత్యకు దారి తీసిన మరో విషాద ఘటన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. భార్యతో నెలకొన్న వివాదాలు, కేసుల కారణంగా ఆవేదనకు గురైన భర్త ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. నేరేడ్‌మెట్ లక్ష్మీనగర్‌కు చెందిన శ్రీనివాస్ (ప్రైవేటు ఉద్యోగి) స్వస్థలం మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్. 2013లో సట్టపల్లి జ్యోతిని వివాహం చేసుకున్నాడు. శ్రీనివాస్ తన భార్యను ప్రోత్సాహించగా ఆమె ఎక్సైజ్ శాఖలో ఉద్యోగం పొందిందని కుటుంబసభ్యులు తెలిపారు. అయితే ఉద్యోగంలో చేరిన తర్వాత దంపతుల మధ్య విభేదాలు పెరిగి కొంతకాలంగా వేరువేరుగా ఉంటున్నారని తెలిసింది. ఇదిలా ఉండగానే వరకట్న వేధింపుల కేసు, విడాకుల పిటిషన్ నమోదు కావడంతో శ్రీనివాస్ తీవ్రమానసిక ఆవేదనకు గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన ఇటీవల సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కుటుంబ కలహాలు తలెత్తినప్పుడు భార్యాభర్తల మధ్య సంభాషణ, పెద్దల మధ్యవర్తిత్వం, కౌన్సె లింగ్ వంటి మార్గాల ద్వారా పరిష్కారం వెతకాల్సి న అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. చిన్న విభేదాలు పెద్ద సమస్యలుగా మారకుండా రెండు కుటుంబాలు కూడా సమన్వయంతో వ్యవహరించడం అవసరమని వారు పేర్కొంటున్నారు.

# యశోద ఆస్పత్రిలో నకిలీ డాక్టర్ చేతివాటం

## రోగికి మత్తు ఇంజెక్షన్ ఇచ్చి బంగారు ఆభరణాల అపహరణ

### సిసిపుటేజీల ఆధారంగా పోలీసుల దర్యాప్తు

**హైదరాబాద్ (కంటోన్మెంట్), మార్చి 12, ప్రభాతవార్త:** సికిందరాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ రోగి వద్దకు డాక్టర్ వేషంలో వచ్చి మత్తుమందు ఇచ్చి 10 తులాల బంగారు అభరణాలను ఎత్తికెళ్లిన సంఘటన మార్కెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్‌బోయిన్‌పల్లి, డెయిరీఫాం రోడ్డులో నివాసం ఉంటున్న ప్రభుదాస్‌గౌడ్ భార్య సుధారాణికి ఈ నెల 10న వాంతులు, విరేచనాలు కావడంతో సికిందరాబాద్ యశోద ఆస్పత్రిలో చేర్పించారు. ఈ నెల 11న ఆమె డిశ్చార్జ్ కావాల్సి ఉంది. ఇదే అదునుగా భావించిన ఓ మహిళ డాక్టర్ వేషంలో వైట్‌అప్రాన్ వేసుకొనివచ్చి సుధారాణి గదిలోకి ప్రవేశించింది. రోగికి గైనిక్ సమస్య ఉందని చెప్పి అక్కడ ఉన్న ఆమె కుమారుడు, సోదరుడిని గదిలో నుంచి బయటకు పంపించింది. దీంతో రోగి వద్ద ఉన్న ఇద్దరు అటెండర్లు గదిలో నుంచి బయటికి వెళ్లి దూరంగా కూర్చున్నారు.

15 నిమిషాల తరువాత డాక్టర్ వేషంలో వచ్చిన ఆమె బయటికి వెళ్లిపోయింది. అప్పటికే ఆమె స్పృహతప్పి పడిపోయింది. ఏమి జరిగిందోనని కంగారుపడుతూ ఆమెను నిద్రలో నుంచి లేపారు. చూసే సరికి రోగి ఒంటిపై ఉన్న బంగారు గొలుసు, కమ్మలు, చేతికి ఉన్న బంగారు గాజులు, మాటీలు, 10 తులాల విలువ చేసే బంగారు అభరణాలు కనిపించకపోవడంతో షాక్‌కు గురయ్యారు. వెంటనే అమె బంధువులు ఆస్పత్రి యాజమాన్యాన్ని సంప్రదించగా అ మహిళ తమకు సంబంధించింది కాదని, ఆమె ఎవరో తమకు తెలియదని వారు తెలిపారు. దీంతో బాధితులు మార్కెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నప్రారం భించారు. ఆస్పత్రిలోని నర్సింగ్ స్టాఫ్‌రూమ్ సమీపంలో ఉన్న సీసీ కెమెరాల్లో నకిలీ డాక్టర్ కదలికలు రికార్డు అయ్యాయి. సీసీటీవి పుటేజీల ఆధారంగా నిందితురాలిని గుర్తించే పనిలో పోలీసులు ఉన్నారు.

# షబే ఖదర్‌కు 17న ఐచ్ఛిక సెలవు

**విజయవాడ.మార్చి 12,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో ముస్లింలకు రంజాన్ మాసంలో వచ్చే షబే ఖదర్ సందర్భంగా ఉద్యోగులకు ఐచ్చిక(అప్షనల్) సెలవులో మార్పు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రంజాన్ మాసంలో ముస్లిం ఉద్యోగులు దీన్ని వినియోగించుకుంటుంటారు. షబే ఖదర్ రాత్రి జాగారం చేసిన ఉద్యోగులకు ఆ తర్వాత రోజు ఈ ఐచ్చిక సెలవు ఇస్తుంటారు. ఇందులో మార్పు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ క్యాలెండర్ ప్రకారం ఈ ఏడాది ముస్లిం ఉద్యోగులకు షబే ఖదర్ ఐచ్చిక సెలవును మార్చి 15న ప్రకటించారు. అయితే నెలవంక ఆధారంగా జరిగే రంజాన్ మాసంలో భాగంగా ఈ నెల 17న సెలవు ఇవ్వాలని వక్ఫ్ బోర్డు ప్రభుత్వానికి సూచించింది.

వార్త

హింసకు హేతువు అహంకారం. అహంకారమే స్వపరభేదాలను సృష్టిస్తుంది. ఈ విభేదాలు హింసకు దారితీస్తాయి.

-శ్రీరమణ మహర్షి

# ఆదాయం మూరెడు వ్యయం బారెడు


శక్తికి మించిన సహకారం కానీ, సహాయం కానీ చివరకు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలుచేయడం అంత మంచిది కాదంటారు. మోయలేని భారం తలకెత్తుకుంటే మొదటికే మోసం వస్తుందన్న విషయం విస్మరించకూడదు. ఏదో ఒకటి, రెండు సందర్భా ల్లో అయితే అర్థం చేసుకోవచ్చు. అభినందించవచ్చు. కానీ అదేపనిగా ఆర్థికపరిస్థితి అర్థం చేసుకోకుండా అందిన కాడికి అప్పులు తెచ్చి ఖర్చుపెడుతూ, అది వ్యక్తికి కానీ, సంస్థకుకానీ, ప్రభుత్వానికి కానీ ఒకనాటికి చేతులెత్తని తప్పని పరిస్థితులు ఏర్పడక తప్పదు. దివాలా బాట పట్టాల్సిందే. ఇదేమీ కొత్త విషయం కాదు.అందరికి తెలిసిందే. ఎన్నో సంస్థలు, వ్యక్తులు, ఒకనాడు ఎంతో దేదీప్యమానంగా వెలుగొంది ఆ బాటలో నడిచి పతనావస్థకు చేరు కున్న ఉదాహరణలు కోకొల్లలు. ఆస్తులు అమ్ముకోవడం దివాలాకు సంకేతం. అవి కూడా ఆవిరి అయిపోయిన తర్వాత చివరి అంకమే దివాలా. దివాలా అనేది వ్యక్తి విషయంలో తీవ్రంగా పరిగణిస్తారు. ఒక రకంగా సమాజం బహిష్కరించినట్లే చూస్తుంది. దేశంలో అనేక రాష్ట్రాలతో పాటు తెలుగు రాష్ట్రాలు సైతం చేపడుతున్న కార్యక్రమాలు, వెచ్చిస్తున్న నిధులు, ప్రధానంగా ఉచితాలతో వస్తున్న ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకొని పరిశీలిస్తే ప్రభుత్వాలు ఆ బాటవైపు పయనిస్తున్నాయేమోనని పలువురు ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొన్న దేశ అత్యున్నత న్యాయస్థానం కూడా ఈ విషయంలో ఆందోళన వ్యక్తం చేసింది. తమిళనాడు ప్రభుత్వం విద్యుత్ విషయంలో పేద, ధనిక, అందరికి ఉచితంగా ఇస్తామని ప్రకటించడం సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఎన్నో రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి పిట్టను కొట్టా పొయ్యిలో పెట్ట అన్నట్లుగా ఉంది. జీత భత్యాలకే వెతుకులాడు కోవాల్సిన పరిస్థితులు నెలకొం టున్నాయి. తెలుగురాష్ట్రాల పరిస్థితి కూడా అందుకు భిన్నంగా లేదు. అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయే మోననిపిస్తున్నది. అయినా ఇష్టానుసారంగా కార్యక్రమాలకు వెచ్చిస్తున్నారు. ఇలా ఎంతకాలం కొనసాగిస్తారు. అప్పు పుట్టని పరిస్థితే వస్తే ఏం చేస్తారు? ఇటీవల శ్రీలంకలో పరిస్థితి ఏమైందో అందరికి తెలిసిందే. ఇప్పటికీ ఆ దేశం ఆర్థికసంక్షోభం నుంచి కోలుకోలేకపోతున్నది. ప్రతి అవసరానికి అప్పుల పైనే ఆధారపడాల్సిన పరిస్థితి చాలారాష్ట్రాల్లో కన్పిస్తున్నది. మనది సంక్షేమ ప్రభుత్వం, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాల్సిందే. దారి ద్ర్యరేఖకు దిగువనున్న లక్షలాది మంది బడుగు,బలహీన వర్గాలకు చేయూతనివ్వాల్సిందే. వారికి అన్నిరకాల సహకారం అందించాల్సిందే. అందులో మరో అభిప్రాయానికి తావులేదు. ప్రజాస్వామ్యవాదులు ఎవరూ దీనిని వ్యతిరేకించలేరు కూడా. కానీ వారి పేరు మీద జరుగుతున్న దోపిడీ మాటేమిటి? వారిని చూపి అనర్హులకు కోట్లాది రూపాయలు అప్పగించడం ఎంతవరకు సమంజసం? వేలాది కోట్ల రూపాయలు వడ్డీకి అప్పు తెచ్చుకుంటున్న డబ్బులు ఇలా దుర్వినియోగం చేయడం ఎంతవరకు న్యాయమో పాలకులు ఆలోచించాలి. భారతదేశానికి సంబంధించి పేదరికాన్ని నిర్మూలించేందుకు స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటికీ లక్షలాది కోట్ల రూపాయలు వెచ్చించారు, వెచ్చిస్తున్నారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న కోట్లాది కుటుంబాలను ఆదుకొని వారిని ఆ దుర్భర జీవితాల నుంచి గట్టెక్కించామని అంకెలతోసహా చెప్పుకుంటున్నారు. ప్రస్తుతం దేశంలో దారిద్ర్యరేఖకు దిగువనున్న వారు ఇరవైశాతానికి మించరని గ్రామీణాభివృద్ధి శాఖ చెప్పుకుంటున్నది.ఇందుకు విరుద్ధంగా పెరుగుతున్న తెల్లకార్డుల సంఖ్య చూస్తే విస్తుపోవాల్సి వస్తున్నది. దేశవ్యాప్తంగా దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ ఊహాకందని విధంగా తెల్లకార్డులు పెరిగిపోతున్నాయి. కొన్నిరాష్ట్రాల్లో ప్రధానంగా తెలుగు రాష్ట్రాల్లో కూడా ఇప్పటికీ లక్షలాది కుటుంబాలు తెల్లకార్డుల కోసం ఎదురు చూస్తున్నాయి. ఈ లెక్కల ప్రకారం చూస్తే దారిద్ర్యరేఖకు దిగువనున్న వారిసంఖ్య దాదాపు ఎనభై శాతం ఉన్నట్లు అర్థంఅవుతున్నది. అటు గ్రామీణాభివృద్ధి శాఖ చెబుతున్న లెక్కలుకానీ ఇటు పౌరసరఫరా శాఖలెక్కలు కానీ రెండూ రికార్డుల ప్రకారం వెల్లడిస్తున్నాయి. ఇందులో ఏదిసత్యం? ఏది అసత్యం అన్నది పాలకులకు తెలియంది కాదు. నిరుపేదల నోటికాడి సబ్సిడీ బియ్యాన్ని భోంచేయడానికి తెల్లకార్డుల రూపంలో కోట్లాది మంది అర్హతలేనివారెందరో పుట్టుకువస్తున్నారు. కొందరు డీలర్లు చేస్తున్న మాయాజాలంతో కూడా ఈ కార్డులు పెరుగుతున్నాయి. అందరికి తెలిసిన బహిరంగ రహస్యమే. వీరి ఆట కట్టించలేని దౌర్భాగ్యపరిస్థితి. ఒక్క రేషన్‌కార్డుల్లోనే కాదు, ప్రతికార్యక్రమంలోనూ అనర్హులు, దళారులు పెరిగిపోతున్నారు.ఇది వారి హక్కుగా భావిస్తున్నారు. అధికారులకు దళారులను నిరోధించలేని నిస్సహాయకస్థితి.అటు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో కానీ, మరే ఇతర పథకాల్లో కానీచివరకు ప్రాజెక్టుల నిర్మాణంలోకూడా జరుగుతున్న దోపిడీ అంతా ఇంతాకాదు. ప్రజాసేవ కోసమే ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన కొందరు నేతలు పర్సెంటేజీని బాహాటంగానే తీసుకుంటున్నారు. ఏ ప్రాంతంలో ఏమేరకు కాంట్రాక్టుల వద్ద పర్సెంటేజీలు తీసుకుంటున్నారో బహిరంగంగానే చర్చ జరుగుతున్నది.ఇప్పటికైనాకేంద్ర, రాష్ట్ర పాలకులు తన ఆర్థిక విధానాలనై ఆత్మపరిశీలన చేసుకోవాలి. రాజకీయాల ప్రయోజనాల కోసం ప్రవేశపెడుతున్న పథకాల విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలి. అప్పులు చేయడం కంటే అనవసరమైన ఖర్చులు తగ్గించుకొని నిర్మాణాత్మక కార్యక్రమాలు చేపట్టి అవినీతి నియంత్రిస్తే తప్ప ఎన్నివేల కోట్లు అప్పులు తెచ్చినా ప్రజలపై భారం వేసి పన్నుల రూపంలో ఎన్ని నిధులు వసూలు చేసినా ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడే అవకాశాలు లేవు.

శాంతంగా, నిబ్బరంగా ఉండగలగడమే నిజమైన శక్తికి నిదర్శనం.



స్వామి వివేకానంద

సంబంధికాకపోయినప్పటికీ ఎవడు మిత్రభావంతో మసలుతున్నాడో, అతడే బంధువు, అతడే మిత్రుడు, అతడే ఆశ్రయం.



గిల్బర్ట్

## ప్రజావాక్కు



### అవయవ మార్పిడి తక్షణ కర్తవ్యం

**ఏపిలో** అవయవ మార్పిడి లేదా చికిత్స కోసం దరఖాస్తు చేసుకున్నవారిలో యువకులు,చిన్నారులు47శాతం ఉన్నారు. ఇది మన జీవనశైలి, జన్యు కారణాలు, ఆహార పదార్థాల స్వచ్ఛత లోపంతో పాటు అనేక కారణాలు ఉన్నవి. ప్రధానంగా కాలేయం, మూత్రపిండాలు, ఇతర వ్యాధుల వల్ల మార్పిడికి కారణం.వ్యాధిరహితంగా ఉండడం చాలా అరుదు. వ్యాధిపట్ల బాధ్యత, ఎరుకే ఏకైక పరిష్కారం. ఇష్టమైన విధంగా ఆహారం ఎంచుకుంటే, శరీరం దాని పని చేసుకుపోతుంది. సదుపాయం, రుచి కన్నా ఆహారం పరిస్థితి మూలం. దీనికి తోడు ఇతర కాలుష్యాలు తోడు. ప్రాణం కోసం అవయవం లభించి చికిత్స అందడం ఏ వ్యక్తికయినా రెండో పుట్టక. మనకర్తవ్యం గుర్తెరిగి ప్రభుత్వం చేస్తున్న సహాయం.

- బొల్లోజు మేఘనాదం, విశాఖపట్నం

### ఇంధన స్వేచ్ఛ

**భారత్‌పై** టారిఫ్‌ల హెచ్చరికలతో కలిసి అంతర్జాతీయ వాణిజ్య రాజకీయాల్లో కలకలం రేపుతున్నాయి. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లను తగ్గించాలన్న ఒత్తిడే ఈవ్యాఖ్యల వెనుక ప్రధానకారణంగా కనిపిస్తోంది. అయితే ఈ అంశాన్ని కేవలం విదేశాంగ కోణంలోనే కాకుండా, రాష్ట్రాల ఆర్థిక ప్రయోజనాల పరంగా కూడా చూడాల్సిన అవసరం ఉంది.తెలంగాణ వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రానికి ఇంధనధరలు అత్యంత కీలక అంశం. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా పరిశ్రమలు, ఐటీ రంగం, రవాణా వ్యవస్థలు పెద్దఎత్తున ఇంధనంపై ఆధారపడి ఉన్నాయి. చమురు ధరలు పెరిగితే నేరుగా ప్రభావం పడేది రాష్ట్ర ఆర్థిక కార్యకలాపాలపైనే.

- టి.శ్రీనివాస్, హైదరాబాద్

### చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలి

**తెలంగాణ** రాష్ట్ర గిరిజన సంస్థ గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అర్థమయ్యేరీతిలో చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలి. విద్య వైద్యం రవాణా విద్యుత్ గృహవసతి వ్యవసాయరంగంవంటి అంశాలపై గిరిజన సంక్షేమ శాఖలో గిరిజన గురుకులాలలోపనిచేస్తున్న లెక్చరర్స్ టీచర్స్‌ను గిరిజన సంక్షేమంపై పరిశోధనలు నిర్వహించాలి.

- రాపాక, రవీందర్ జనగాం

### మందుల ధరలు తగ్గించాలి

**రోగం**మనిషిని శారీరకంగా మాత్రమే కాకుండా ఆర్థికంగా కూడా దెబ్బతీస్తుంది.ఆ బలహీనతనే లాభంగా మార్చుకునే వ్యవస్థలు ఉన్నంతకాలం ఆరోగ్యం అనే భావన మాటలకే పరిమితం అవుతుంది.తాజాగా వెలుగులోకి వచ్చిన ఔషధవ్యాపారంలో అక్రమ లాభాల వ్యవహారం కొన్ని మందులపై వెయ్యి ఎనిమిది వందల శాతం వరకు లాభం వసూలు చేస్తున్నారన్న వాస్తవం మన ఆరోగ్య వ్యవస్థలోని దోపిడీని బయటపెట్టింది. ఔషధ ధరల నియంత్రణకు చట్టాలు ఉన్నప్పటికీ అవి ప్రజల రక్షణకు సరిపడేలా అమలవడం లేదు.తయారీదారుడి నుంచి చిల్లర విక్రేత వరకుప్రతిదశలో లాభాలు పెంచుకుంటూ చివరికి రోగి జేబుపై భారాన్ని మోపుతున్నారు. మందు అనేది ఎంపిక కాదు,అది ప్రాణాలతో ముడిపడి ఉంటుంది. ఆ అవసరాన్ని ఆసరాగా చేసుకుని ధరలు పెంచడం మానవీయంగా ఘోరమైన నేరం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### యుద్ధాలతో ఆకలికేకలు

**ఈ ప్రపంచ** ఆధిపత్య పోరాటాల రూపంలో ఆకలి చావులు సంభవించే అవకాశం ఉంది. రష్యా, ఉక్రెయిన్ యుద్ధంలో సకాలంలో ఆహారం అందక స్కెలిటెన్‌గా మారిన శరీరాలతో పిల్లలు ఉన్న దృష్టాలు కనబడ్డాయి. రష్యా, ఉక్రెయిన్ మీద చూపిన ఆధిపత్యం వల్లనే అనే విషయం విదితమే. అయితే ఇప్పుడు గ్రీన్ ల్యాండ్ బహిరంగంగా మేము తీసేసుకుంటాం అని మెక్సికోను అలాగే తీసుకుంటాం, కొలంబియాను కూడా ఇలాగే తీసుకుంటాం అని ఇప్పటికే వెనుజుల దేశాధ్యక్షుడిని ఎత్తుకెళ్ళాం అని బహిరంగంగా ప్రకటించిన నేపథ్యంలో ప్రజల సంక్షేమం పరిస్థితి ఏమిటి అనే విషయం ప్రమాదకరమైన విషయం. ఆధిపత్యం పోరులో సామాన్య జనం ఆకలి చావులు సంభవించడం ఈ దాశబ్దపు విచారం.

- భారత అవినాష్, జనగామ

### భవిష్యత్తుకు ప్రమాదం

**ప్రపంచ** వలస విధానాలు క్రమంగా కఠినతరమవుతున్న ఈ పరిస్థితుల్లో,స్థిరమైన వ్యూహాలనుఅవలంబించడం అనివార్యం. భారతీయ యువత, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల విద్యార్థులు, తమ ప్రతిభను ప్రదర్శించి స్థానిక స్థాయిలో స్టార్టప్స్‌ను స్థాపిస్తే, దేశీయ ఉపాధి అవకాశాలు విస్తరించడంతో పాటు, గ్లోబల్ టెక్ రంగంలో మన స్థానం మరింత బలపడుతుంది. ఇది నిజమైన డిజిటల్ స్వావలంబనకు దారి తీస్తుంది.

- సి.హెచ్.సాయిరిత్విక్, నల్గొండ

మనవి **ఎడిట్ పేజీకి..** ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# యుద్ధం చాటున ప్రపంచ శాంతి విలవిల

**రాజులకాలం నాటి దండయాత్రలు, దురాక్రమణల నుండి మనిషి ఆధునిక కాలంలో పరిపక్వత చెంది విజ్ఞతతో కూడిన మేలైన జీవనాన్ని సాగిస్తాడనుకుంటే అధికార దాహం, స్వార్థం కాస్త మూర్ఖత్వం వైపు ప్రయాణించేలా చేస్తుంది. భూమ్మీద అమ్మ నాన్నలు ప్రాణం పోస్తే మెరుగైన జీవనం, జీవించే హక్కు కల్పించాల్సిన దేశం ఆ ప్రాణాలను యుద్ధం రూపంలో సమాధి చేస్తుంది. ప్రపంచంలో చిన్న దేశాలకు అండగా నిలుస్తూ వాటి సార్వభౌమత్వాన్ని కాపాడే అగ్రరాజ్యులే ప్రపంచ శాంతిని పక్కనబెట్టి యుద్ధానికి కాలుదువ్వుతున్నాయి. రెండవ ప్రపంచ యుద్ధం అనంతరం దాని పరిణామాల దృష్ట్యా ప్రపంచ శాంతికి హక్కుల గురించి ఐక్యరాజ్య సమితి ఏర్పడింది కానీ ఇది యుద్ధ నష్టాలను లెక్కలేయడం, నష్టపోయిన దేశాలకు సహాయం అందించడానికే పరిమితం అవుతుంది. యుద్ధంలో ఏ దేశం గెలుస్తుందో ఏమోకానీ యుద్ధం చాటున ప్రపంచ దేశాలు ఓడిపోతున్నాయి అన్నది నిజం.**

బైరబోయిన వెంకటేశ్వర్లు

ప్రపంచంలో మనిషి అవసరాలకు కావాల్సిన వనరులన్నీ ఒకే చోట కేంద్రీకృతం అయి లేవు. అవి ప్రపంచమంతటా విస్తరించి ఉన్నాయి. అందుకే ఏ దేశం అయిన తమకు కావాల్సిన వనరులని సమృద్ధిగా కలిగి లేదు. ఒక దేశం మరొక దేశంపై ఆధారపడవలిసిందే. మనిషి మరయంత్రం కనుగొన్న నుండి చమురు వాడకం మొదలై ప్రస్తుత ప్రపంచం మొత్తం చమురుపైనే ఆధారపడుతుంది. చమురు అమ్ముకొని కొన్ని దేశాలు అభివృద్ధి చెందితే చమురు వాడుకొని కొన్ని దేశాలు అభివృద్ధి చెందుతున్నాయి. ఎంత చమురు ఉత్పత్తి చేసినా, ఎంత చమురు వాడుకున్న అంత అభివృద్ధి చెందినట్టు లెక్క. అందుకే చమురుపై అధికార దాహం కాస్త యుద్ధాలకు దారి తీస్తుంది. ప్రస్తుతం ప్రపంచం అంత అనిశ్చితిలో ఉంది. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ఒకవైపు అయితే అమెరికా ఇజ్రాయిల్ రెండు కలసి ఇరాన్‌పై యుద్ధం చేస్తున్నాయి. యుద్ధంలో పాల్గొనే దేశాల్లో రూపాయి రూపాయితో పేర్చి నిర్మించిన ఆర్థికవ్యవస్థ కుప్పకూలుతుంది. దేశాలలో ద్రవ్యోల్బణం పెరుగుతుంది.యుద్ధాల వల్ల మౌలిక సదుపాయాలకు అభివృద్ధికి ఉపయోగించే ప్రజల వేల కోట్ల రూపాయాలు బూడిదవుతున్నాయి. యుద్ధాల వల్ల అభివృద్ధికి సూచికలైన నిర్మాణాలు రక్షణ వ్యవస్థలు నిర్వీర్యమవుతున్నాయి. ప్రయోగించిన బాంబులు మిస్సైల్, డ్రోన్ల దేశ ఆర్థిక నిర్మాణాలను బూడిద చేయడంతో పాటు పర్యవరణాన్ని నాశనం చేస్తున్నాయి. భావితరాలకు ఉపయోగ పడే శిలాజ ఇంధనాలు కాస్త యుద్ధంలో వృధాగా కాలి బూడిదవుతున్నాయి. ఏ దేశంలోనైన పిల్లలే ఆ దేశ భవిష్యత్తూ కానీ యుద్ధం పరిస్థితులు రేపటి తరాల భవిష్యత్తు అంధకారంలోకి నెడుతున్నాయి. యుద్ధ నియమావళి ప్రకారం రక్షణ విభాగాలనే లక్ష్యంగా చేసుకోవాలి కానీ అది గురితప్పి జనవాసాలు లక్ష్యాలు అవుతున్నాయి. చమురు శుద్ధి కేంద్రాలు, విమానాశ్రయాలు, జలశుద్ధి కేంద్రాలు నాశనమవుతున్నాయి. పాఠశాలల మీద కూడా బాంబులు కురిపిస్తున్నారు. అమెరికా ఇజ్రాయిల్ దాడిలో అసువులు బాసిన ఇరాన్ లోని 160 మంది పిల్లల సామూహిక ఖననం ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. పేదలతో పాటు ధనికులను కూడా పేదలను చేస్తుంది. యుద్ధంలో భాగంగా ఇంధన రాకపోకలకు ముఖ ద్వారం అయిన హోరముజ్ జలసంధిని ఇరాన్ మూయడంతో ఇంధనరవాణా కష్టం అవుతుంది. యుద్ధానికి ముందు ఒక చమురుబ్యారెల్ ధర 70డాలర్లు ఉంటే అది క్రమంగా పెరుగుతూ ప్రస్తుతం 100 డాలర్లు దాటి 200 డాలర్ల వరకు చేరుకుంటుందని విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం చమురు ఉత్పత్తిలో సింహ భాగమైన గల్ఫ్ దేశాలు యుద్ధ ప్రభావంతో ఉన్నాయి. దీనితో ప్రపంచ దేశాలకు చమురు ఎగుమతి కష్టంగా మారుతుంది. చమురు దిగుమతి చేసుకునే కొన్నిదేశాలలో నిల్వలు రోజురోజుకు అడుగంటుతున్నాయి. ఉత్పత్తి నుండి వినియోగదారులకు అందే సప్లై చైన్ సిస్టమ్ దెబ్బతింటుంది. చమురు



ధరలు పెరిగితే, వస్తు ఉత్పత్తికి కావాల్సిన ముడి సరుకు సేకరణ నుండి దానిని వస్తువుగా మార్చి వినియోగదారులకు చేరవేసే ప్రతి అంశంలో నిర్మాణ,రవాణా ఖర్చులు పెరిగే అవకాశం ఉంది. దీనితో ప్రతివస్తువు ధరలు పెరుగుతాయి. ఇది ప్రజలపై ఆర్థిక భారమని చెప్పాలి. చమురు కాకుండా ప్రపంచానికి కావాల్సిన మూడో వంతు యూరియా వ్యవసాయ ఉత్పత్తులు మధ్య ప్రాచుర్యంనుండి ఉత్పత్తి రవాణా అవుతున్నాయి. యుద్ధం ఇంకా కొనసాగితే దీనిపై ప్రభావం పడనుంది. మన దేశ విషయానికొస్తే వినియోగించే చమురులో 85శాతం దిగుమతి మీదనే ఆధారపడుతుంది.అలాగే యుద్ధ ప్రభావం భారత ఎగుమతులపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. దేశంలో దాదాపు పట్టణాల నుండి గ్రామాల వరకు వంటకు గ్యాస్ మీదనే ఆధారపడి ఉన్నాయి. యుద్ధ ప్రభవంతో గ్యాస్ ధరలు పెరుగుతున్నాయి. తాజాగా మన దేశంలో గ్యాస్‌పై పరిమితులు విధించడం నిత్యావసర చట్టాన్ని గ్యాస్‌పై ప్రయోగించడం మొదలైంది. దేశంలో గ్యాస్ కంపెనీలు తమ ఉత్పత్తిని పెంచాలని కృత్రిమ కొరత సృష్టించోద్దని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వాణిజ్య సిలిండర్ల కొరత ఏర్పడే అవకాశం ఉంది. యుద్ధ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. యుద్ధం రూపంలో సాధారణ మనుషుల బ్రతుకులు ఛిద్రమవుతున్నాయి. ఏదీ ఏమైనా యుద్ధం సామాన్యుని నడ్డి విరుస్తుంది అనడంలో సందేహం లేదు. ఇది యుద్ధంలో పాల్గొనే దేశాలలో కాకుండా ప్రపంచదేశాలను అన్నింటినీ ప్రభావితం చేస్తుంది.ప్రస్తుతం అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలపై ప్రభావం చూపనుంది. యుద్ధంలో ప్రత్యక్షంగా పాల్గొనకున్న యుద్ధ ప్రభావం మాత్రం ప్రపంచంలోని ప్రజలందరిపై పడుతుంది.పెరుగుతున్న చమురు ధరలకు తగినంతగా విదేశీ నిల్వలు లేక దేశాలు ఇబ్బంది పడే అవకాశం ఉంది. ఈ తరుణో క్రమంగా వృద్ధి చెందుతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగించేలా ఉంది. అంతర్గత సమస్యలు ప్రకృతి విపత్తులను ఎదుర్కుంటూ దేశాలు ముందుకు సాగుతున్న వేళ ఈ రాజకీయ సంక్షోభం వల్ల ఏర్పడిన యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను వెనక్కి నెడుతుందని చెప్పాలి. రాజులకాలం నాటి దండయాత్రలు, దురాక్రమణల నుండి మనిషి ఆధునిక కాలంలో పరిపక్వత చెంది విజ్ఞతతో కూడిన మేలైన జీవనాన్ని సాగిస్తాడనుకుంటే అధికార దాహం, స్వార్థం కాస్త మూర్ఖత్వం వైపు ప్రయాణించేలా చేస్తుంది. భూమ్మీద అమ్మ నాన్నలు ప్రాణం పోస్తే మెరుగైన జీవనం, జీవించే హక్కు కల్పించాల్సిన దేశం ఆ ప్రాణాలను యుద్ధం రూపంలో సమాధి చేస్తుంది. ప్రపంచంలో చిన్న దేశాలకు అండగా నిలుస్తూ వాటి సార్వభౌమత్వాన్ని కాపాడే అగ్ర రాజ్యులే ప్రపంచ శాంతిని పక్కనబెట్టి యుద్ధానికి కాలుదువ్వుతున్నాయి. రెండవ ప్రపంచ యుద్ధం అనంతరం దాని పరిణామాల దృష్ట్యా ప్రపంచ శాంతికి హక్కుల గురించి ఐక్యరాజ్య సమితి ఏర్పడింది కానీ ఇది యుద్ధ నష్టాలను లెక్కలేయడం, నష్టపోయిన దేశాలకు సహాయం అందించడానికే పరిమితం అవుతుంది. యుద్ధంలో ఏ దేశం గెలుస్తుందో ఏమో కానీ యుద్ధం చాటున ప్రపంచ దేశాలు ఓడిపోతున్నాయి అన్నది నిజం. ●

# న్యాయస్థానాల్లో సిటిజన్స్ చార్టర్ అవసరం



తడకమళ్ళ మురళీధర్

కక్షిదారులకు ఉచిత న్యాయ సేవలు, సహాయం అందుబాటులోకి తేవాలనే సదుద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం భారత రాజ్యాంగంలో సవరణలు చేసి న్యాయసేవల అధికారిక చట్టం, 1987ని అమల్లోకి తీసుకువచ్చింది. ఈ చట్టాన్ని ప్రస్తుతానికి దేశంలోని అన్నిరాష్ట్రాలు అమలు పరుస్తున్నాయి. దీని ప్రకారం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ జాతులు, స్త్రీలు, చట్టంలో సూచించబడిన ఇతర బీద, బలహీన వర్గాల వారు ఉచిత న్యాయసేవలు, సహాయానికి అర్హులు. కేసు దాఖలు నుండి తీర్పు ప్రతులు పొందే వరకు అన్ని సేవలు వీరికి ఉచితంగా అందించబడతాయి. ఉచిత న్యాయసేవలు, సహాయం గురించి దాదాపు ప్రతి కోర్టుల సముదాయంలో ప్రకటనలు,కరపత్రాలు మనం గమనిస్తూ ఉంటాం. ఇదంతా ఒక పార్శ్వమయితే, సత్వర నాణ్యమైన న్యాయం కోసం కక్షిదారులు అర్రులు చాస్తున్నారనేది కాదనలేని నిజం. కేసు తుది అంకానికి చేరుకోడానికి సంవత్సరాలు గడిస్తే, వాదనలు విన్న పిదప తీర్పు వెలువరించడానికి కొన్ని నెలలు తీసుకుంటున్నారని, ఆపై తీర్పు లేదా ఉత్తర్వు ప్రతులు అందించటానికి కొన్ని వారాలు పడుతుందని, ఇన్ని అసౌకర్యాల మధ్య గెలిచిన వాడు, ఓడినవాడు ఇరువురు అసంతృప్తితో ఉన్నారనేది కూడా నగ్నసత్యం. సుప్రీంకోర్టు తమ తీర్పుల ద్వారా హైకోర్టు న్యాయమూర్తులకు తీర్పు వెలువరించటానికి గరిష్ట కాలపరిమితి విధిస్తూ చాలా సార్లు మార్గదర్శకాలు జారీ చేసింది. దిగువ కోర్టు న్యాయమూర్తులు తుది వాదనలు విన్న నాటి నుండి సివిల్ కేసుల్లో 60 రోజులకు మించకుండా, క్రిమినల్ కేసుల్లో 45 రోజులకుమించకుండా తీర్పు లేదా ఉత్తర్వు వెలువరించాలని చట్టాలు చెబుతున్నాయి. అయితే ఈ నిబంధనలను కొంతమంది న్యాయమూర్తులు సక్రమంగా పాటించకపోవడంతో కక్షిదారులపరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. తీర్పులు ఒక నిర్దిష్ట సమయంలో వెలువరించాలనే సుప్రీంకోర్టు తీర్పులు, సంబంధిత చట్టాలు చెబుతున్నాయనే విషయం చాలా మందిసాధారణప్రజానీకానికి తెలియదు.



నిర్ణీత సమయంలో తీర్పు వెలువరించ నట్లయితే సంబంధిత న్యాయమూర్తిని ప్రశ్నిస్తే కోర్టుధిక్కారం అవుతుందేమో లేక తీర్పు తమకు వ్యతిరేకంగా వస్తుందేమో అనే జంకు సహజంగా కక్షిదారుల్లో ఉంటుంది. ఇటువంటి అపోహను తొలగించి కక్షిదారులకు న్యాయస్థానాలపై నమ్మకం, మరింత గౌరవం పెరగాలంటే, న్యాయస్థానాల్లో పార దర్శకత, జవాబుదారీ విధానాన్ని కల్పించాలంటే ప్రస్తుత పరిస్థితులకనుగుణంగా ఉన్నత న్యాయవ్యవస్థ కొన్ని చర్యలు సత్వరమే చేపట్టవలసిన అవసరం ఉంది. ముఖ్యంగా పౌర సేవలు అందించే కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రదర్శిస్తు న్నట్లు సిటిజన్స్ చార్టర్ న్యాయస్థానాల్లో కూడా కీలకమైన పాత్రను పోషిస్తుంది. అంటే ఇది సేవల ప్రమాణాలు కాల పరిమితులకు సంబంధించిన విధానాలను నిర్దేశిస్తుంది.సివిల్ దావా, అప్పీలు దావా, క్రిమినల్ కేసుల్లో చార్జిషీటు, ప్రైవేటు ఫిర్యాదు, క్రిమినల్ అప్పీలు మొదలగు వాటిని దాఖలు చేసిన నాటి నుండి కోర్టులు రిజిస్ట్రేషన్‌కు తీసుకునేగరిష్ట కాలపరిమితి, తీర్పు లేదా ఉత్తర్వు వెలువరించటానికి హైకోర్టుకు సుప్రీం కోర్టు నిర్దేశించిన గరిష్ట కాలపరిమితి, దిగువ కోర్టులకు తీర్పులు వెలువరించటానికి చట్టాలు నిర్దే శించిన నిర్దిష్ట కాలపరిమితి, ఉచిత తీర్పు ప్రతులు జారీ చేయడానికి గరిష్ట కాలపరిమితి, డాక్యుమెంట్లు, ఇతర ఉత్తర్వుల నకళ్ళు ఖర్చులతో జారీ చేయటానికి తీసుకునే గరిష్ట కాలపరిమితి తెలియజేసే ఒక నియమావళిని బహిర్గతం చేస్తూ పారదర్శకత కోసం హైకోర్టు, దిగువ కోర్టుల్లో ప్రస్ఫుటంగా అందరికీ కనిపించే ప్రదేశంలో సిటిజన్స్ చార్టర్ లాంటి కాలపట్టిక ప్రదర్శించాలి. అదే రీతిలో ప్రతి కోర్టులో పెండింగులో ఉన్నటువంటి కేసుల సంఖ్య, పరిష్కరించబడి నటువంటి కేసుల సంఖ్య, కేటగిరి వారీగా, సంవత్సరం వారీగా ప్రతి మూడు లేదాఆరు నెలలకోసారి ప్రదర్శించాలి. దానివల్ల పాత, క్రొత్త కేసుల సంఖ్యా వివరాలు న్యాయవాదులకు, కక్షిదారులకు తెలియడమే కాకుండా పాత కేసుల పరిష్కారానికి కోర్టు ప్రాధాన్యత నిస్తుందనే విషయం వారికి బోధపడ్డుంది. అంతేకాకుండా భవిష్యత్తులో కక్షిదారులకు సకాలంలో నాణ్యమైన సేవలుఅందించే సంస్కరణలు రూపు దిద్దుకునే అవకాశం లేకపోలేదు. ఎప్పుడైతే కక్షిదారులకు నిబంధనల గురించి పరిజ్ఞానం ఉంటుందో, న్యాయ స్థానాలు కూడా జవాబుదారీ తనంతో వ్యవహరిస్తాయి.ఈ కార్యానికి సంబంధిత కోర్టు చర్యలు తీసుకునే విధంగా ఉన్నత న్యాయస్థానాలు మార్గదర్శకాలు జారీ చేయాలి. ●

(విశ్రాంత జిల్లా జడ్జి)

# కాలుష్యరహితంగా జాతరలు జరగాలి



పిల్లా తిరుపతిరావు

తెలుగు ప్రజలు వారి నివాస ప్రాంతాల్లో కొన్నినిర్దిష్ట రోజుల్లో పలు ఉత్సవాలు, జాతరలు నిర్వహిస్తుంటారు. ఇవి ఆయా ప్రాంతాల ప్రజల చరిత్ర,సంస్కృతి, వారసత్వ సంపదకు సాక్షీభూతంగా నిలుస్తాయి. సాధారణంగా సంక్రాంతి పండుగ పోయిన వెంటనే జాతర్ల సీజన్ మొదలవుతుంది. ఇది తొలకరి కాలం వచ్చేవరకు సాగుతుంది. ఈ జాతరలు గిరిజన, మైదాన, తీరప్రాంతాలు అనే తేడా లేకుండా జరుగుతాయి. ఆయా ప్రాంతాలలో వెలసియున్న గ్రామదేవతల లేదా స్థానిక దేవుళ్ళ వార్షిక ఉత్సవాలను జాతరలుగా చేయడం పరిపాటి. ఇంకా పలు పుణ్యక్షేత్రాలలో కొలువై ఉన్న ప్రఖ్యాత దేవుళ్ల పేరుమీద కూడా యాత్రలు నిర్వహించబడతాయి. ఇవన్నీ ప్రతియేటా క్రమం తప్పకుండా జరుగుతుండడం విశేషం. ఇవి మూడు రోజులనుండి పది రోజుల కాలవ్యవధిగా కొనసాగుతుంటాయి. ఈ యాత్రలను స్థానిక ప్రజలు అంగరంగ వైభవంగా నిర్వహించుకుంటారు. ఈ జాతరలకు లక్షలాదిమంది భక్తులు హాజరవుతుంటారు. వారంతా స్థానిక దేవతామూర్తులను అత్యంత భక్తి ప్రపత్తులతో దర్శించుకుంటారు. ఈ యాత్రలకు పిల్లాదిమొదలు కుటుంబ సభ్యులంతా కలిసి వెళ్తారు. రాష్ట్రేతర ప్రాంతాల నుండి ప్రజలు పెద్దయెత్తున హాజరుకావడం గమనిస్తాం. మేడారంలో సమ్మక్క సారలక్క గిరిజన జాతర వైభవోపేతంగా జరుగుతుంది. తెలంగాణా ప్రభుత్వం సందర్శకులకు అనేక సదుపాయాలు కల్పించి యాత్రను ఘనంగా నిర్వహిస్తుంది. ఈ యాత్రకు కోట్లమంది భక్తులు హాజరవుతారనడం ఎంతమాత్రమూ అతిశయోక్తి కాదు. ఇంకా తెలంగాణలో నాగోబా జాతర, బోనాల పండుగ ప్రసిద్ధమైనవి. ఇదే మాదిరిగా ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం జిల్లాలో వత్సలవలస రాజులమ్మ యాత్ర వారంలో శని, ఆదివారాల్లో జరుగుతుంది. ఇలా ఆరేడు వారాలు వరుసగా యాత్ర కొనసాగడం విశేషం. ప్రతివారం లక్షల కొలదీ భక్తులు యాత్రకు వస్తుంటారు. ఇంకా విజయనగరం పైడితల్లమ్మ సిరిమానోత్సవం, శంబర పోలమాంబ యాత్ర, రాజాం పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర, చీపురుపల్లి కనక మహాలక్ష్మి అమ్మవారి యాత్ర, కమ్మసిగడాం మహాలక్ష్మి యాత్ర, అనకాపల్లి నూకాలమ్మ తల్లి జాతరలు కన్నుల పండుగగా జరుగుతుంటాయి. ఇంకా కళింగాంధ్ర అంతటా జగన్నాథుని రథాయాత్రలు వైభవంగా జరుపుతారు. మధ్యాంధ్రలో భీమవరం మావుళ్ళమ్మ జాతర, ఏలూరు గంగమ్మ పోతురాజు బాబు జాతర, నెల్లూరు ప్రాంతంలో రొట్టెల పండుగ ఘనంగా జరుపుతారు. రాయలసీమలో తిరుపతి గంగమ్మ జాతర, దేవరగట్టు జాతర, అహోబిలం పార్వేట ఉత్సవం, శ్రీకాళహస్తి ఏడుగంగల జాతర ప్రసిద్ధికెక్కాయి. ఇవే కాకుండా రాష్ట్రంలో ప్రఖ్యాతినొందిన పుణ్యక్షేత్రాలైన తిరుమల బ్రహ్మోత్సవాలు, శ్రీముఖలింగం, రామతీర్థం, సింహాచలం, విజయవాడ కనకదుర్గమ్మ, గుణదల



మేరీమాత, కోటప్పకొండ ప్రభల తిరునాళ్ళు, లేపాక్షిఉత్సవం, అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల వార్షిక ఉత్సవాలుగా జరుగుతాయి. వీటిని తిలకించేందుకు కోట్ల మంది జనం సంబంధిత ప్రాంతాల్లో గుమిగూడుతారు. ఇవే కాకుండా వినాయక చవితి, దసరా, శ్రీరామనవమి, బతుకమ్మ పండుగల పేరిట ప్రతి ఏడాది ప్రజలు ఉత్సవాలు చేసుకుంటుంటారు. ఇవన్నీ వివిధ ప్రజాసమూహాల సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల మేళవింపుగా జరుగుతాయి. ఈ యాత్రలతోపాటు ఉత్తరాంధ్రలో ఉన్న గ్రామాలలో వెలసియున్న పలు గ్రామదేవతల పేరిట ఉత్సవాలు జరుగుతుంటాయి. ఇవి జనవరి నుంచి జూన్ మధ్య కాలంలో ఎక్కువగా నిర్వహించబడతాయి. ఈ ఉత్సవాలను ఊరి పెద్ద పండుగనీ, అసిరమ్మ పండుగనీ అనడం కద్దు. అయితే ఇవి ఏటేటా జరగవు. కొన్ని సంవత్సరం తప్పించి సంవత్సరానికి, మరికొన్ని చాలా సంవత్సరాల విరామంతో జరుగుతాయి. ఐతే ప్రతి ఏడాది క్రమం తప్పకుండా జరుపుకునే సంబరాలు కూడా ఉంటాయి. వీటిని వారాలు అని అంటారు. ఇవి ఆయా గ్రామ ప్రజలచే ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడడం చూస్తుంటాం. సాధారణంగా రెండు వారాల పాటు ఈ గ్రామదేవత ఉత్సవాలు జరుగుతాయి. ఒక వారం గ్రామదేవతను ఊర్లోకి తెస్తారు. ఆ రెండోవారం వనంగుడికి సాగనంపుతారు. ఈతంతు యావత్తూ మేళతాళాలతో, వివిధ కళా ప్రదర్శనలతో అంగరంగ వైభవంగా జరుగుతాయి. గ్రామంలో గల కుటుంబాలన్నీ తమ తమ బంధుమిత్రులను ఆహ్వానించి ఘనంగా ఉత్సవాలను నిర్వహించుకుంటారు. ఈ పండుగల్లో సదరు కుటుంబానికి చెందిన ఆడపిల్లలు, అల్లుళ్లు, మనవళ్ళు ప్రత్యేక ఆకర్షణగా కనబడతారు. ఈఉత్సవాల చివరి మూడు రోజులూ ప్రజలు హెచ్చుసంఖ్యలో హాజరవుతుంటారు. వారంతా ఉత్సవాల్లో ఒకరికొకరు భావోద్వేగాల్ని పంచుకొని ఆనందంగా గడుపుతారు. ఈ జాతరలు గ్రామీణ సంస్కృతికి అద్దంపడతాయి. పంటలు బాగా పండాలనీ, ప్రజలంతా ఆరోగ్యంతో ఉండాలనీ స్థానిక దేవతలకు జనం పూజలు చేస్తారు. చాలామంది భక్తులు పొట్టేళ్ళు, మేకపోతులు, కోళ్ళు బలి ఇస్తుంటారు. బోనాలు సమర్పిస్తుంటారు. ఇంకా అగ్నిగుండాల ఏర్పాటు, జానపద నృత్యాలు, పౌరాణిక పద్యనాటకాలు, సాంప్రదాయ వేషధారణలు, విద్యుద్దీపాలతో వీధుల అలంకరణ, మందుగుండు సామాన్లు కాల్చడం, మరికొన్ని సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఈ యాత్రలలో పల్లె ప్రజలే కాకుండా, పట్టణ ప్రాంతవాసులు కూడా హుషారుగా పాల్గొంటారు. నేటి పట్టణాలు ఒకప్పుడు పల్లె ప్రాంతాలే కదా! అందువల్ల కొన్ని జాతరలు పట్టణాల నడిబొడ్డున, శివార్లలో జరుగుతుంటాయి. పల్లైనా, పట్నమైనా జాతర అంటే జాతరే. సందడి సందడిగా ఉంటుంది. ఎన్నో మధుర జ్ఞాపకాలను పంచుతుంది. అయితే ఈరెండు సందర్భాలలో పర్యావరణానికి హెచ్చుస్థాయిలో ప్రమాదం వాటిల్లుతుంది. గాలి, నీరు, ఆహారం కలుషితమోతుంది. డీజే, మైక్ సెట్టింగ్‌ల వినియోగం వలన శబ్ద కాలుష్యానికి అంతే ఉండదు. విష రసాయన మందుగుండు సామాన్లు కాల్చడం వలన గాలిలో విషవాయువులు చేరుతాయి. జన సమ్మర్థత వల్ల వలన స్థానికంగా ఉండే నీటి వనరులు కలుషితమవుతాయి.చుట్టు పక్కల భూ ఆవరణమంతా దుర్గంధభరితమై వివిధ రకాల వ్యాధుల వ్యాప్తికి కారణభూతం అవుతుంది. అందువల్ల ఈజాతరలు, గ్రామదేవత ఉత్సవాలను పర్యావరణ కాలుష్యరహితంగా జరుపుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. దీనికై ప్రభుత్వం ప్రజలు ఐక్యంగా కృషిచేయాలి.పక్కాప్రణాళికలతో స్థానిక పరిపాలనా విభాగాలు పనిచేయాలి.అధికార యంత్రాంగం ముందస్తుగా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ●

# గ్యాస్ సంక్షోభం మధ్య పుకార్లు వ్యాప్తి



## అప్రమత్తంగా ఉండాలని మంత్రులకు ప్రధాని దిశానిర్దేశం

## ప్రతిపక్షాల ఆరోపణలు తిప్పికొట్టాలని మోడీ పిలుపు

**న్యూఢిల్లీ, మార్చి 12:** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలోని చాలా ప్రాంతాలలో గ్యాస్ కొరత పెరుగుతోంది. ఎల్‌పిజి సిలిండర్ల కోసం పొడవైన లైన్లు కలకలం సృష్టిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కీలక హెచ్చరిక జారీ చేశారు. ప్రస్తుత పరిస్థితిని భయాందోళనకు గురిచేయడానికి ప్రయత్నిస్తున్న వారిపై నిఘా ఉంచాలని ప్రధాని మోడీ తన మంత్రులను ఆదేశించారు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి భారతదేశం సన్నాహాలు బలంగా ఉన్నాయని ప్రధాని మోడీ పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితిపై భయాందోళనలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్న వారిని నిశితంగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. మంత్రులు సోషల్ మీడియాలో కూడా చురుగ్గా ఉండాలని సూచించారు. అలాగే ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని పేర్కొన్నారు. మంత్రులు విశ్వాసాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. "ఇలాంటి ప్రచారాలకు ప్రతిస్పందించేటప్పుడు మంత్రులు విశ్వాసాన్ని కాపాడుకోవాలి. ఇది ఒక దేశాన్ని మాత్రమే కాకుండా మొత్తం ప్రపంచాన్ని ప్రభావితం చేసే పరిస్థితి" అని అన్నారు. ఎలాంటి సంక్షోభానైనా ఎదుర్కొనేందుకు భారతదేశం సిద్ధంగా ఉందని, ఇందుకు సన్నాహాలు చాలా బలంగా ఉన్నాయని ఆయన అన్నారు.

### ఇరాన్ విదేశాంగ మంత్రితో జైశంకర్ చర్చలు

**- హార్ముజ్ నుంచి నౌక రవాణాకు గ్రీన్‌సిగ్నల్**

**- ముంబై చేరిన చమురు నౌకలు, ట్యాంకర్లు**

దేశంలో గ్యాస్ సంక్షోభం తలెత్తిన తరుణంలో మంచి శుభవార్త అందింది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చితో జరిపిన దౌత్య చర్చలు ఫలించాయి. చర్చల తర్వాత, ఇరాన్ భారతదేశం కోసం హార్ముజ్ జలసంధిని తెరవడానికి అంగీకరించింది. ఇరాన్ ఇప్పుడు భారత జెండా కలిగిన ట్యాంకర్లను దాని గుండా వెళ్ళడానికి అనుమతించింది. ప్రస్తుతం భారత్ ఆయిల్ ట్యాంకర్లు కదిలేందుకు ఇరాన్ మార్గం సుగమం చేసినట్లుగా గురువారం కేంద్ర ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఈ పరిణామం భారతీయులకు తీపికబురుగానే చెప్పొచ్చు. అంతేగాక భారత్‌కు ఇరాన్ ప్రత్యేక రాయితీని మంజూరు చేసింది.

భారత్ ట్యాంకర్లు విడిచి పెట్టేందుకు ఇరాన్ అంగీకరించింది. రష్యా, ఫ్రాన్స్ విదేశాంగ మంత్రులతో జైశంకర్ జరిపిన చర్చల ఫలితంగానే ఇదంతా జరిగినట్లుగా తెలుస్తోంది. ఈ క్రమంలోనే సౌదీ ఆరేబియా నుంచి ముడి చమురును మోసుకెళ్తున్న లైబీరియన్ జెండా కలిగిన ట్యాంకర్ ముంబై తీరానికి సురక్షితంగా చేరుకుంది. ప్రస్తుతం పుష్పక్, పరిమల్ అనే రెండు భారతీయ ట్యాంకర్లు జలసంధిని సురక్షితంగా దాటుతున్నాయి.

### ఇంధన కొరత లేదు, పుకార్లు నమ్మకండి

**- పార్లమెంట్‌లో పెట్రోలియం మంత్రి హార్దీప్ సింగ్ పూరి**

దేశంలో ఇంధన కొరత లేదు, ప్రస్తుతం తగినంత ముడి చమురు నిల్వలు ఉన్నాయని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖల మంత్రి హార్దీప్ సింగ్ పూరి స్పష్టం చేశారు. పెట్రోల్, డీజెల్, విమాన ఇంధన సరఫరాలో ఎలాంటి కొరత లేదని చెప్పారు. దేశీయ రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని అన్నారు. ప్రజలు ఎలాంటి పుకార్లను వ్యాప్తి చేయవద్దని, నకిలీ కథనాలను సృష్టించకుండా ఉండాలని పార్లమెంట్ వేదికగా ప్రజలను కోరారు. గురువారం పార్లమెంటులో హర్దీప్ సింగ్ పూరి మాట్లాడుతూ, భారతదేశంలో ఇంధన పరిమాణం సురక్షితంగా ఉందని పునరుద్ఘాటించారు. "భారతదేశం ముడి చమురు సరఫరా స్థానం సురక్షితంగా ఉంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అత్యుత్తమ దౌత్యపరమైన సహకారంతో హార్ముజ్ జలసంధి అందించగల దానికంటే ఎక్కువగా ముడి చమురు పరిమాణాలను పొందింది" అని పేర్కొన్నారు.

ఈ ప్రాంతంలో పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల మధ్య పశ్చిమాసియాకు వెలుపల దిగుమతి వనరులను వైవిధ్యపరచడం ద్వారా భారతదేశం తన ఇంధన అవసరాలను కాపాడుకుంటోందని, దేశీయ గ్యాస్ సరఫరాలు స్థిరంగా ఉన్నాయని ఆయన అన్నారు. దేశం వివిధ వనరులు, సరఫరా మార్గాల ద్వారా ఇంధన దిగుమతులను స్వీకరిస్తూనే ఉంది. భారతదేశం ఇప్పుడు దాదాపు 40 దేశాల నుండి ముడి చమురును దిగుమతి చేసుకుంటున్నదని వివరించారు.

దేశీయ వినియోగదారులకు కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సిఎన్‌జి), పైప్డ్ నేచురల్ గ్యాస్ (పిఎన్‌జి) పూర్తి సరఫరాలు అందుతూనే ఉన్నాయని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా గృహాలకు సరసమైన ఇంధన సరఫరాను నిరంతరాయంగా అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి నొక్కి చెప్పారు. "దేశీయ వినియోగదారులకు ఎటువంటి కొరత లేదు. భయపడాల్సిన అవసరం లేదు" అని పూరి అన్నారు. ఎలాంటి సంక్షోభం తలెత్తినా ఎదుర్కొనేందుకు కూడా కేంద్రం సిద్ధంగా ఉందని చెప్పారు.



## ఇజ్రాయెల్‌పై హెజ్‌బొల్లా భీకరదాడులు

**జెరుసలెం, మార్చి 12:** లెబనాన్‌కు చెందిన ఉగ్ర సంస్థ హెజ్‌బొల్లా ఇజ్రాయెల్‌పై భీకర దాడికి పాల్పడింది. ఒక్క రాత్రే సుమారు 200 రాకెట్లను ఫైర్ చేసింది. ఇజ్రాయెల్ ఉత్తరం వైపున ఆ దాడి జరిగింది. వేల సంఖ్యలో ఇజ్రాయిలీ ప్రజలు ప్రాణ రక్షణ కోసం షెల్టర్లకు వెళ్లి దాక్కున్నారు. హిజ్‌బుల్లా గత వారం రోజుల్లో తొలి సారి భారీ ఎత్తున రాత్రి వేళల్లో దాడి చేసింది. ఇరాన్‌కు మద్దతుగా ఇజ్రాయెల్‌పై హిజ్‌బుల్లా అటాక్ చేస్తున్న విషయం తెలిసిందే. తాజా దాడిలో తొలుత ఒకేసారి సుమారు వందకు పైగా రాకెట్లను ఫైర్ చేసింది. రాత్రి 8 గంటలకు ఆ ఫైరింగ్ జరిగింది. మరో వైపు అదే సమయంలో ఇరాన్ ఓ క్షిపణిని ఇజ్రాయెల్ సెంట్రల్ రీజియన్ దిశగా ఫైర్ చేసింది. ఆ తర్వాత రాత్రంతా హిజ్‌బుల్లా వరుసగా రాకెట్లను విడిచింది. హిజ్‌బుల్లా చేసిన దాడి గురించి తమ ప్రజలకు సరైన సమయంలో అప్‌డేట్ ఇవ్వలేకపోయినట్లు ఐడీఎఫ్ అంగీకరించింది. హిజ్‌బుల్లా దాడి ప్రారంభమైన తర్వాత ఉత్తర ప్రాంత ప్రజలకు మిలిటరీ అప్‌డేట్ సందేశాలు పంపినట్లు తెలిసింది. అప్పటికే ఆలస్యం జరిగిందని, కానీ ముందుగానే ప్రజలకు హిజ్‌బుల్లా రాకెట్ దాడి గురించి వివరించాల్సి ఉందని ఐడీఎఫ్ తెలిపింది. ఐడీఎఫ్ ప్రకారం బుధవారం రాత్రి హిజ్‌బుల్లా సుమారు 200 రాకెట్లను , 20 డ్రోన్లను ఫైర్ చేసింది. దీంట్లో చాలా వరకు రాకెట్లను ఇంటర్‌సెప్ట్ చేశారు. కొన్ని రెసిడెన్షియల్ ప్రాంతాల్లో పడ్డాయి. అన్ని డ్రోన్లను అడ్డుకున్నారు. రాకెట్లు దూసుకొస్తున్న సమయంలో లాంచర్లను గుర్తించి వాటిని పేల్చివేసినట్లు ఐడీఎఫ్ చెప్పింది.

## గోయింగ్ డార్క్ వ్యూహంతో హార్ముజ్ దాటేసిన భారత నౌక!



**న్యూఢిల్లీ,మార్చి 12:** భారతీయ కెప్టెన్ నేతృత్వంలోని ఆయిల్ ట్యాంకర్ సురతంగా భారత్ చేరింది. ఇరాన్ దాడులు చేస్తున్న ప్రమాదకర హార్ముజ్ జలసంధిని దాటేందుకు 'గోయింగ్ డార్క్ వ్యూహాన్ని అనుసరించింది. లైబీరియా జెండా కలిగిన చమురు ట్యాంకర్ షెన్‌లాంగ్ సూయెజ్‌మాక్స్ బుధవారం ఉదయం ముంబై పోర్ట్‌కు చేరుకున్నది. సౌదీ అరేబియాలోని రాస్ తనురా ఫిప్‌యార్డ్ నుంచి 1,35,335 మెట్రిక్ టన్నుల క్రూడ్ ఆయిల్‌ను భారత్‌కు దిగుమతి చేసింది. భారతీయ కెప్టెన్ సుక్షాంత్ సింగ్ సంధు దీనికి నేతృత్వం వహించారు. భారత్, పాకిస్థాన్, ఫిలిప్పీన్స్ పౌరులతో కూడిన 29 మంది సిబ్బంది ఇందులో ఉన్నారు. యుద్ధ వాతావరణ పరిస్థితుల్లో భారతీయ కెప్టెన్ సుక్షాంత్ సింగ్ సంధు నేతృత్వంలోని లైబీరియా ఆయిల్ ట్యాంకర్ షెన్‌లాంగ్ సూయెజ్‌మాక్స్ మార్చి 1న సౌదీ అరేబిలోని రాస్ తనూరా ఫిప్‌యార్డ్ నుంచి చమురు లోడ్‌తో బయలుదేరింది. మార్చి 8న హార్మూజ్ జలసంధి వద్దకు చేరుకున్నది. ఈ ఆయిల్ ట్యాంకర్ ఇక్కడ ఉన్న సంకేతాలు చివరిసారిగా మార్చి 8న కనిపించినట్లు సముద్ర ట్రాకింగ్ డేటా చూపించింది. ఆ తర్వాత ఈ ఆయిల్ ట్యాంకర్ జాడ ట్రాకర్ నుంచి అదృశ్యమైంది. హార్ముజ్ జలసంధిలోని ఆయిల్ ట్యాంకర్లు, కార్గో షిప్‌లపై ఇరాన్ దాడులకు పాల్పడుతున్నది. ఈ నేపథ్యంలో తన ఉనికిని పసిగట్టకుండా ఉండేందుకు గోయింగ్ డార్క్ వ్యూహాన్ని ఈ ట్యాంకర్ అనుసరించింది. నౌకలోని ఆటోమేటిక్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ (ఏఐఎస్), ట్రాన్స్‌పాండర్స్ స్విచ్‌లను ఆఫ్ చేశారు. రెండు రోజుల పాటు రాత్రివేళ అత్యంత అప్రమత్తంగా హార్ముజ్ జలసంధి మీదుగా ఈ ఆయిల్ ట్యాంకర్ ప్రయాణించింది. సురక్షితంగా దాటిన తర్వాత భారత సముద్ర జలాల్లోకి ప్రవేశించింది. ఆ తర్వాత ఈ ఆయిల్ ట్యాంకర్‌లోని ఆటోమేటిక్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ (ఏఐఎస్), ట్రాన్స్‌పాండర్‌ల స్విచ్‌ను ఆన్ చేశారు. దీంతో సముద్ర ట్రాకింగ్ వ్యవస్థలపై ఈ ట్యాంకర్ మళ్లీ కనిపించింది. ఈ ఆయిల్ ట్యాంకర్ హార్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటేందుకు ఇరాన్‌తో భారత్ దౌత్య సంప్రదింపులు కూడా సహకరించాయి. శత్రువులు తమను లక్ష్యంగా చేసుకోకుండా ఉండేందుకు, ట్రాక్ చేయడాన్ని నివరించేందుకు కార్గో ఫిప్‌లు తరచుగా గోయింగ్ డార్క్ వ్యూహాన్ని అనుసరిస్తాయి. దాడులు వంటి ప్రమాదాల నుంచి బయటపడతాయి. అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే ఈ వ్యూహాన్ని అనుసరిస్తాయి.

## సిఇసిని తొలగించాలని 200 మంది ఎంపిల సంతకాలతో నోటీస్



**న్యూఢిల్లీ, మార్చి 12:** దేశ చరిత్రలోనే తొలిసారి విపక్ష ఎంపీలు ఎన్నికల ప్రధాన కమిషనం జ్ఞానేశ్‌కుమార్ ను విధుల నుంచి తొలగించాలని కోరుతూ విపక్షాలు నోటీస్ ఇవ్వబోతున్నాయి. ఈ నోటీస్‌పై ఇప్పటికే దాదాపుగా 200మంది ఎంపీలు సంతకాలు చేసినట్లు సమాచారం. అందులో 130 మంది లోక్‌సభ సభ్యులు, 63 మంది రాజ్యసభ సభ్యులు ఉన్నారని నాయకులు చెపుతున్నారు. శుక్రవారం లోక్‌సభలోగానీ, రాజ్యసభలోగానీ ఎన్నికల ప్రధాన కమిషనర్‌ను తొలగించాలని కోరుతూ ప్రతిపక్షాలు తీర్మానం ప్రవేశపెట్టే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఎన్నికల ప్రధాన కమిషనర్ తొలగింపు నోటీస్‌పై ఎంపీలు ఉత్సాహంగా సంతకాలు చేస్తున్నారని, ఇప్పటికే నోటీస్ ఇచ్చేందుకు అవసరమైన ఎంపీల సంఖ్య పూర్తయ్యిందని లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ గురువారం చెప్పినట్లు తెలుస్తోంది. ఎన్నికల ప్రధాన కమిషనర్ తొలగింపు కోరుతూ నోటీస్ ఇవ్వాలంటే ఆ నోటీస్‌పై కనీసం 100 మంది లోక్‌సభ సభ్యులు, కనీసం 50 మంది రాజ్యసభ సభ్యులు సంతకాలు చేయాల్సి ఉంటుంది. ఆ సంఖ్య ఇప్పటికే దాటినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రతిపక్ష ఇండి కూటమి పార్టీలకు చెందిన ఎంపీలు ఈ నోటీస్‌పై సంతకాలు చేసినట్లు సమాచారం. ఆమ్‌ఆద్మీ పార్టీ ఎంపీలు కూడా సంతకాలు పెట్టినట్లు తెలుస్తున్నది. ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అధికార బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే కారణంతో ఆయన తొలగింపును కోరుతూ ఎంపీలు నోటీస్ ఇచ్చేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

## ఇరాన్‌లో చిక్కుకున్న 9వేల మంది భారతీయులను భారత్‌కు తీసుకువస్తాం

విదేశాంగ ప్రతినిధి రణదీప్ జైస్వాల్

**న్యూఢిల్లీ, మార్చి 12:** ఇరాన్‌లో చిక్కుకుపోయిన తొమ్మిదివేలమంది భారతీయులందర్నీ ఇండియాకు తీసుకొస్తామని హామీ ఇచ్చింది. ఈ మేరకు నిరంతరం ప్రయత్నాలు చేస్తున్నట్లు వెల్లడించింది. కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ ప్రకటన జారీచేసారు. ఇరాన్‌లో చిక్కుకున్న 9,000 మంది భారతీయుల్ని వెనక్కి తెచ్చేందుకు భారతీయ సంస్థలు నిరంతరం పని చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఇరాన్‌లో విద్యార్థులు, నౌకా సిబ్బంది, వ్యాపారస్తులు, యాత్రికులు, ఉపాధి కోసం వెళ్లిన వారు.. ఇలా వివిధ రంగాలకు చెందిన వారు తొమ్మిదివేల మంది ఉన్నారని ఇప్పటికే వేల మంది ఇండియాకు చేరుకున్నప్పటికీ మిగిలినవారు అక్కడే ఉండిపోయారన్నారు. ఇప్పుడు వారు ఇరాన్ నుంచి బయటపడేందుకు అవసరమైన సాయం చేస్తున్నామని రణధీర్ అన్నారు. నేరుగా ఇండియాకు రాలేనివారు ఇరాన్‌కు దగ్గరగా ఉన్న అజర్‌బైజాన్, అర్మేనియా ద్వారా ఇండియా రావొచ్చని తెలిపారు. ఈ దేశాల నుంచి ఇండియాకు విమానాలున్నాయని వెల్లడించారు. వీరు ఇరాన్‌ను వీడేందుకు, ఇతర దేశాలకు చేరేందుకు అవసరమైన వీసాల మంజూరు, ఇతర అనుమతులు త్వరగా వచ్చేలా చూస్తున్నామన్నారు.

## మాజీ సిఎం ఫరూక్ అబ్దుల్లాపై ఆగంతకుడి దాడి

### ఎన్‌ఎస్జీ కమాండో అప్రమత్తతో తప్పిన ప్రాణాపాయం

**శ్రీనగర్, మార్చి 12:** జమ్మూకశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు, మాజీ సీఎం ఫరూక్ అబ్దుల్లా (88) హత్యాయత్నం నుంచి త్రుటిలో ప్రాణాలతో బయటపడ్డారు. జమ్మూలోని గ్రేటర్ కైలాష్ ప్రాంతంలో ఉన్న రాయల్ పార్క్‌లో నిన్న సాయంత్రం ఓ వివాహ వేడుకకు హాజరైన సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఓ దుండగుడు ఆయనపై పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో కాల్పులు జరిపేందుకు ప్రయత్నించగా, భద్రతా సిబ్బంది అప్రమత్తమై దాడిని విఫలం చేశారు. ఫరూక్ అబ్దుల్లా వేడుకలో ఉండగా, ఓ వ్యక్తి ఆయనకు అత్యంత సమీపంగా వెనుక నుంచి వచ్చాడు. తుపాకీతో ఫరూక్‌పై గురిపెట్టి కాల్పులు జరపబోయాడు. వెంటనే స్పందించిన జెడ్‌ప్లస్ భద్రతలోని నేషనల్ సెక్యూరిటీ గార్డ్ కమాండోలు దుండగుడిని పక్కకు నెట్టేశారు. దీంతో తూటా గురి తప్పి ఫరూక్ అబ్దుల్లా సురక్షితంగా బయటపడ్డారు. ఈ నాటకీయ పరిణామాలకు సంబంధించిన వీడియోలు వెలుగులోకి వచ్చాయి. దాడి విఫలమైన వెంటనే అక్కడున్న వారు దుండగుడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని జమ్మూలోని పురానాస్ మండీకి చెందిన కమల్ సింగ్ జమ్వాల్ (65)గా గుర్తించారు.

## బెంగాల్ గవర్నర్‌గా ఆర్ఎన్‌రవి బాధ్యతలు

### మీరు బెంగాల్‌ను ప్రేమిస్తే బెంగాల్ మిమ్మల్ని ప్రేమిస్తుంది: సిఎం మమత



**కోల్‌కత్తా మార్చి 12:** పశ్చిమ బెంగాల్ 22వ గవర్నర్‌గా ఆర్.ఎన్. రవి గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో ముఖ్యమంత్రి ఇతర మంత్రులు ప్రముఖులు హాజరైన ఈ కార్యక్రమంలో గవర్నర్‌చేత హైకోర్టు చీఫ్‌జస్టిస్‌ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమం అనంతరం ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆయనతో తొలిసారి సంభాషిస్తూ ఒక కీలక సందేశాన్ని ఇచ్చారు. "మీరు బెంగాల్‌ను ప్రేమిస్తే, బెంగాల్ కూడా మిమ్మల్ని ప్రేమిస్తుంది" అని ఆమె రవికి సూచనప్రాయంగా తెలిపారు. ప్రమాణ స్వీకారం ముగిశాక, మమతా బెనర్జీ కొత్త గవర్నర్‌కు శాలువా కప్పి స్వాగతం పలికారు. బెంగాల్‌లో అన్ని భాషల ప్రజలు కలిసిమెలిసి శాంతియుతంగా ఉంటారు. బెంగాల్‌ను ప్రేమించే వారిని బెంగాలీలు కూడా ప్రేమిస్తారన్నది ముఖ్యం. ఇది బెంగాలీల నైజం అని వివరించారు. దీనికి గవర్నర్ రవి స్పందిస్తూ పశ్చిమ బెంగాల్ దేశానికి మేధో, సాంస్కృతిక రాజధాని అనేది నిజమని అన్నారు. మమత చేసిన ఈ వ్యాఖ్యల వెనుక బలమైన రాజకీయ సందేశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా లేదా రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించేలా రాజ్ భవన్ నుంచి ఎలాంటి చర్యలు ఉండకూడదనేది ఆ సందేశం సారాంశం అని విశ్లేషిస్తున్నారు. గతంలో గవర్నర్‌గా పనిచేసిన జగ్‌దీప్ ధన్‌ఖడ్, ఆ తర్వాత వచ్చిన సి.వి. ఆనంద బోస్‌ల హయాంలోనూ రాష్ట్ర ప్రభుత్వానికి, రాజ్ భవన్‌కు మధ్య తీవ్రమైన ఘర్షణ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో మమత వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మార్చి 5న సి.వి. ఆనంద బోస్ గవర్నర్ పదవికి అనూహ్యంగా రాజీనామా చేయగా,

అదే రోజు సాయంత్రం ఆయన స్థానంలో రవిని నియమిస్తున్నట్లు ప్రకటన వెలువడింది. మాజీ ఐబీ అధికారి ఆర్ఎన్ రవి ఇటీవల వరకు తమిళనాడుకు గవర్నర్ గా వ్యవహరించారు. బుధవారం కోల్‌కతాకు చేరుకున్న రవి, గురువారం బాధ్యతలు చేపట్టారు.

## గల్ఫ్‌దేశాలపై ఇరాన్ దాడులు ఖండిస్తూ ఐక్యరాజ్యసమితిలో తీర్మానం



**న్యూయార్కు, మార్చి 12:** గల్ఫ్ దేశాల కూటమి, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరాయి. తమపై ఇరాన్ వేలాది క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసిందని ఆరోపిస్తూ జీసీసీ దేశాలు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిని ఆశ్రయించాయి. ఇరాన్‌ను ఖండిస్తూ మండలిలో ఓ తీర్మానం ప్రవేశపెట్టాలని నిర్ణయించాయి. ఇప్పటివరకు 954 ఇరాన్ క్షిపణులు, 2,500 డ్రోన్లు, 17 విమానాలను అడ్డగించినట్లు బహ్రెయిన్ శాశ్వత ప్రతినిధి జమాల్ ఫరేస్ అల్వారాయా ప్రకటించారు. సమితిలో ఇతర జీసీసీ దౌత్యవేత్తలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఇరాన్ దాడులు నివాస భవనాలు, ఆహార పంపిణీ కేంద్రాలు, విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, కీలకమైన పౌర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకున్నాయని ఆరోపించారు. ఈ దాడుల వల్ల వాణిజ్య, సముద్ర మార్గాలకు అంతరాయం కలుగుతోందని, ఇది ప్రాంతీయ, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆయన వివరించారు. ఇరాన్‌పై దాడికి తమ భూభాగాన్ని, గగనతలాన్ని ఉపయోగించుకోబోమని స్పష్టంగా చెప్పినప్పటికీ, టెహ్రాన్ తమ దేశంపై దాడికి పాల్పడిందని యూఏఈ శాశ్వత ప్రతినిధి మహమ్మద్ అబుషహాబ్ తెలిపారు. తమ రక్షణ వ్యవస్థల వల్లే భారీ ప్రాణ, ఆస్తి నష్టం తప్పిందని, ఇరాన్ దాడుల బాధితుల్లో 25 దేశాలకు చెందిన పౌరులు ఉన్నారని ఆయన పేర్కొన్నారు. జోర్డాన్‌తో కలిసి జీసీసీ దేశాలు ప్రతిపాదించిన ఈ తీర్మానంపై సోమవారం భద్రతా మండలిలో చర్చ జరగనుంది. ఈ తీర్మానం ఆమోదం పొందడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వీటో అధికారం ఉన్న రష్యా, చైనాలు దీనికి అడ్డుపడే అవకాశం ఉంది.

# మంటల్లో పశ్చిమాసియా

## గల్ఫ్‌దేశాలపై ఇరాన్ దాడులు ఉధృతం



**దుబాయ్, మార్చి 12:** గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులను ఉధృతం చేస్తోంది. దుబాయ్ సహా పలు గల్ఫ్ నగరాల్లో డ్రోన్ దాడులు, పేలుళ్లు సంభవించాయి. అమెరికాఇజ్రాయెల్ దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ ప్రారంభించిన ఈ ప్రతిదాడులు ఇప్పుడు గల్ఫ్ దేశాల ఆర్థిక వ్యవస్థను, భద్రతను కలవరపెడుతున్నాయి. దుబాయ్ డౌన్ టౌన్ లోని అల్ బదా నివాస ప్రాంతంలో డ్రోన్ పేలుడు జరిగినట్లు అధికారులు ధృవీకరించారు. ఈ దాడితో ఆకాశంలో పొగ మేఘాలు కమ్ముకున్నాయి. ఈ దాడిలో ఎవరికీ గాయాలు కాలేదు. మరోవైపు దుబాయ్ క్రీక్ హార్బర్ ప్రాంతంలోని ఓ భవనాన్ని ఈ తెల్లవారుజామున ఒక డ్రోన్ ఢీకొట్టింది. వెంటనే అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేశారు. దుబాయ్ తీరంలో ప్రయాణిస్తున్న ఒక కంటైనర్ షిప్ పై గుర్తుతెలియని క్షిపణి దాడి జరగడంతో స్వల్పంగా మంటలు చెలరేగాయి. షిప్పులోని సిబ్బంది అందరూ క్షేమంగా ఉన్నట్లు సమాచారం. బహ్రెయిన్ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలోని ముహర్రాక్ ద్వీపంపై ఇరాన్ చేసిన దాడితో భారీ మంటలు చెలరేగాయి. జెట్ ఫ్యూయల్ ట్యాంకులు ఉన్న ప్రాంతం కావడంతో ప్రజలంతా కిటికీలు మూసివేసి ఇంట్లోనే ఉండాలని అధికారులు హెచ్చరించారు. కువైట్ లో ఒక నివాస భవనాన్ని ఇరాన్ డ్రోన్ ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. కువైట్ గగనతలాన్ని ఉల్లంఘించిన మరికొన్ని డ్రోన్లను తమ వైమానిక దళం కూల్చివేసినట్లు కువైట్ రక్షణ శాఖ తెలిపింది. సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లోని డిప్లొమాటిక్ క్వార్టర్ (రాయబార కార్యాలయాల ప్రాంతం) లక్ష్యంగా వచ్చిన డ్రోన్‌ను సౌదీ దళాలు కూల్చివేసాయి. అలాగే తూర్పు ప్రాంతంలోని షైబా చమురు క్షేత్రాన్ని లక్ష్యంగా చేసుకున్న మరికొన్ని డ్రోన్లను కూడా కూల్చివేసినట్లు సౌదీ రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

## గల్ఫ్‌జలాల్లో రెండు అమెరికా నౌకలపై ఇరాన్ దాడి

**టెహ్రాన్, మార్చి 12:** గల్ఫ్ జలాల్లో ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరాయి. ఇరాన్ దళాలు జరిపిన భీకర దాడుల్లో అమెరికా యాజమాన్యంలోని ఒక వాణిజ్య నౌకతో పాటు మరో నౌక కూడా తీవ్రంగా దెబ్బతింది. క్షిపణులు నేరుగా నౌకను తాకడంతో ఒకరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో గల్ఫ్ రీజియన్‌లో యుద్ధం మరింత ముదిరే సూచనలు కనిపిస్తున్నాయి. ఇరాన్ తన అత్యాధునిక డ్రోన్లు, క్షిపణులను ఈ దాడుల్లో ప్రయోగించినట్లు తెలుస్తోంది. సముద్ర మార్గం ద్వారా జరిగే అంతర్జాతీయ వాణిజ్యాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ దాడులు జరుగుతున్నాయని రక్షణ రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు. అమెరికా నౌకపై దాడి జరగడం అగ్రరాజ్యానికి నేరుగా సవాల్ విసిరినట్లయింది. ఈ దాడుల నేపథ్యంలో గల్ఫ్ ఆఫ్ ఒమన్, పర్షియన్ గల్ఫ్ ప్రాంతాల్లో నౌకల రాకపోకలపై తీవ్ర ప్రభావం పడింది. భద్రతా కారణాల దృష్ట్యా పలు నౌకలు తమ మార్గాలను మార్చుకుంటున్నాయి. అమెరికా తన నౌకాదళాన్ని మరింత అప్రమత్తం చేయడంతో పశ్చిమాసియాలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని యుద్ధ వాతావరణం నెలకొంది.

## ఇరాన్‌తో యుద్ధం ముగియాలంటే షరతులు పాటించాల్సిందే..

### ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్



**టెహ్రాన్, మార్చి 12:** అమెరికా ఇజ్రాయెల్ దళాలతో జరుగుతున్న యుద్ధం ఆగాలంటే ఇరాన్ కొన్ని షరతులు విధించింది. ఇరాన్ అధ్యక్షుడు మసోద్ పెజెష్కియాన్ వీటిపై తన సోషల్ మీడియాలో ఓ పోస్టు చేశారు. అమెరికా కూటమితో ఎటువంటి ఒప్పందం జరిగినా ఇరాన్ సహజ హక్కులను గుర్తించాలని పెజెష్కియాన్ అన్నారు. రష్యా, పాకిస్థాన్ నేతలతో ఈ అంశం గురించి చర్చించినట్లు ఆయన తెలిపారు. పశ్చిమాసియా ప్రాంతంలో శాంతి స్థాపన జరగాలంటే కొన్ని అంశాలు కీలకమైనవని ఆయన అన్నారు. అమెరికాఇజ్రాయెల్ దళాలతో యుద్ధం ముగియాలంటే మూడు అంశాలు ముఖ్యమైనవని పెజెష్కియాన్ తెలిపారు. ఇరాన్ హక్కుల్ని గుర్తించడం, నష్టపరిహారాన్ని చెల్లించడంతో పాటు భవిష్యత్తులో ఎటువంటి దాడులు చేయబోమనన్న గ్యారెంటీ ఇవ్వాలని ఇరాన్ అధ్యక్షుడు అభిప్రాయపడ్డారు. ఫిబ్రవరి 28వ తేదీన అమెరికాఇజ్రాయెల్ దళాలు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టిన విషయం తెలిసిందే. ఇరాన్‌పై ఆకస్మికంగా జరిపిన దాడిలో ఆ దేశ సుప్రీంనేత ఖమేనీతో పాటు అనేక మంది కీలక నేతలు హతమయ్యారు.అయితే ఆ దాడులకు ప్రతీకారంగా ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాలపై ఇరాన్ విరుచుకుపడుతోంది. హోర్ముజ్ జలసంధిలో చమురు ట్యాంకర్లను పేల్చివేయడంతో ఆ ప్రాంతం అగ్నిగుండంగా మారింది.

## నేను తలచుకుంటే గంటలో ఇరాన్ విద్యుత్ వ్యవస్థనాశనం: ట్రంప్

**వాషింగ్టన్, మార్చి 12:** ఇరాన్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాము తలచుకుంటే కేవలం గంట వ్యవధిలోనే ఇరాన్ విద్యుత్ వ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేయగలమని తీవ్రంగా హెచ్చరించారు. అదే సమయంలో, కాలిఫోర్నియా తీరంలో ఒక పడవ నుంచి డ్రోన్‌లతో దాడి చేసేందుకు ఇరాన్ పన్నుతున్న కుట్రపై తమ అధికారులు దర్యాప్తు చేస్తున్నారని ఆయన వెల్లడించారు. కెంటకీ, ఒహియో పర్యటనల అనంతరం జాయింట్ బేస్ ఆండ్రూస్‌లో విలేకరులతో మాట్లాడిన ట్రంప్ ఇరాన్‌తో యుద్ధంపై కీలక విషయాలు పంచుకున్నారు. మేం తలచుకుంటే గంటలో వారి విద్యుత్ సామర్థ్యాన్ని కూల్చివేయగలం. దాన్ని మళ్లీ నిర్మించుకోవడానికి వారికి 25 ఏళ్లు పడుతుంది. కానీ మేం అలా చేయాలనుకోవడం లేదని అన్నారు. ఇరాన్ సైనిక శక్తిని ఇప్పటికే తాము నిర్వీర్యం చేశామని, వారి నౌకాదళం, వాయుసేనలను తుడిచిపెట్టేశామని చెప్పారు. అమెరికా చేపడుతున్న సైనిక చర్యకు ఇతర శక్తిమంతమైన దేశాల నుంచి ప్రైవేట్‌గా మద్దతు లభిస్తోందని ట్రంప్ పేర్కొన్నారు. తమ సైనిక చర్యల ఫలితంగా ఇరాన్ తీవ్రంగా నష్టపోయిందని ఆయన వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాంలోని సరిహద్దు విధానాల వల్ల ఇరాన్‌కు చెందిన స్లీపర్ సెల్స్ అమెరికాలోకి ప్రవేశించాయని ట్రంప్ ఆరోపించారు. చాలా మంది బైడెన్ తెలివి తక్కువ ఓపెన్ బార్డర్ విధానం ద్వారా లోపలికి వచ్చారు. వారిలో చాలామంది ఎక్కడున్నారో మాకు తెలుసు, వారిపై ఓ కన్నేసి ఉంచామని తెలిపారు. యుద్ధం వల్ల ఇంధన మార్కెట్లపై ప్రభావం పడకుండా, వ్యూహాత్మక నిల్వల నుంచి చమురును విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నట్లు ట్రంప్ వివరించారు. ఈ ప్రక్రియను చాలా వేగంగా ప్రారంభిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## యుద్ధంకోసం అమెరికా 17 బిలియన్ డాలర్లు ఖర్చు

**వాషింగ్టన్, మార్చి 12:** ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయెల్ దళాలు యుద్ధం ప్రారంభించిన మొదటి ఆరు రోజుల్లో అమెరికా సుమారు 11.3 బిలియన్ల డాలర్లు ఖర్చు చేసినట్లు ఆదేశ రక్షణ వ్యవస్థకేంద్రం పెంటగాన్ వెల్లడించింది. అమెరికా రక్షణశాఖకు చెందిన పెంటగాన్ ఈ విషయాన్ని ఆదేశ చట్టసభ ప్రతినిధులకు తెలియజేసినట్లు విశ్వసనీయ వర్గాలద్వారా తెలిసింది. అనూహ్య రీతిలో ఇరాన్ ఎదురుదాడి చేస్తున్న నేపథ్యంలో అమెరికా భారీగా తన ఆయుధ సంపత్తిని వినియోగించాల్సి వస్తున్నది. ఆయుధాలను విరివిగా వాడుతోంది. దీంతో ఖర్చు విపరీతంగా అవుతున్నట్లు అంచనాలు వేస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం ఇంకా చాలా విషయాల్లో ఖర్చును మినహాయించినట్లు తెలుస్తోంది. ఒకవేళ ఆ ఖర్చును కూడా జోడిస్తే, అప్పుడు యుద్ధం ఖర్చు తొలి వారంలోనే మరింత ఎక్కువగా ఉండే అవకాశం అందని పెంటగాన్ అంచనావేసింది. అమెరికా రక్షణశాఖ అధికారులు ఇదే విషయాన్ని ఆ దేశ చట్టసభ ప్రతినిధులకు కూడా చెప్పారు. కేవలం తొలి రెండు రోజుల్లోనే సుమారు 5.6 బిలియన్ల డాలర్ల ఖరీదైన ఆయుధాలను వాడినట్లు తెలుస్తోంది. ఇది అంచనా వేసిన దాని కన్నా అధికంగా ఉన్నట్లు తేల్చారు. ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ కోసం తొలి 100 గంటల్లోనే సుమారు 3.7 బిలియన్ల డాలర్లు ఖర్చు చేసినట్లు వాషింగ్టన్‌కు చెందిన సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్ తన రిపోర్టులో పేర్కొన్నది. రోజుకు దాదాపు 891 మిలియన్ల డాలర్లు ఖర్చు చేస్తున్నట్లు తేల్చారు. ఇరాన్ యుద్ధ ఖర్చులను ట్రాక్ చేస్తున్న ఓ వెబ్‌సైట్ ప్రకారం.

## ఇరాక్ సముద్రజలాల్లో అమెరికా ఆయిల్‌ట్యాంకర్‌పై దాడి

**బాగ్దాద్, మార్చి 12:** ఇరాక్ సముద్ర జలాల సమీపంలో అమెరికాకు చెందిన ఆయిల్ ట్యాంకర్‌ను సూసైడ్ బోట్ ద్వారా ఇరాన్ పేల్చివేసింది. చమురు ట్యాంకర్‌పై అండర్ వాటర్ డ్రోన్ అటాక్ జరిగిన ఘటనలో ఓ భారతీయ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఆయిల్ ట్యాంకర్ సేఫ్‌సీ విష్ణుపై ఇరాన్ అటాక్ చేసింది. ఇరాన్ ఆధీన జలాల్లో ఉన్న ఖోర్ అల్ జుబైర్ పోర్టు వద్ద ఈ దాడి జరిగింది. హార్ముజ్ జలసంధి నుంచి వెళ్లే ప్రతి ఇంధన ట్యాంకర్‌ను పేల్చివేస్తామని ఇరాన్ వార్నింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ ఇంధన నౌకలో ఉన్న మరో 15 మంది భారతీయ సిబ్బందిని సురక్షితంగా తరలించారు. బాగ్దాద్‌లోని భారతీయ ఎంబసీ ఈ విషయాన్ని పేర్కొన్నది.

ఆ దాడికి పాల్పడింది తామే అని ఇరాన్ బాధ్యత ప్రకటించింది. పెర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో తాజాగా రెండు ఆయిల్ ట్యాంకర్లను అండర్‌వాటర్ డ్రోన్ అటాక్‌తో పేల్చినట్లు ఇరాన్ వెల్లడించింది. సేఫ్‌సీ విష్ణుతో పాటు జెఫిరోస్ నౌకలను ఇరాన్ అటాక్ చేసింది.




## ఫ్యాన్సీ నంబర్ల జోరు..

## రవాణా శాఖకు కాసుల వర్షం

ఒక్క రోజే రూ.31,14,730 ఆదాయం

**హైదరాబాద్, మార్చి 12 ప్రభాతవార్త:** రవాణా శాఖకు ఫ్యాన్సీ నంబర్ల వేలం ద్వారా భారీ ఆదాయం వస్తోంది. ముఖ్యంగా ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో జరిగిన వేలంలో రవాణాశాఖకు లక్షల్లో ఆదాయం సమకూరింది. ఫ్యాన్సీ నంబర్ల కోసం వాహన యజమానులు ఖర్చు చేయడానికి వెనుకాడటం లేదని, దీనివల్ల రవాణాశాఖకు కాసులు కురుస్తున్నాయి. గురువారం ఖైరతాబాద్ రవాణా కార్యాలయంలో జరిగిన ఫ్యాన్సీ నంబర్ల వేలంలో ఒక్క రోజే రూ.31,14,730ల ఆదాయం సమకూరింది. టిజి09ఎల్ 0009 నంబర్‌కు అత్యధికంగా రూ.10,50,000లు ఆదాయం వచ్చింది. ఈ నంబర్‌ని మెగా ఇంజినీరింగ్ లిమిటెడ్ దక్కించుకుంది. టిజి09 ఎల్ 0007 నంబర్‌కు రూ.3,19,999లకు తిరుపతి రావు పెద్దింటి లిమిటెడ్ కైవసం చేసుకుంది. టిజి09ఎల్ 0005 నంబర్ రూ.2,00,005 లకు అనిరుధ్ ఆగ్రో ఫామ్ లిమిటెడ్ దక్కించుకుంది. టిజి09 9999 నంబర్‌ను రూ.1,50,000లకు ముప్పి హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ దక్కించుకుంది. టిజి 09ఎల్ 0024 నంబర్‌ను రూ.1,00,024లకు తిక్కవరపు మంజులారెడ్డి కైవసం చేసుకున్నారు. టిజి09ఎల్ 0001 నంబర్‌ను రూ.1,00,000లకు అర్జున్ పటేల్ దక్కించుకున్నారు.

## రైతులకు కూరగాయ విత్తనాల కిట్

20 గుంటలకు సరిపడా 5 రకాల విత్తనాలు

**హైదరాబాద్, మార్చి 12, ప్రభాతవార్త:** రైతులకు కూరగాయల విత్తనాల కిట్లను ప్రభుత్వం పంపిణీ చేయనుంది. ఒక్కో రకం కూరగాయ విత్తనాలు 5గుంటలకు సరిపడా మొత్తం 20 గుంటలకు సరిపోను కూరగాయల విత్తనాలను పూర్తి రాయితీపై రైతులకు అందజేయనుంది. ఈ పథకం రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి ఆదేశానుసారం కూరగాయల క్లస్టర్ కాన్సెప్ట్ నుండి ఉద్భవించింది. ఛైర్మన్ కోదండరెడ్డి సూచనల మేరకు రంగారెడ్డి జిల్లాలో 5970 మంది రైతులకు శుక్రవారం కూరగాయల విత్తనాల కిట్లు పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు రాష్ట్రంలో మరిన్ని కూరగాయల అభివృద్ధి పథకాలు అమలు కానున్నాయి.

## పంట రుణ పరిమితి పెంపు

స్వల్పంగా పెంచిన రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ

వరికి రూ.48వేలు, పత్తికి రూ.52వేలుగా ఖరారు

**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** 2026-27 ఆర్థిక సంవత్సరానికి పంటల వారీగా రుణ ప్రణాళిక ఖరారైంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి పంటల రుణపరిమితి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్)ను నిర్ణయించారు. ఏటేటా పంటల సాగుకు పెట్టుబడి వ్యయం పెరుగుతున్న నేపథ్యంలో రైతులకు ఇచ్చే పంట రుణపరిమితిని రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటి(ఎస్ఎల్‌టిసి) సిఫారసు చేయగా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ రుణపరిమితి ప్రాతిపదికన బ్యాంకులు రైతులకు పంట రుణాలను ఇవ్వాల్సి ఉంటుంది. పంటల సాగు వ్యయం పెరిగిన నేపథ్యంలో కొన్ని ప్రధాన పంటలకు గత ఏడాదితో పోల్చితే స్వల్పంగా రుణ పరిమితిని పెంచారు.ఈ ఏడాదికి వివిధ పంటల రుణపరిమితి (ఎకరాకు) వివరాలు ఇలా ఉన్నాయి.

**ధాన్యం సాగు**

వరి : రూ.46,000 - రూ.48,000, శ్రీ వరి : రూ.38,000 వరకు, వరి (సీడ్ ఉత్పత్తి) రూ.50,000 వరకు, జొన్న (ఇరిగేటెడ్) రూ.21,000 - రూ.23,000, జొన్న (వర్షాధారం) రూ.19,000 - రూ.21,000, బాజ్రా రూ.17,000 - రూ.19,000, రాగులు రూ.17,000 - రూ.19,000.

**మొక్కజొన్న గోధుమలు**

మొక్కజొన్న (నీటిపారకపు సాగు) రూ..36,000 - రూ.38,000, మొక్కజొన్న (వర్షాధారం) రూ.30,000 - రూ.32,000, గోధుమ రూ.21,000 -రూ.23,000.

**పప్పు పంటలు**

కంది (ఇరిగేటెడ్)రూ.25,000 - రూ.27,000, కంది (వర్షాధారం) రూ. 22,000 -రూ.24,000, మినుములు రూ.20,000 - రూ.22,000, పెసర్లు రూ.20,000 - రూ.22,000.

**నూనె గింజల పంటలు**

వేరుశెనగ రూ.30,000 -రూ.32,000, సోయాబీన్ రూ.28,000 - రూ. 30,000, పొద్దుతిరుగుడు రూ.26,000 - ..రూ.28,000, నువ్వులు రూ.20,000 -రూ.22,000.

**వాణిజ్య పంటలు**

పత్తి రూ.52,000, చెరకు రూ.84,000, మిర్చిరూ.90,000 వరకు. పసుపు రూ.60,000 -రూ.70,000, ఉల్లిపాయ రూ.45,000 - రూ.55,000, టమోటా రూ.45,000 -రూ.50,000గా రుణపరిమితి ఖరారైంది. ఈ ఏడాది పంట రుణపరిమితి వివరాలను ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని వ్యవసాయశాఖ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

## విద్యుదాఘాతంతో మూడు ఇళ్లు దగ్ధం

**హైదరాబాద్, మార్చి 12,ప్రభాతవార్త :** ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం బోరిగాంలో గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మూడు ఇళ్ళుదగ్ధమయ్యాయి. అగ్ని రెండు పశువుల కొట్టాలకు కూడా వ్యాపించడంతో నివాసాలతోపాటు అవి కూడా పూర్తిగా కాలిపోయాయి. ఇళ్ళలో నిత్య వసరాలు, నగదు, ఇతర సామాగ్రి పూర్తిగా కాలిపోయాయి. గ్రామస్తులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. సుమారు 50 కి.మి దూరం నుంచి ఫైరింజన్ రావాల్సి ఉండటంతో సకాలంలో మంటలు ఆర్పడానికి సాధ్యం కాలేదు. దీనితో 20లక్షల రూపాయల మేరకు ఆస్థి నష్టం జరిగింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు అర్థిస్తున్నారు.

## జపాన్ పార్లమెంట్ ఫ్రెండ్‌షిప్ మెంబర్‌గా ఎంపి రవి

**హైదరాబాద్, మార్చి 12, ప్రభాతవార్త :** జపాన్ పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్ గ్రూప్ మెంబర్‌గా తెలంగాణ ఎంపిల ఫోరం ఛైర్మన్ నాగర్‌కర్నూల్ ఎంపి మల్లురవి నియమిస్తూ లోక్‌సభ డైరెక్టర్ ఎల్‌వి రమణ ఉత్తర్వులు జారీచేశారు. లోక్‌సభ స్పీకర్ సిఫార్సుమేరకు జపాన్ పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్ గ్రూప్ సభ్యుడిగా 2028 వరకు రవి కొనసాగేలా ఉత్తర్వులు విడుదల చేశారు.

## వివాహంలో విషాదం నింపిన ప్రమాదం

నిర్మల్‌లో ఇద్దరి మృతి, పలువురుకి గాయాలు

**హైదరాబాద్, మార్చి 12, ప్రభాతవార్త :** 'పెండ్లివారమండి' అంటూ అప్పటి వరకు సందడి చేస్తూ వెళ్లిన బంధుమిత్రులను రోడ్డు ప్రమాదం విషాదంలోకి దింపింది. నిర్మల్ జిల్లా కొండాపూర్ బైపాస్ వద్ద పెళ్లి బృందం ప్రయాణించే వాహనంకు ప్రమాదం జరగడంతో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. 15మంది తీవ్రంగా గాయపడ్డారు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం సోమన్‌పల్లి నుంచి ఆర్మూరుకు వెళ్ళుతున్న వాహనం టైరు పేలిపోవడంతో బోల్తా పడింది. ఈ సంఘటనలో బరడే లక్ష్మణ్(45), తులసీదాస్ (38) సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. గాయపడిన వారిని ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తర లించారు. అందులో ముగ్గురు తీవ్రంగా గాయపడటంతో వారి పరిస్థితి విష మంగా ఉందని డాక్టర్లు తెలిపారని పెళ్లి బృందంలోని బంధువులు తెలిపారు.

# ఖరీఫ్ సీజన్‌కు సరిపడా యూరియా కేటాయించండి

జూన్ వరకు ప్రతి నెల 2 లక్షల మెట్రిక్ టన్నులు ఇవ్వండి

కేంద్రానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వినతి

**హైదరాబాద్, మార్చి 12, ప్రభాతవార్త :** ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణలో యూరియా కొరత రాకుండా ఉండాలంటే జూన్ వరకు ప్రతీ నెలా 2లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విన్నవించారు. యూరియా డిమాండ్ ఎక్కువగా ఉండే జూలై , ఆగస్టు నెలల్లో కనీసం నెలకు 3.00 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుందని తెలిపారు. ముందుగానే తగినంత యూరియా నిల్వలు సిద్ధం చేయడం ద్వారా రైతులకు ఎరువుల కొరత లేకుండా సరఫరా చేయవచ్చన్నారు.

ఈ నేపథ్యంలో రాష్ట్రంలో బఫర్ నిల్వలు ఏర్పాటుకు అనుకూలంగా సరఫరా ప్రణాళిక కింద ఏప్రిల్, మేచ జూన్ నెలలకు ప్రతి నెల 2.00 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఏప్రిల్ నుండి యూరియాకే టాయింపులు జరిగితే రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే తగిన నిల్వలు ఏర్పర చుకుని ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎలాంటి అంతరాయం లేకుండా యూరియా అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ విషయమై కేంద్ర రసాయనాలు, ఎరువులశాఖమంత్రి జగత్ ప్రకాశ్ నడ్డాకు గురువారం ఆయన లేఖ రాశారు. రాష్ట్ర యూరియా అవసరాలను వివరించారు. గత రబి సీజన్‌లో రాష్ట్రానికి సమయానికి యూరియా కేటాయించినందున రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంపిణీ చేయగలిగామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో రబి సిజన్ ముగింపు దశకు చేరుకుంటున్న నేపథ్యంలో ఖరీఫ్-2026 సీజన్‌కు యూరియా ప్రారంభ నిల్వలు 50 వేల మెట్రిక్ టన్నుల వరకు మాత్రమే ఉండవచ్చని మంత్రి తెలిపారు. 2024 ఖరీఫ్ సీజన్ లో రాష్ట్రానికి గణనీయమైన ప్రారంభ నిల్వలు ఉండటం వల్ల ఎరువుల సరఫరా సాఫీగా జరిగిందని గుర్తు చేశారు.

ఖరీఫ్-2024లో 4.65 లక్షల మెట్రిక్ టన్నులు ఉండగా, ఖరీఫ్-2025లో 1.99 లక్షల మెట్రిక్ టన్నుల ప్రారంభ నిల్వలు ఉండటం వల్ల ఎరువుల సరఫరాలో ఇబ్బందులు వచ్చాయని గుర్తు చేశారు. అయితే ఈ సంవత్సరం ప్రారంభ నిల్వలు 50 వేలకు మించి ఉండకపోవచ్చని తెలిపారు. 2024 ఖరీఫ్ సీజన్‌లో ఉన్న నిల్వలు రాష్ట్రానికి బఫర్ స్టాక్ ఏర్పాటుకు దోహదపడి రైతులకు ఎరువులు నిరంతరంగా అందుబాటులో ఉండేలా చేశాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రాబోయే ఖరీఫ్ సీజన్‌కు ఈ విధంగా ప్రారంభ నిల్వలు ఉంచుకోవడం ఇప్పుడు ప్రాధాన్యతగా మారిందని మంత్రి లేఖలో కేంద్రానికి విన్నవించారు.

తెలంగాణ రాష్ట్రంలో మొత్తం సాగు విస్తీర్ణంలో దాదాపు 70 శాతం పంటలు ఖరీఫ్ సీజన్‌లోనే సాగవుతాయని తెలిపారు. ముఖ్యంగా వరి, పత్తి, మొక్కజొన్న వంటి ప్రధాన పంటలు ఈ సీజన్‌లో విస్తృతంగా సాగవుతాయని వివరించారు. ఈ పంటలకు అధిక మొత్తంలో యూరియా అవసరం ఉంటుందని చెప్పారు. సాధారణంగా రాష్ట్రంలో జూలై, ఆగస్టు నెలల్లో యూరియా వినియోగం గరిష్ట స్థాయికి చేరుకుంటుందని లేఖలో వివరించారు.

ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో ఖరీఫ్ సీజన్ కొంత ముందుగానే ప్రారం భమవుతుందని తెలిపారు. అందువల్ల రైతులకు సమయానికి ఎరువులు అందు బాటులో ఉండేందుకు ముందుగానే నిల్వలు ఏర్పాటు చేయడం అత్యంత అవసర మని పేర్కొన్నారు. ముఖ్యంగా వినియోగం తక్కువగా ఉండే ఏప్రిల్, మే నెలల్లో బఫర్ స్టాక్ ఏర్పాటు చేయడం ద్వారా తరువాతి నెలల్లో పెరిగే డిమాండ్‌ను సులభంగా తట్టుకోవచ్చన్నారు.

రైతులకు అవసరమైన ఎరువుల సరఫరా నిరం తరంగా కొనసాగడం ద్వారా వ్యవసాయ ఉత్పత్తి స్థిరత్వా నికి దోహద పడుతుందని పేర్కొంటూ, కేంద్ర ప్రభుత్వం త్వరితగతిన స్పందించి యూరియా సరఫరాలపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని విన్నవించారు.

# వార్షిక అంచనా బడ్జెట్‌పై కసరత్తు ముమ్మరం

## హోం, ఐటిపై డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క సమీక్ష



గురువారం సచివాలయంలో హోం మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులతో ప్రీబడ్జెట్ సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న డిప్యూటీ సిఎం భట్టి తదితరులు

**హైదరాబాద్, మార్చి 12, ప్రభాతవార్త :** మరో మూడు రోజుల్లో అసెంబ్లీ సమావే శాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వం 2026-27 వార్షిక అంచనా బడ్జెట్‌పై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తును ముమ్మరం చేస్తోంది. ఈ మేరకు దీనికి సంబంధించి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శాఖల వారిగా ఉన్నతాధి కారులతో ప్రీ బడ్జెట్ సమీక్షా సమావేశాలు నిర్వ హిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం హైదరాబాద్ సచివాల యంలో హోం మంత్రిత్వ శాఖ ఉన్నతా ధికారులతో ప్రీబడ్జెట్ సమీక్షా సమావేశం నిర్వహించారు. అత్యా ధునిక సాంకేతికతతో నేరాల నియంత్రణ, డ్రగ్స్ నిర్మూలన మరియు ప్రజా భద్రతకు సంబం ధించి కీలక అంశాలపై చర్చించారు. శాంతిభద్రతల పరిరక్షణకు బడ్జెట్లో తగిన ప్రాధాన్యత కల్పిస్తూ, పోలీసు యంత్రాం గాన్ని మరింత బలోపేతం చేసే దిశగా చర్చలు జరిగినట్లు డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఈ సమావేశంలో హోం శాఖ కార్యదర్శి సి.వి. ఆనంద్, ఏడీజీ శిఖా గోయల్, జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా, హైదరాబాద్ సీపీ సజ్జనార్, సైబరాబాద్ సీపీ రమేష్, మల్కాజ్గిరి సీపీ అవినాష్ మహంతి, ఫ్యూచర్ సిటీ సీపీ సుధీర్ బాబు, ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్ కుమార్, నార్కోటిక్ చీఫ్ సందీప్ శాండిల్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, పరిశ్రమలు, వాణిజ్యం, శాసనసభ వ్యవహారాల శాఖల ఉన్నతా ధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సంబంధింత శాఖలకు సంబంధించిన ప్రతిపా దనలపై చర్చించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఐటీ స్పెషల్ సెక్రటరీ భవేష్ మిశ్రా, టీజీఐఐసి ఎండి శశాంక్, ఇండస్ట్రీస్ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# పంట కొనుగోళ్లలో దళారులకు చెక్

సాగు రైతుల నుండే కొనుగోళ్లు చేసేలా

వ్యవసాయ శాఖ కార్యాచరణ

డిజిటల్ సర్వే ద్వారా సాగు వివరాల సేకరణ

**హైదరాబాద్, మార్చి 12, ప్రభాతవార్త :** సాగు చేయకుండా ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న నకిలీ రైతుల కట్టడికి వ్యవసాయశాఖ సిద్ధమైంది. డిజిటల్ క్రాప్ సర్వేతో వారిని గుర్తించి అసలైన రైతులకు న్యాయం చేయాలని నిర్ణయించింది. ఈ సర్వేతో సాగు చేయకుండా పథకాలు పొందేవారికి చెక్‌పడనుంది. రాష్ట్రంలో ప్రభుత్వం అందించే ఏ పథకం పూర్తిగా రైతులకు అందడం లేదని భావించిన వ్యవసాయశాఖ అర్హులైన రైతులకు మాత్రమే న్యాయం చేసేందుకు డిజిటల్ క్రాప్ సర్వేను చేపటినంది. వాస్తవంగా పంట సాగు చేసే రైతులను గుర్తించేందుకు వ్యవ సాయ విస్తరణాధి కారులతో పా టు, వారికి తోడు వలం టీర్లను నియమిం చింది. ప్రతి సర్వే నెంబర్‌కు వెళ్లి ఏ పంట సాగు చేశారో రైతు వివరాలను సేక రిస్తూ ఫొటోలు తీసి కేంద్ర, రాష్ట్ర వ్యవసాయ శాఖకు వివరాలు పంపిస్తున్నారు. ఆ వివరాల ఆధారంగా ఇక నుంచి పత్తి, ధాన్యం కొనుగోళ్లలో పంటలు సాగు చేసే రైతుల నుంచి కొనేందుకు వ్యవసాయశాఖ ప్లాన్ చేస్తున్నది. గతంలో దళారులు చిన్న, సన్నకారు రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసిన పంటలను ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు దర్జాగా అమ్ముతూ లక్షలు సంపాదిస్తున్నారు. ఈ క్రమంలో పంట పండించే రైతు కంటే బ్రోకర్లు బాగుపడుతున్నట్లు అధికారుల పరిశీలనలో తేలింది. అదే సమయంలో పక్క రాష్ట్రాల నుంచి సన్నవడ్లు రాష్ట్రంలో పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న నేపథ్యంలో సన్నాల సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించి కొనుగోలు చేస్తుండటంతో దళారులు దందాకు తెగబడ్డారు. పక్క రాష్ట్రంలోని కృష్ణా, గుంటూరు, కర్నూలు జిల్లాల నుంచి తక్కువ ధరకు సన్న వడ్లను కొనుగోలు చేసి నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో అమ్మకాలు జరిపినట్లు పౌరసరఫరాల శాఖకు ఫిర్యాదులు అందాయి. పక్క రాష్ట్రాల నుంచి వచ్చిన సన్నాలు నాణ్యతగా లేవని సీఎంఆర్ చేసిన మిల్లర్లు ఫిర్యాదు చేయడంతో వ్యవసాయ శాఖ కొత్త మార్గాలు కనిపెట్టి సాగు చేసిన రైతులను గుర్తించి వారి పంట కొనుగోలు చేసేలా సర్వే చేపడుతుంది.

# స్పీకర్ నిర్ణయంపై బిజెపి, బిఆర్ఎస్ ఒక తరహా విమర్శలు

స్పీకర్ అధికారంలో కోర్టుల జోక్యం

ఉండదని బండి సంజయ్ తెలుసుకోవాలి

భువనగరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 12, ప్రభాతవార్త :** శాసనసభ స్పీకర్ ఫిరాయింపులు జరగలేదని తీసుకొన్న నిర్ణయంపై బిఆర్ఎస్, బిజెపి ఒకే తరహాలో విమర్శలు చేస్తూ మాట్లాడుతున్నాయనీ, ఇరు పార్టీల నేతల వ్యాఖ్యలతో ఆరెండు పార్టీలు ఒక్కటే అని తేలిందని భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డి ఆరోపించారు. గురువారం ఢిల్లీలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో బిజెపి నేతలు స్పీకర్ అధికారాల గురించి నిన్న అమిత్‌షా చెప్పిం దానికి భిన్నంగా మాట్లాడు తున్నారనీ ఎద్దేవ చేశారు. హైకోర్టుకు వెళ్తామని కేంద్ర హోం శాఖా సహాయ మంత్రి బండి సంజయ్ అంటున్నారని స్పీకర్ అధికారాలపై కోర్టులు జోక్యం చేసుకోలేవని నిన్ననే లోక్ సభలో అమిత్ షా మాట్లాడారనీ ముందు అదితెలుసుకో అని హితవు చెప్పారు స్పీకర్ అధికారాలపై కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా ఒక స్టేట్ మెంట్ సహాయ మంత్రి బండి సంజయ్ మరో స్టేట్ మెంట్ ఇస్తున్నారనీ ఆగ్రహం వ్యక్తంచేశారు. బండి సంజయ్ మీ బాస్ అమిత్‌షా గోవా, మహారాష్ట్ర, కర్ణాటకలో ఎలాంటి ఫిరాయింపులు చేశారో గుర్తు లేదా? అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనను తప్పుదోవ పట్టించడానికి కెటిఆర్, కిషన్‌రెడ్డి, బండి సంజయ్ మాట్లాడు తున్నారనీ ఆవేదన చెందారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతిని ఎందుకు బిజెపి అడ్డుకోలేదనీ ఆయన ప్రశ్నించారు. కేటీఆర్ స్వంత చెల్లి కర్మ రిటన్స్ అని ట్వీట్ చేశారనీ అన్నారు.

బిజెపి, బిఆర్ఎస్ ఇంటర్నల్ ఒప్పందం తెలంగాణ ప్రజలకు తెలుసు అని ఆయన అన్నారు. కెటిఆర్ గురించి మాట్లాడితే గురివింద గింజ సిగ్గు పడుతుందని విమర్శించారు. పార్టీ ఫిరాయిం పులు రాహుల్ గాంధీ చేయిస్తున్నారని కెటిఆర్ ఆరోపణలు అవాస్తవమని, ఒకసారి ఫామ్ హౌస్‌కు పోయి మీ నాయన ను అడుగు.. చరిత్ర చెపు తారని హితవు చెప్పారు. కొత్తగా వచ్చిన రాష్ట్రంలో ఏకపాత్రాభినయం చేయాలని పార్టీ ఫిరాయింపులకు పాల్పడింది కెసిఆర్ మాత్రమే అని ఆయన వివరించారు. తెలంగాణలో ప్రతిపక్షాలు లేకుండా చేయాలని చూశారనీ, పార్టీ ఫిరాయింపులు ఏ స్థాయిలో చేయవచ్చో కెసిఆర్ నిరూపించారనీ ఆయన తెలిపారు. అవసరం అయితే పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు మంత్రి పదవి ఎట్లా ఇవ్వవచ్చో కెసిఆర్ రుజువు చేశారనీ తెలిపారు. స్పీకర్ దళితుడు కాబట్టే బిఆర్ఎస్ విమర్శలు చేస్తోందనీ అన్నారు. స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని బిఆర్ఎస్ తప్పుపడు తోందనీ, సైకిల్ గుర్తుపై గెలిచిన తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు మంత్రి పదవి, హస్తం గుర్తుపై గెలిచిన సబితా ఇంద్రారెడ్డికి మంత్రి పదవి ఇచ్చారనీ ఆయన గతంలో జరిగిన పార్టీ ఫిరాయింపుల చిట్టాను వివరించారు. దళితుడిని ముఖ్య మంత్రి చేస్తామని, దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తామని కెసిఆర్ మాట తప్పారుభట్టి విక్రమార్క దళితుడు అని ఉన్న ప్రతిపక్ష హోదాను తొలగించారని ఆయన ఆవేదన చెందారు. కెటిఆర్ మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందనీ, ఇప్పుడు కెటిఆర్ నీతులు మాట్లా డుతున్నారని దుయ్యబట్టారు. రాహుల్‌గాంధీని తిట్టాలన్న అజెండాతో కెటిఆర్ మాట్లాడుతున్నారు.

# అర్థాకలితో అలమటిస్తున్నాం..

వేతనాలు చెల్లించండి.. వ్యవసాయ మార్కెటింగ్

శాఖ డైరెక్టర్‌కు సెక్యూరిటీ గార్డుల వినతి

**హైదరాబాద్, మార్చి 12, ప్రభాతవార్త:** నాలుగు నెలలుగా వేతనాలు నిలిచి పోవడంతో అర్థాకలితో అలమటిస్తున్నామని వ్యవసాయ మార్కెట్లలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సెక్యూరిటి గార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్‌కు తెలంగాణ వ్యవసాయ మార్కెట్ సెక్యూరిటిగార్డ్స్ యూనియన్ వినతిపత్రం సమర్పించింది. తెలంగాణలోని 192 వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ పద్ధతిన సుమారు 1,200 మంది సెక్యూరిటీ గార్డులుగా 30 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నట్లు విన్నవించారు. మార్కెట్ యార్డుల్లో, చెకోపోస్టు కార్యా లయాలల్లో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మార్కెట్ యార్డుల్లో రైతుల సరుకులను రక్షిస్తూ, వేలం పాటలు నిర్వహించడం, కార్యాలయంలో క్లరికల్ పనులు చేస్తున్నట్లు వినతిపత్రంలో విన్నవించారు. మార్కెట్ చెక్‌పోస్టుల్లో వ్యవసాయ దినుసుల రవాణా వాహనాలను ఆపి తనిఖీ చేసి స్వయంగా కంప్యూటర్ ద్వారా నేరుగా ఆన్‌లైన్ రశీదు జారీ చేసి, మార్కెట్ ఫీజు వసూలు చేస్తూ ప్రభుత్వ ఆదాయం పెంచడంలో రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నట్లు వివరించారు. అయితే ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ పోర్టల్‌లో తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో పని చేస్తున్న వ్యవసాయ మార్కెట్ సెక్యూరిటీ గార్డుల బయోడేటా నమోదు చేయాలనీ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందని, కానీ సెక్యూరిటీ గార్డ్స్ బయోడేటా పూర్తీ చేసినప్పటికీ పోర్టల్‌లో ఏర్పడిన సాంకేతిక లోపాల కారణంగా గార్డ్స్ బయోడేటా నమోదు కానట్టు చూపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆయా మార్కెట్లలో సెక్రటరీలు బిల్లు చేయడం లేదని, బయోడేటా పూర్తి కాకపోవడంతో నాలుగు నెలల నుండి అనేక మార్కెట్లలో సెక్యూరిటీర్డులకు వేతనాలు రావడం లేదని వాపోయారు. ఈ నేపథ్యంలో ఐఎఫ్ఎంఎస్ పోర్టల్ నమోదులో జరిగిన సాంకేతిక లోపాలను వెంటనే సరిచేసి, సెక్యూరిటీ గార్డులకు వేతనాలు వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్‌కు విన్నవించారు.

## కాళేశ్వరం ప్రాజెక్టుతో పెరిగిన సాగు విస్తీర్ణం

కెసిఆర్, హరీశ్‌రావు లక్ష్యంగా ఘోష్ కమిషన్ ఏర్పాటు

హైకోర్టులో కెసిఆర్, హరీశ్‌రావు తరఫు

న్యాయవాదుల వాదనలు

**హైదరాబాద్, మార్చి 12, ప్రభాతవార్త:** కాళేశ్వరం ప్రాజెక్టుపై ఏర్పాటు చేసిన జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ నివేదికపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. కమిషన్ నివేదికను రద్దు చేయాలంటూ మాజి సిఎం కెసిఆర్, హరీశ్‌రావు, స్మితా సబర్వాల్, ఎస్‌కె. జోషి పిటిషన్ వేశారు. గురువారం ఈపిటిషన్‌పై విచారణ జరగ్గా వారి తరుపున న్యాయవాదులు వాదనలు వినిపించారు. ఇప్పటికే ప్రభుత్వం, కమిషన్ తరుపున వాదనలను హైకోర్టు విన్నది.

కమిషన్ నివేదిక ఆధారంగా కెసిఆర్, హరిష్‌రావును ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుందని న్యాయవాది శేషాద్రినాయుడు వాదనలు వినిపించారు. ప్రాజెక్టు పిల్లర్లు కూలిపోయాయని ప్రభుత్వం కమిషన్‌ను వేసిందని, కానీ అదే ప్రాజెక్టు నుంచి హైదరాబాద్‌కు నీటి సరఫరాకు ప్రణాళికను సర్కారు రూపొందించిందని కోర్టు దృష్టికి తెచ్చారు. మల్లన్నసాగర్ నుండి నగరానికి నీటిని తీసుకొచ్చేలా జివో విడుదల చేశారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్రంలో సాగునీటి విస్తీర్ణం గణనీయంగా పెరిగిందన్నారు. మేడిగడ్డ ప్రాజెక్టు 220 పిల్లర్లలో కేవలం ఒక పిల్లర్ మాత్రమే కుంగిపోయిందని కోర్టుకు కెసిఆర్, హరీశ్‌రావు తరుపు న్యాయవాదులు విన్నవించారు.

## మోత్కూరు సబ్ ట్రెజరీ కార్యాలయంలో ఎసిబి సోదాలు.. సీనియర్ అకౌంటెంట్ అరెస్ట్

**మోత్కూరు, మార్చి 12, ప్రభాతవార్త:** మోత్కూరు సబ్ ట్రెజరీ కార్యాలయంలో గురువారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి, అవినీతికి పాల్పడుతున్న సీనియర్ అకౌంటెంట్ మొహమ్మద్ ఖదీర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ డీఎస్పీ జగదీష్ చందర్ వెల్లడించిన వివరాల ప్రకారం, మోత్కూరు ఎంపీఓ జనార్దన్ రెడ్డి తన 38 రోజుల పెండింగ్ శాలరీ బిల్లును క్లియర్ చేయడానికి, నిందితుడు ఖదీర్ రూ.5000 లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఫోన్ పే ద్వారా ఆ నగదును నిందితుడికి బదిలీ చేశారు. అయితే, ఆర్థిక సంవత్సరం ముగింపు సమయం కావడంతో ఐటీ సమస్యలు వస్తాయని, లంచం ఇవ్వకుంటే ఫిబ్రవరి నెల జీతం కూడా ఆగిపోతుందని ఖదీర్ బాధితుడిని బెదిరించి మరో రూ.5,000 డిమాండ్ చేశారు. అవి కూడా నిందితుడి ఎకౌంట్కి ఫోన్ పే ద్వారా చెల్లించారు. విసిగిపోయిన బాధితుడు ఏసీబీని ఆశ్రయించడంతో, గురువారం కార్యాలయంలో, భువనగిరి లోని తన నివాస గృహంలో ఏకకాలంలో సోదాలు నిర్వహించిన అధికారులు ఆధారాలను సేకరించారు. విచారణలో కేవలం ఎంపీఓ జనార్ధన్ రెడ్డి నుండే కాకుండా, గుండాలలోని మరోకరి జీతం బిల్లు కోసం కూడా ఖదీర్ రూ.5,000 వసూలు చేసినట్లు నిర్ధారణ అయిందన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ట్రెజరీ అధికారి ప్రాథమిక విచారణ జరిపి నివేదిక ఇవ్వడంతో ఏసీబీ ఈ చర్యలు చేపట్టిందని తెలిపారు. నిందితుడు ఖదీర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన అధికారులు, అతడిని అదుపులోకి తీసుకున్నారు. నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచ నున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని డీఎస్పీ జగదీష్ చందర్ ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు.



మొహమ్మద్ ఖదీర్

## అకడమిక్ పరిశోధనలో విస్తృత సహకారం

ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డితో

వెస్టన్ ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయ ప్రతినిధి బృందం భేటీ

**హైదరాబాద్, మార్చి 12, ప్రభాతవార్త:** అకాడమిక్ పరిశోధనా సహకార అవకాశాలను మరింతగా విస్తరించేందుకు వెస్టన్ ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయ ప్రతినిధి బృందం తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి, కార్యదర్శి ప్రొఫెసర్. శ్రీరామ్ వెంకటేష్‌తో భేటీ అయింది. శుక్రవారం ఉన్నత విద్యామండలి కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో విమానయాన, వ్యవసాయం, అంతరిక్షం, క్రిటికల్ మినరల్స్ వంటి ప్రాధాన్య తారంగాల్లో ఆస్ట్రేలియా-భారత్ విద్యా సంస్థల మధ్య భాగస్వామ్య అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. పరిశోధన, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధిరంగాల్లో పరస్పర సహకారాన్ని బలోపేతం చేయాలనే ఉమ్మడి ఆసక్తిని ఇరు పక్షాలు వ్యక్తం చేశాయి. భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్ర సలహాదారుడి కార్యాలయం ఆధ్వర్యంలో అభివృద్ధి చెందుతున్న ముఖ్య సైన్స్ అండ్ టెక్నాలజీ క్లస్టర్లలో హైదరాబాద్ ఒకటిగా గుర్తింపు పొందినట్టు సమావేశంలో ప్రస్తావించారు. ఆధునిక పరిశోధన సాంకేతిక అభివృద్ధి కేంద్రంగా హైదరాబాద్ ఎదుగుతోందన్నారు. అదేవిధంగా వెస్టన్ ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయం ఇటీవల ఇండియా సైన్స్ అండ్ టెక్నాలజీ క్లస్టర్స్ ఇనిషియేటివ్‌తో కుదుర్చుకున్న వ్యూహాత్మక అవగాహన ఒప్పందం కూడా ఆస్ట్రేలియా-భారత్ సైన్స్, టెక్నాలజీ, ఇన్నోవేషన్ రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించనుందని పేర్కొన్నారు. ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ... అంతర్జాతీయ అకాడమిక్ భాగస్వామ్యాలను ప్రోత్సహించడంలో తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని వెస్టన్ ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయ ప్రతినిధి బృందానికి హామీ ఇచ్చారు.

ఉన్నత విద్య, పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా తెలంగాణ వేగంగా ఎదుగుతున్నదని పేర్కొన్నారు. అంతర్జాతీయ సహకారం ద్వారా విద్యా ప్రమాణాలు మెరుగుపడటంతోపాటు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయ పడ్డారు. ఈ సమావేశంలో ఇరు పక్షాలు పరస్పర సహకారానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని అంగీకరించాయి. భవిష్యత్ భాగస్వామ్యాలకు అనుకూలమైన వ్యవస్థను రూపొందించేందుకు చర్చలను కొనసాగించేందుకు నిర్ణయించాయి. ఈ ప్రతినిధి బృందంలో గ్లోబల్ గ్రోత్ అండ్ అడ్వకసీ డైరెక్టర్ నషీద్ చౌదరి, గవర్నమెంట్ అండ్ ఇండస్ట్రీ రిలేషన్స్ మేనేజర్ హరి పద్మనాభన్ తదితరులు ఉన్నారు.



గురువారం కోకాపేటలోని అల్లు సినిమాస్ థియేటర్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి, అల్లు అర్జున్, అల్లు అరవింద్, దిల్ రాజు తదితరులు

### లారీలో 100 కి.మీ. దూరంలోని

# కర్నూలు వెళ్లి మొదటిరోజునే సినిమా చూసేవాళ్లం

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 12:** తాను వనపర్తిలో చదువుకునే సమయంలో సినిమాలు చూడటానికి లారీలో 100 కిలోమీటర్ల దూరంలోని కర్నూలుకు వెళ్లి సెకండ్ షో చూసి వచ్చేవాళ్లమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆ రోజుల్లో హైదరాబాద్ లేదా కర్నూలు వంటి నగరాల్లో మాత్రమే సినిమాలు విడుదలయ్యేవని నాటి సంగతులను గుర్తు చేసుకున్నారు. వనపర్తి వంటి పట్టణాల్లో సినిమాలు విడుదలయ్యేవి కాదని, కాబట్టి మొదటి రోజునే సినిమా చూసేందుకు లారీల్లో కర్నూలు వెళ్లేవాళ్లమని అన్నారు. గురువారం కోకాపేటలో మల్టీప్లెక్స్ అల్లు సినిమాస్‌ను ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తాను కృష్ణ అభిమానిని అని తెలిపారు. సూపర్ స్టార్ కృష్ణ ఒక సంవత్సరంలో 15 నుంచి 16 సినిమాల్లో నటించిన రోజుల నుంచి ఈరోజుల్లో ఐదారేళ్లకు ఒక సినిమాలో నటించే హీరోలను చూస్తున్నామని అన్నారు. తెలుగు సినిమా పరిశ్రమ కోలీవుడ్ లేదా బాలీవుడ్‌తో పోటీపడకుండా, హాలీవుడ్‌తో పోటీ పడాలని అన్నారు. హాలీవుడ్ సినిమాలు కూడా ఇక్కడ ప్రదర్శించబడాలని ఆకాంక్షించారు. సినిమా పరిశ్రమ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం సహకరిస్తుందని హామీ ఇచ్చారు. అల్లు అర్జున్ హాలీవుడ్‌లోనూ రాణించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

**రేవంతన్నా థాంక్యూ వెరీమచ్: అల్లు అర్జున్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రముఖ సినీ నటుడు అల్లు అర్జున్... రేవంతన్న అని సంబోధించారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ మాట్లాడుతూ, తమ మల్టీప్లెక్స్‌ను ప్రారంభించినందుకు థ్యాంక్యూ వెరీమచ్ రేవంతన్న అంటూ ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం సినిమా పరిశ్రమకు మద్దతుగా నిలుస్తోందని అన్నారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ తన తండ్రి అల్లు అరవింద్ తెలుగు సినిమా పరిశ్రమకు చాలా సేవ చేస్తున్నారని అన్నారు. అల్లు అరవింద్ తెలుగు సినిమాల బాక్సాఫీస్ స్థాయిని పెంచారని కొనియాడారు.

# సిఎస్ఆర్ సమ్మిట్ పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి పొన్నం

### జులై 25న హైదరాబాద్‌లో దక్షిణాది సదస్సు

**హైదరాబాద్, మార్చి 12, ప్రభాతవార్త :** దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటి (సిఎస్ఆర్)సమ్మిట్- 2026 పోస్టర్‌ను రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. రానున్న జులై 25న హైదరాబాద్‌లో ఈసమ్మిట్ జరగనుందని తెలిపారు. ఈ మేరకు గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ ఏడాది సమ్మిట్‌ను చెంజ్ టు లెజసి థీవ్‌తో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా సమాజంపై సానుకూల ప్రభావం చూపే కార్యక్రమాలను నిర్వహిస్తున్న సమ్మిట్ నిర్వాహకులను మంత్రి అభినందించారు. ఈ సమ్మిట్ ద్వారా కార్పొరేట్ సంస్థలు, ఎన్‌జిఓలు, సోషల్ ఇన్నోవేటర్లు, స్టార్టప్‌లు ఒకే వేదికపైకి వచ్చి సామాజిక అభివృద్ధికి కలిసి పనిచేసే అవకాశం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వినిల్‌రెడ్డి ఎదుదొడ్ల (లైసెన్సీ), వంశీ ముత్యపు (మేనేజింగ్ డైరెక్టర్), ఆదిత్య వేదాంతం (డైరెక్టర్), సుమంత్ వల్లాల (డైరెక్టర్) తదితరులు పాల్గొన్నారు.

### యుద్ధ ప్రభావంతో

# భారీగా పడిపోయిన కోడిగుడ్ల ధరలు

### ఎగుమతులు నిలిచిపోవడంతో పౌల్ట్రీ యజమానుల ఆందోళన

**హైదరాబాద్, మార్చి 12, ప్రభాతవార్త :** ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం వివిధ రంగాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. తాజాగా రాష్ట్రంలోని పౌల్ట్రీ పరిశ్రమ యుద్ధం కారణంగా ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. ఎగు మతులు నిలిచిపోవడంతో హైదరాబాద్, తెలంగాణలోని ఇతర ప్రాంతాలలో గుడ్ల ధరలు బాగా పడిపోయాయి. కొన్ని రోజుల క్రితం ఒక్కో గుడ్డు రూ.8కి అమ్ముడు కాగా, ఇప్పుడది రూ.4కి సగానికి పడి పోయింది. కొనసాగుతున్న పశ్చిమాసియా సంఘర్షణ కారణంగా ఎగుమ తులు క్షీణించిన తరువాత. గతంలో ఎగుమతి చేసిన గుడ్లను ఇప్పుడు స్థానిక మార్కెట్లకు మళ్లిస్తున్నట్లు పౌల్ట్రీ యజమానులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా రవాణా గొలుసులో అంతరాయాలు పశ్చిమాసియా దేశాలకు ఎగుమతులను ప్రభావితం చేశాయి. తెలంగాణతో పాటు, పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర నుండి గుడ్లు సాధారణంగా అనేక దేశాలకు ఎగుమతి అవుతుంటాయి. జాతీయ గుడ్డు సమన్వయ కమిటీ ధర ప్రకారం, బెంచ్‌మార్క్ ధర గుడ్డుకు రూ4.20 కాగా, సూపర్ మార్కెట్ ధరలు ఒక్కో గుడ్డుకు రూ.4.62గా విక్రయిస్తున్నాయి. సాధారణంగా గుడ్డు ధరలు రూ.6 నుండి రూ.7 మధ్య ఉంటాయి. మరియు కొన్నిసార్లు వేసవి కాలంలో కోళ్లకు వచ్చే వ్యాధులతో రూ.5 వరకు పడిపోతాయి. అయితే, ఈ నెలలోనే ముందుగా ఎగుమతి మందగమనం కారణంగా ధరలు దాదాపు రూ.4కి పడిపోయాయి. రాష్ట్ర గణాంకాల ప్రకారం తెలంగాణలో దాదాపు 2 వేల లేయర్ ఫామ్‌లు ఉన్నాయి, వీటిలో దాదాపు ఏడు కోట్ల లేయర్ కోళ్లు ప్రతి రోజూ 3.5 కోట్ల గుడ్లను ఉత్పత్తి చేస్తాయి. అయితే ఎగుమతులు లేకపోవడంతో ఎక్కడికక్కడ నిల్వలు పెరిగి వాటి ధరలు పడిపోయినట్లు పౌల్ట్రీ యజమానులు చెబుతున్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం దిశగా ప్రభుత్వం చర్యలు

### మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో ప్రొ. కోదండరాం, ఎమ్మెల్సీ దయాకర్ భేటీ

**హైదరాబాద్, మార్చి 12, ప్రభాతవార్త :** తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఈ విషయమై విదివిధానాల ఖరారుకు మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో ప్రొఫెసర్ కోదండరాం, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ గురువారం భేటి అయ్యారు. ఎన్నికల సమయంలో తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలుకు కమిటీ ఏర్పాటుపై ప్రాథమికంగా చర్చించినట్లు తెలిసింది. కమిటీ లో మహిళలకు ,పలువురికి అవకాశం ఇచ్చేలా అన్ని అంశాలు పరిగణనలోకి తీసుకోవాలని నిర్ణయించినట్టు సమాచారం. తెలంగాణ ఉద్యమకారులు హామీల అమలు, విధివిధానాలు, అర్హుల ఎంపిక, తదితర అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. జిల్లాల వారిగా అర్హులైన ఉద్యమకారులను గుర్తించి వారి డిమాండ్లపై అధ్యయనం చేయాలని నిర్ణయించారు. త్వరలో సిఎం రేవంత్‌రెడ్డితో ఉద్యమకారుల కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలని సమావేశం నిర్ణయించింది. వారంలో మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు.

# మహాప్రణాళికలకు రూ.4 లక్షల కోట్లు అవసరం

### 2050 సమగ్ర ప్రణాళిక.. 75 గ్రేడ్ సెపరేటర్లు అవసరం

### 120 ఫుట్‌ఓవర్ వంతెనలు/స్కైవాక్‌లు, 34 ఆర్‌ఒబిలు, 16 ఆర్‌యుబి అవసరం

### హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతానికి సమగ్ర మొబిలిటీ ప్రణాళికపై వర్క్‌షాప్

**హైదరాబాద్, మార్చి 12, ప్రభాతవార్త:** 2050 హైదరాబాద్ మహానగరం రవాణా పరిస్థితిపై హెచ్ఎండిఏ అధ్యయనం మొదలు పెట్టింది. అందులో భాగంగానే లీ సంస్థ ద్వారా అధ్యయనం చేపట్టింది. అందులో భాగంగానే హైద రాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతం కోసం సమగ్ర మొబిలిటీ ప్రణాళికపై వర్క్‌షాప్ నిర్వహించింది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎయుడి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ఆర్అండ్ బి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, రవాణాశాఖ కమిషనర్ కె. ఇలంబర్తి, టిజిఐఐసి వైస్ చైర్మన్ ఎండి ఎస్‌సిడిఏ కమిషనర్ కె. శశాంక, పట్టణ రవాణా అంశాలపై ప్రభుత్వ సలహాదారు ఎన్.వి.ఎస్. రెడ్డి, డిటిసిపి ఎస్. దేవేందర్ రెడ్డి, జెఎన్‌టియు కాకినాడ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు పలు అంశాలపై చర్చించారు. స్థిరమైన రవాణా వ్యవస్థలు, ఆర్థిక అభివృద్ధి దిశగా చేపడుతున్న చర్యలను వివరించారు. ఈ క్రమంలో హెచ్ఎండిఏ మూడు ముఖ్యమైన సాంకేతిక అధ్యయనాలను ప్రారంభించిందని, ఆర్థిక అభివృద్ధి ప్రణాళిక, సమగ్ర మొబిలిటీ ప్రణాళిక, 2050 వరకు మౌలిక సదుపాయాల ప్రణాళిక కోసం బ్లూ, గ్రీన్ మాస్టర్ ప్లాన్‌లు ఉన్నాయి. సిఎంపి అధ్యయనాన్ని లీ అసోసియేట్ సంస్థ నిర్వహిస్తుందని, ఈ వర్క్‌షాప్ ముఖ్య ఉద్దేశ్యం ప్రాథమిక సిఫార్సులను ప్రదర్శించి, ప్రధాన భాగస్వాముల నుంచి అభిప్రాయాలను సేకరించడం జరుగుతుందని అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ సలహాదారు ఎన్.వి.ఎస్. రెడ్డి ట్రాన్సిట్ ఫస్ట్ విధానాన్ని ప్రాముఖ్యంగా సూచిస్తూ, ప్రజా రవాణా వ్యవస్థ బలోపేతం, మెట్రో రైల్ లాస్ట్ మైల్ కనెక్టివిటీ మెరుగుదల, మెట్రో ఫేజ్ 2 విస్తరణ, పార్కింగ్ సమస్యల పరిష్కారం, తక్షణ మెరుగుదల ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ హైదరాబాద్‌లో గతంలో నిర్వహించిన ట్రాఫిక్ అధ్యయనాలను ప్రస్తావించారు. హెచ్ఎండిఏ పర్యాయ ప్రణాళిక ప్రయత్నాలను ప్రశంసించారు.

అదేవిధంగా సిఎంపి సిఎంపిను వికసిత్ భారత్ 2047 లక్ష్యాలతో అనుసంధానం చేసి, దాని పరిధిని త్రిపుల్‌ఆర్ వరకు విస్తరించాలని సూచించారు. జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) డి. జోయెల్ డేవిస్ మాట్లాడుతూ నగర కేంద్ర ప్రాంతాలు సైబరాబాద్ ట్రాఫిక్ పార్కింగ్ సమస్యలను ప్రస్తావించారు. పార్కింగ్ మేనేజ్‌మెంట్ ప్రణాళికలు, బేగంబజారు లాజిస్టిక్స్ పరిష్కారాలు ట్రాఫిక్ రద్దీ తగ్గించే వ్యూహాలను సూచించారు. రవాణా కమిషనర్ కె. ఇలంబర్తి మాట్లాడుతూ వ్యక్తిగత వాహనాల వేగవంతమైన పెరుగుదలపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా రవాణా వ్యవస్థను మరింత మెరుగుపరచాల్సిన అవసరాన్ని తెలియజేశారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ మెట్రో మాట్లాడుతూ వ్యవస్థలను బలోపేతం చేయడం, అలాగే హైదరాబాదు, బెంగళూరు, అమరావతి-చెన్నై నగరాలతో కలిపే హై స్పీడ్ రైలు కారిడార్ల అభివృద్ధిని ప్రస్తావించారు. లీ సంస్థ ఎండి డా. ఎం.పి. రాజు సిఎంపికి సంబంధించిన ప్రతిపాదనలను వివరించారు 2030, 2040, 2050 సంవత్సరాల దృష్ట్యా అదనపు మెట్రో నెట్‌వర్క్ పొడవు వరుసగా 258.4 కి.మీ., 534.1 కి.మీ., మొత్తం కలిపి 556.6 కి.మీ.గా ప్రతిపాదించారు. ప్రతి దిశకు ఒక ట్రాక్ ఉండే ట్విన్ ట్రాక్ వ్యవస్థను పరిగణలోకి తీసుకున్నామని, 2030, 2040 నాటికి అదనపు ఎంఎంటిఎస్ నెట్‌వర్క్ 202 కి.మీ., 255.6 కి.మీ.గా ఉండి, 2050 నాటికి మొత్తం 336.4 కి.మీ. వరకు విస్తరించనుందన్నారు. 2030, 2040 మరియు 2050 సంవత్సరాలకు అనుగుణంగా కొత్త రోడ్లు, హైవేలు, ఆర్టీరియల్, సబ్ ఆర్టీరియల్ కారిడార్లు (18 మీటర్ల కంటే ఎక్కువ వెడల్పు ఉన్నవి) కలెక్టర్ రోడ్లను ప్రతిపాదించారు. వీటి మొత్తం పొడవు వరుసగా 223 కి.మీ., 2,640 కి.మీ. - 2,847 కి.మీ. ఉంటుంది. లేన్ కి.మీ.ల పరంగా చూస్తే రోడ్ నెట్‌వర్క్ 2030లో 759 లేన్ కి.మీ., 2040లో 11,070 లేన్ కి.మీ., 2050లో 19,352 లేన్‌కి.మీ.గా పెరుగుతుందన్నారు. 2050 వరకు 75 గ్రేడ్ సెపరేటర్లు ప్రతిపాదించారు, 120 ఫుట్ ఓవర్ బ్రిడ్జు/స్కైవాక్లు ప్రతిపాదించారు, 34 ఆర్ఒబిలు,16 ఆర్‌యుబిలు ప్రతిపాదించారు, 8 ఎలివేటెడ్ రోడ్లు ప్రతిపాదించారు. మూసి నదిపై 29 వంతెనలు నిర్మించేందుకు ప్రతి పాదించారు. ప్రత్యేక బస్ లేన్లు (డిబిఎల్)/బిఆర్‌టిఎస్ కోసం 2040 నాటికి 29 కి.మీ., 2050 నాటికి 48 కి.మీ. వరకు రోడ్డు కారిడార్లు గుర్తించారు. 2050 వరకు 7 అంతర నగర/అంతర రాష్ట్ర బస్ టెర్మినల్స్, ట్రక్ టెర్మినల్స్ ప్రతిపాదించారు. ఈ ప్రణాళిక అమలుకు 2050 వరకు సుమారు 4 లక్షల కోట్లు పెట్టుబడి అవసరమని అంచనా వేశారు.

# నెట్‌ఫ్లిక్స్‌తో హైదరాబాద్‌కు హాలీవుడ్ వచ్చినట్లే

### ఐలైన్ స్టూడియోను ప్రారంభించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 12:** నెట్‌ఫ్లిక్స్ సంస్థ విస్తరణకు భారత్ ఫ్యూచర్ సిటీలో అవసరమైన స్థలం కేటాయించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రపంచంలోని ఫార్చ్యూన్ 500 కంపెనీలను హైదరాబాద్ నుంచి కార్యకలాపాలను నిర్వహించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని, నెట్‌ఫ్లిక్స్ కార్పొరేట్ కార్యాలయం కూడా ఈ మహానగరం నుంచి కొనసాగించాలని అభిలషించారు. దేశంలో ముంబై తర్వాత హైదరాబాద్‌లో రెండో అతిపెద్ద నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి గురువారం ప్రారంభించారు. ఐలైన్ స్టూడియో ప్రారంభంతో యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ రంగాల్లో హైదరాబాద్ విప్లవాత్మకమైన మార్పులకు వేదిక కానుంది. ఈ ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రజలు ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ తరుణం వచ్చేసింది. నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్‌కు వచ్చేసిందన్నారు.. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీలో సరిపడా పరిమాణంలో నెట్‌ఫ్లిక్స్ విస్తరణ కోసం స్థలం కేటాయిస్తామన్నారు. అవసరమైతే నెట్‌ఫ్లిక్స్ కార్పొరేట్ కార్యాలయాన్ని హైదరాబాద్‌కు రిలొకేట్ చేయాలని కోరారు. ఒకప్పుడు బ్లాక్ అండ్ వైట్ నుంచి టెక్నోకలర్, అక్కడి నుంచి ఈస్ట్‌మన్ కలర్, తర్వాత 70 ఎంఎం, డాల్బీ, అక్కడి నుంచి ఇప్పుడు సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు.. ఈ ప్రాంతం టాలీవుడ్, బాలీవుడ్ కాకుండా హాలీవుడ్ కూడా రావాలని మొదటి నుంచి బలంగా కాంక్షి స్తున్నట్లు పేర్కొన్నారు. 2047 నాటికి 3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నా మని చెప్పారు. తెలంగాణ అంటేనే వ్యాపారం, పెట్టుబడులకు అన్ని విధాలుగా రక్షణ ఉంటుందన్నారు. నెట్‌ఫ్లిక్స్ ప్రపంచానికి వినోదం అందించాలని చూస్తోంది. మేం ప్రపంచాన్ని సుసంపన్నం చేయాలని చూస్తున్నాం. మీకూ మాకు మధ్యన సారూప్యత ఉంది. నెట్‌ఫ్లిక్స్, హైదరాబాద్ ప్రపంచంలోని అన్ని సంస్కృతులను ప్రజలను ఆహ్వానిస్తుందన్నారు.. నెట్‌ఫ్లిక్స్, హైదరాబాద్ రెండూ గేట్‌వేలుగా పనిచేయడానికి దోహదపడుతాయి. ప్రపంచవ్యాప్తంగా వీక్షకుల కోసం ట్యాలెంట్, కంటెంట్‌ను నెట్‌ఫ్లిక్స్ అందిపుచ్చుకుంటే, హైదరాబాద్ అవకాశాలు, ప్రపంచ నైపుణ్యతను కలిగి ఉందన్నారు.. మనం వారధి లాంటి వాళ్లం. మార్పును ఆశించే వాళ్లం.




డీవీడీలను అద్దెకు సమకూర్చే స్థాయి నుంచి ఓటీటీలో ప్రపంచ లీడర్‌గా నెట్‌ఫ్లిక్స్ ఎదిగిందన్నారు.. ఫుడ్, ట్రావెల్, వారసత్వం, సంస్కృతి విషయాల్లో ప్రజలు నెట్‌ఫ్లిక్స్‌ను, హైదరాబాద్‌ను ప్రేమిస్తారు. ప్రపంచ వీక్షకులకు తెలంగాణను విశ్వవ్యాప్తం చేయడంలో నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ ఫెసిలిటీ ఎంతో ఉపయోగపడు తుందన్నారు. 'నెట్‌ఫ్లిక్స్ ఈ మధ్య కాలంలో స్పోర్ట్స్‌పై దృష్టిని సారించింది. స్పోర్ట్స్‌లో ఈ సంస్థ అతిపెద్ద బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ కాబోతుంది. తెలంగాణ ప్రభుత్వం కూడా అన్ని స్థాయిల్లో ట్యాలెంట్‌ను గుర్తించాలన్న లక్ష్యంతో క్రీడల పట్ల, క్రీడాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, స్పోర్ట్స్ యూనివర్సిటీ నెలకొల్పాం. మీకూ మాకూ ఎంతో సారూప్యత కలిగిన నేపథ్యంలో నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్ రెండూ కలిసి మంచి విజయాలను సాధించాలి' అని చెప్పారు. 'నెట్‌ఫ్లిక్స్‌కు తెలంగాణ స్వాగతం పలుకుతోంది. ప్రభుత్వం తరపున సంపూర్ణ సహకారం అందిస్తాం. భారత్, తెలంగాణ భవిష్యత్తులో ప్రపంచస్థాయి వినోదాన్ని అందిస్తాయనడానికి ఈ కార్యక్రమమే ఒక నిదర్శనం మనం కలిసి భవిష్యత్తుపై బలమైన ముద్ర వేద్దాం' అని పిలుపునిచ్చారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఐలైన్ స్టూడియో సీఈఓ జెఫ్ షపిరో గారు, కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు గారు, సినీ నటుడు, నిర్మాత రాణా దగ్గుబాటి, తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్‌రాజుతో పాటు నెట్‌ఫ్లిక్స్‌కు చెందిన పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు. సినిమాలపై తనకు ప్రత్యేక ఆసక్తి ఉందని, మూవీస్ చూడటం చాలా ఇష్టమని అన్నారు. నా బాల్యం నుంచి ఇప్పటి వరకు సినిమాలో అనేక మార్పులు వచ్చా యి. బాహుబలి, కల్కి, ఆర్.ఆర్.ఆర్, అరుంధతి వంటి అత్యనున్నత సాంకేతికతో కూడిన సినిమాలు వచ్చాయని ప్రస్తావించారు. నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్‌కు వచ్చిందంటే హాలీవుడ్ వచ్చినట్లే, మా దృష్టి హాలీవుడ్ పైననే అని నేను గతంలోనే చెప్పాను, నెట్‌ఫ్లిక్స్‌తో నా కల నిజం కాబోతుంది అని చెప్పారు. హైదరాబాద్‌లో ఐలైన్ స్టూడి యోను ప్రారంభించడం సంతోషంగా ఉందని ప్రముఖ నటుడు రానా అన్నారు. ఐలైన్ వంటి సంస్థ హైదరాబాద్‌కి రావడం ఇక్కడి సినిమాలు, అవి సాధించిన విజయాల గురించి చెప్పడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. నటులకు, దర్శకులకు, ప్రొడ్యూసర్లకు ఇలాంటి స్టూడియో భవిష్యత్తులో ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమంపై గురువారం సాయంత్రం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'తెలంగాణకు నెట్‌ఫ్లిక్స్‌ను స్వాగతిస్తూ, సృజనాత్మకత, ఆవిష్కరణ, ప్రపంచ ఆకర్షించడానికి ఈ సహకారం ఉంటుంది. హైదరాబాద్, నెట్‌ఫ్లిక్స్ కలిసి ప్రపంచంలో ప్రతిభ, అవకాశాలు, సంస్కృతులను అనుసంధానించే ద్వారాలుగా పనిచేస్తాయి. అంతర్జాతీయ వినోదం, సృజనాత్మక పరిణామానికి అర్థవంతంగా దోహదపడతాయి' అని రాసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ సీఈఓ జెఫ్ షాపిరో పాల్గొన్నారు.

### మరణించిన టి.ఫైబర్‌ఉద్యోగి పిల్లలకు

# రూ.3 లక్షల సాయం

### అందజేసిన మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, మార్చి 12, ప్రభాతవార్త:** అనారోగ్యంతో అకాల మరణం పాలైన టి ఫైబర్ కార్పోరేషన్ డిస్ట్రిక్ట్ మేనేజర్ బుర్రా నాగరాజారావు ఇద్దరు పిల్లలకు ఏ సమస్య వచ్చినా ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు భరోసా ఇచ్చారు. గురువారం సచివాలయంలో నాగరాజా రావు కుమార్తె సుప్రీతికి రూ. 3 లక్షల ఫిక్సుడ్ డిపాజిట్ పత్రాన్ని అందజేసారు. తన అమ్మమ్మ వెంకట లక్ష్మితో వచ్చిన 14 ఏళ్ల సుప్రీతిని పట్టుదలతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ధైర్యం చెప్పారు. ఈ విషయమై ఎప్పుడు ఏ సహాయం అవసరమైనా తన కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. సుప్రీతి తల్లి గత జూన్ లో మరణించగా తండ్రి సెప్టెంబరులో అనారోగ్యంతో ప్రాణాలు కోల్పోయారు. దానితో అనాథలైన ఇద్దరు చిన్నారులను హుజారాబాద్ కు చెందిన అమ్మమ్మ చేరదీసింది. శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు పిల్లలను ఆర్థికంగా ఆదుకునేందుకు టి ఫైబర్ కార్పోరేషన్ ఎండి పన్నేరు వేణు ప్రసాద్ తమ సంస్థ తరపున రూ.3 లక్షలు ఫిక్సుడ్ డిపాజిట్ చేయించారు. నాగరాజా రావు కుమారుడు సంప్రీత్ ఇంటర్ చదువుతుండగా కుమార్తె సుప్రీతి 9 వ తరగతి చదువుతుంది.

# రైతు విద్యుత్ పంపిణీ సంస్థ

### భారీ అప్పలతో ఏర్పడిన తొలి డిస్కంగా రికార్డు

### అప్ప, బకాయిలు రూ.71,964 కోట్లు

### ప్రభుత్వ శాఖల బకాయిలు రూ.35,982 కోట్లు

### కొత్త డిస్కంలో 2 వేల మంది ఉద్యోగుల నియామకం

### ఇక పక్కాగా వ్యవసాయ కనెక్షన్ల మీటర్ రీడింగ్

**హైదరాబాద్, మార్చి 12, ప్రభాతవార్త :** భారీ అప్పులతో ఏర్పడిన మొదటి డిస్కంగా రైతు విద్యుత్ పంపిణీ సంస్థ రికార్డు సృష్టించింది. ఇప్పటికే ఉన్న రాష్ట్రంలోని దక్షిణ తెలంగాణ, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలకు సంబంధించిన పెద్ద పెద్ద అప్పులను ఈ రైతు విద్యుత్ పంపిణీ సంస్థకు బదిలీ చేశారు. దీంతో దాదాపు రూ.71,964 కోట్ల రుణాలు, బకాయిలను రైతు డిస్కామ్‌కు బదిలీ చేసినట్లు విద్యుత్ శాఖ ఉన్నతాధికారవర్గాలు వెల్లడించాయి. ఇందులో ప్రభుత్వ శాఖ బకాయిలు రూ.35,982 కోట్లు కాగా, విద్యుత్ కొనుగోలు బాధ్యతలు రూ.26,950 కోట్లుతో పాటు, ఇప్పటికే ఉన్న డిస్కామ్‌ల నుండి వారసత్వంగా వచ్చిన మరో రూ.9,032 కోట్ల బకాయి రుణాలు ఉన్నాయి. అలాగే వర్కింగ్ క్యాపిటల్ లోన్ రూ.55,979 కోట్లు, క్యాపెక్స్ లోన్ రూ.6,918 కోట్లు మూడో డిస్కంలో చేర్చారు. అగ్రికల్చర్, లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్లు, మిషన్ భగీరథ, జలమండలి, పట్టణ నీటి సరఫరా తదితర కనెక్షన్లను అన్నీ కలిపి సుమారు 29.08 లక్షల విద్యుత్ కనెక్షన్లను దీనికి బదలాయించారు. ఇక కొత్త డిస్కం పరిధిలోకి 2 వేల మంది ఉద్యోగులను నియమించనున్నారు. ప్రస్తుతం విద్యుత్ శాఖలో పని చేస్తున్న ఉద్యోగులనే కొత్త డిస్కంలోకి డిప్యూటేషన్‌పై పంపిస్తున్నారు. వ్యవసాయ కనెక్షన్ల మీటర్ రీడింగ్ పక్కాగా తీయడానికి స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేయనుంది. ఏప్రిల్ నుండి ఈ కొత్త డిస్కం సేవలు అందించేలా నిర్వహణ ఏర్పాట్లు చేస్తున్నారు. రూ.4,929 కోట్ల వ్యవసాయ డీటీఆర్లు, వాటికి సంబంధించిన ఎల్టీ విద్యుత్ లైన్ల వంటి ఆస్తులను పాత రెండు డిస్కంల నుంచి బదిలీ చేశారు. పవర్ కొనుగోలు, పీపీఏ ఒప్పందాలు చేసుకోవచ్చు. దీనికోసం పాత సంస్థల నుంచి వాటా ఇచ్చారు. మూడో డిస్కం నిర్వహణకు 660 మంది ఇంజినీర్లు, 1000 మంది సిబ్బంది, 340 మంది అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది అవసరం కాగా, టీజీ ట్రాన్స్కో, జెన్కో, ఎన్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ పరిధిలో పని చేస్తున్న వారిని బదిలీ చేస్తున్నారు. మీటరింగ్, ఎనర్జీ సెటిల్మెంట్ కోసం ఎల్టీ డీటీఆర్ల పైన స్మార్ట్ మీటర్లు అమర్చుతారు. వీటిద్వారా వ్యవసాయ, ఇతర కేటగిరీల కేటాయింపులను ఖచ్చితంగా లెక్కిస్తారు. ఈ స్మార్ట్ మీటర్లను డీటీఆర్లకు అమర్చేందుకు రూ.1,306 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇంటర్ఫేస్ మీటర్ల ద్వారా డిస్కంల మధ్య ఎనర్జీ వినియోగం పంచుతారు. 2026, ఏప్రిల్1 నాటికి మూడవ డిస్కం ఆపరేషన్లు ప్రారంభం కావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది.

# నీటిపారుదల రంగంలో పెనుమార్పులు

### ఆధునిక సాంకేతికతపై సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు దృష్టి పెట్టాలి

### ఒయు నిర్మాణ్-2026లో మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** సివిల్ ఇంజినీరింగ్ అభివృద్ధి ద్వారా తెలంగాణలో నీటిపారుదలరంగంలో పెను మార్పులు చోటుచేసుకు న్నాయని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాలమంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. చారిత్రాత్మక ప్రాజెక్టులైన నాగార్జునసాగర్ డ్యాం, నిజాంసాగర్, శ్రీశైలంతో పాటు ఆధునికి పాజెక్టులు సివిల్ ఇంజినీరింగ్ నైపుణ్యానికి నిదర్శనమని చెప్పారు. భవిష్యత్‌లో ఇంజినీరింగ్‌రంగం స్థిరమైన అభివృద్ధి, వాతావరణ మార్పులకు తట్టుకునే రూపకల్పన, జిఐఎస్, రిమోట్ సెన్సింగ్, ఆటోమేషన్ వంటి ఆధునిక సాంకేతికతల వినియోగంపై దృష్టి పెట్టాలని సివిల్ ఇంజనిరింగ్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఓస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు నిర్మాణ్-26ను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. తెలంగాణ గర్వకారణమైన ఉస్మానియా యూనివర్సిటిని ప్రపంచ స్థాయి విద్యాపరిశోధనా కేంద్రంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. విశ్వవిద్యాలయ సమగ్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.1000 కోట్లు మంజూరు చేయడం చారిత్రాత్మక నిర్ణయమని కొనియాడారు. 1917లో నిజాం స్థాపించిన ఈ విశ్వవిద్యాలయం తెలంగాణలో ప్రముఖ విద్యా కేంద్రంగా ఎదిగిందని, 1929లో స్థాపితమైన ఇంజినీరింగ్ కళాశాల దేశంలో ఆరో పురాతన ఇంజినీరింగ్ కళాశాలగా గుర్తింపు పొందిందని చెప్పారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని ప్రకటించారు. ఉపాధ్యాయుల ఖాళీల భర్తీ అంశాన్ని ముఖ్యమంత్రితో చర్చించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. యూనివర్సిటీ లేదా విద్యార్థులకు అవసరమైన సహాయం కోసం నేరుగా తనను సంప్రదించాలని కూడా సూచించారు.

# గ్యాస్ కొరతపై కేంద్రం జోక్యం చేసుకోవాలి

### కేంద్రమంత్రి హార్దీప్‌సింగ్ పూరీకి కెటిఆర్ లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 12:** దేశంలో వాణిజ్య, గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ల తీవ్ర కొరత ఏర్పడిందని, ఈ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు తక్షణమే జోక్యం చేసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన గురువారం కేంద్ర పెట్రోలియం, సహజవాయువు శాఖ మంత్రి హార్దీప్ సింగ్ పూరీకి ఒక లేఖ రాశారు. ఎల్పీజీ సరఫరాలో అంతరాయం కారణంగా హోటళ్లు, తినుబండారాలు, పీజీ హాస్టళ్లు, చిన్న ఆహార వ్యాపారాలు తీవ్రంగా ప్రభావితమవుతు న్నాయని కేటీఆర్ తన లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. సరఫరాను వెంటనే పునరుద్ధరించకపోతే, వేలాది సంస్థలు మూతపడే ప్రమాదం ఉందని, వాటిపై ఆధారపడిన లక్షలాది మంది కార్మికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని హెచ్చరించారు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు కేటీఆర్ కేంద్రానికి కొన్ని కీలక సూచనలు చేశారు. చిన్న వ్యాపారులకు ప్రాధాన్యతనిచ్చేలా ఎల్పీజీ కేటాయింపుల విధానాన్ని ప్రవేశపెట్టాలని సూచించారు. జిల్లాల వారీగా సిలిండర్ల లభ్యతపై పారదర్శక సమాచారం కోసం రియల్‌టైమ్ పబ్లిక్ డ్యాష్‌బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. సంక్షోభ సమయంలో చిన్న వ్యాపారులపై అదనపు భారం పడకుండా వాణిజ్య సిలిండర్ల ధరల పెరుగుదలను తాత్కాలికంగా నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు.

గృహ వినియోగ సిలిండర్లను అక్రమంగా వాణిజ్య అవసరాలకు మళ్లించి, అధిక ధరలకు విక్రయించే బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఐటీ కారిడార్ ప్రాంతాల్లోని పీజీ హాస్టళ్లను ప్రత్యేక కేటగిరీగా గుర్తించి, అంతరాయం లేని సరఫరాను అందించాలని కోరారు. అలాగే, గ్యాస్ ఆధారిత శ్మశానవాటికలను అత్యవసర సేవలుగా వర్గీకరించి, వాటి కార్యకలాపాలకు ఆటంకం కలగకుండా చూడాలని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు. ఇది లక్షలాది మంది జీవితాలను ప్రభావితం చేసే తీవ్రమైన సమస్య అని, వెంటనే స్పందించి సరఫరాను పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# నూనెగింజల కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం

### కనీస మద్దతు ధరతో రైతుల నుంచి

### రూ. 894 కోట్లకుపైగా విలువైన పప్పుధాన్యాలు

**హైదరాబాద్, మార్చి 12, ప్రభాతవార్త:** తెలంగాణ రైతులు పండించిన 1,25,855 మెట్రిక్ టన్నుల పప్పుధాన్యాలు, నూనెగింజలను రూ.894 కోట్లకు పైగా కనీస మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ రైతులకు లబ్ధి చేకూర్చేలా నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోడీకి, కేంద్ర వ్యయసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కి కిషన్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. మార్కెట్లలో ధరల హెచ్చు తగ్గుల ప్రభావం రైతుల మీద పడకుండా వారికి నిరంతరం అండగా ఉంటూనే ఇప్పుడు పెద్ద ఎత్తున పప్పుధాన్యాలు, నూనెగింజల కొనుగోలుకు ఆమోదం తెలపడం మోడీ ప్రభుత్వానికి తెలంగాణ రైతుల అభివృద్ధి పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. 2026 పంట కాలానికి సంబంధించి తెలంగాణ రైతులు పండించిన 29,860 మెట్రిక్ టన్నుల శనగలు, 37,020 మెట్రిక్ టన్నుల మినుములు, 55,285 మెట్రిక్ టన్నుల వేరుశనగ, 3,690 మెట్రిక్ టన్నుల పొద్దుతిరుగుడు విత్తనాలను కనీస మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు.




# ప్రపంచకప్ బెర్త్ దిశగా భారత్

* సెమీస్ పోరులో ఇటలీతో సవాల్
* గ్రూప్ స్టేజ్‌లో అజేయంగా భారత్
* ఉరుగ్వే, వేల్స్‌పై అద్భుత విజయాలు

తొలి సెమీఫైనల్ : ఇంగ్లాండ్ X స్కాట్లాండ్ (సాయంత్రం 5.15 గంటలకు)

రెండో సెమీఫైనల్ : భారత్ X ఇటలీ (రాత్రి 7.30 గంటలకు)

**పూల్-ఎ పాయింట్ల పట్టిక**

| జట్టు | మ్యా | గె | డ్రా | ఓ | పా |
|---|---|---|---|---|---|
| ఇంగ్లాండ్ | 3 | 3 | 0 | 0 | 9 |
| ఇటలీ | 3 | 1 | 1 | 1 | 4 |
| కొరియా | 3 | 1 | 1 | 1 | 4 |
| ఆస్ట్రియా | 3 | 0 | 0 | 3 | 0 |

**పూల్-బి పాయింట్ల పట్టిక**

| జట్టు | మ్యా | గె | డ్రా | ఓ | పా |
|---|---|---|---|---|---|
| భారత్ | 3 | 2 | 1 | 1 | 7 |
| స్కాట్లాండ్ | 3 | 2 | 1 | 0 | 7 |
| ఉరుగ్వే | 3 | 1 | 0 | 2 | 3 |
| వేల్స్ | 3 | 0 | 0 | 3 | 0 |

**హైదరాబాద్, మార్చి 12 (వార్త క్రీడా ప్రతినిధి):** భారత్ మహిళల హాకీ జట్టు చరిత్ర సృష్టించేందుకు సిద్ధమైంది. గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి స్టేడియంలో జరుగుతున్న మహిళా హాకీ ప్రపంచకప్ క్వాలి ఫైయింగ్ టోర్నీలో జోరు మీదుంది. ఈ రోజు జరిగే సెమీఫైనల్లో ఇటలీతో భారత అమ్మాయిల జట్టు తలపడనుంది. ఈ మ్యాచ్‌లో నెగ్గితే ప్రపంచకప్‌కు అర్హత సాధిస్తుంది.ఓడినా మరో అవకాశం భారత్‌కు ఉంటుంది. మూడో స్థానం మ్యాచ్‌లో గెలుపొందినా ప్రపంచకప్ ఆడే అవకాశం దక్కుతుంది.

సెమీఫైనల్లో ఇటలీని కంగుతినిపించేందుకు భారత్ సిద్ధమైంది. ఇటలీపై భారత్ పైచేయిగా ఉంది. ఇరు జట్లు 2012 నుంచి ఏడుసార్లు తలపడగా, అయిదింటిలో భారత్ నెగ్గింది. ఒక మ్యాచ్ డ్రా కాగా, ఇటలీ ఒక్క మ్యాచ్‌లోనే గెలుపొందింది. సొంతగడ్డపై ఆడుతున్న భారత్‌కు ఇది సైకలాజికల్ గా పైచేయి సాధించే అంశం. సలీమా టెటె సారథ్యంలోని భారత జట్టు మునుపటి ఫామ్‌ను చాటుతోంది. భారత్ ఫార్వర్డ్ సమన్వయంతో దూసుకుపోతూ గోల్స్ అందిస్తోంది. రక్షణ పంక్తి కూడా దుర్భేద్యంగా ఉంది. ఇటలీపై నెగ్గి ఫైనల్ చేరడంపై భారత్ మహిళా జట్టు దృష్టి సారించింది.

సొంతగడ్డపై జరుగుతున్న ఈ టోర్నీలో ఓటమి లేకుండా పూల్-బిలో భారత్ అగ్రస్థానంలో నిలిచింది. మొదటి మ్యాచ్‌లో ఉరుగ్వేపై నెగ్గి భారత అమ్మాయిలు.. రెండో మ్యాచ్‌ను స్కాట్లాండ్‌తో 2-2తో డ్రాగా ముగించింది. ఇక మూడో మ్యాచ్‌లో సలీమా టెటె టీమ్ 4-1 గోల్స్ తేడాతో వేల్స్‌ను చిత్తుచిత్తు చేసింది. భారత్ తరపున నవీన్‌నీత్ కౌర్ ఏకంగా మూడు గోల్‌నస చేసి హ్యాట్రిక్ నమోదు చేసింది. మరో గోల్‌ను సాక్షి రాణా అందించింది. ఈ గెలుపుతో భారత జట్టు ఏడు పాయింట్లతో పూల్-బి టాపర్‌గా నిలిచింది. భారత్‌తో పాటు స్కాట్లాండ్ కూడా ఏడు పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచి సెమీఫైనల్‌కు చేరుకుంది. అయితే మెరుగైన గోల్స్ సగటు ఆధారంగా భారత్‌కు టాప్ ర్యాంక్ దక్కగా... స్కాట్లాండ్ జట్టుకు పూల్-బిలో రెండో స్థానం లభించింది.

**పూల్-ఎ నుంచి సెమీఫైనల్లో ఇంగ్లాండ్, ఇటలీ**

ఇక మరో సెమీఫైనల్లో ఇంగ్లాండ్‌తో స్కాట్లాండ్ తలపడనుంది. పూల్-ఎలో ఇంగ్లాండ్ ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలుపొంది అజేయంగా నిలిచింది. మొత్తం 9 పాయింట్లతో టాప్ ప్లేస్‌లో ఇంగ్లాండ్ టాప్ ప్లేస్‌లో నిలవగా, ఇటలీ జట్టు ఆడిన మూడు మ్యాచ్‌ల్లో ఒక గెలుపు, ఒక ఓటమి, ఒక డ్రాతో... దక్షిణ కొరియాతో కలిసి నాలుగేసి పాయింట్లతో సమవుజ్జీగా నిలిచింది. అయితే మెరుగైన గోల్స్ సగటుతో ఇంగ్లాండ్ జట్టుతో కలిసి ఇటలీ మహిళా జట్టు సెమీఫైనల్ బెర్త్ సాధించింది.

# జొకోవిచ్ ఇంటిదారి

## డ్రాపర్ చేతిలో అనూహ్య ఓటమి



**కాలిఫోర్నియా:** ఇండియన్ వెల్స్ టెన్నిస్ టోర్నీలో సంచలనం నమోదైంది.డిఫెండింగ్ చాంపియన్ జాక్ డ్రాపర్ 4-6, 6-4, 7-6తో 38 ఏళ్ల సెర్బియా స్టార్ నోవాక్ జొకోవిచ్‌పై సంచలన విక్టరీ నమోదుచేశాడు. 8 ఏళ్ల తర్వాత ఇండియన్ వెల్స్ బరిలోకి దిగిన 5సార్లు ఛాంపియన్ జొకొవిచ్ ఈసారి క్వార్టర్ ఫైనల్ అధిగమించలేక పోయాడు. తొలి సెట్‌ను 6-4తో నెగ్గి జొకోవిచ్ జోరుచూపినా .. తరువాతి సెట్లలో డ్రాపర్ పుంజుకుని గెలుపొంది క్వార్టర్ ఫైనల్ చేరాడు. నాలుగో రౌండ్‌లో అల్కరాజ్ 6-1, 7-6తో వరుస సెట్లలో రూడ్‌పై నెగ్గి ముందంజ వేశాడు. కాగా మెద్వెదేవ్ సెమీఫైనల్లో ప్రవేశించాడు. క్వార్టర్ ఫైనల్లో 6-2, 6-4తో వరుస సెట్లలో అమెరికా ఆటగాడు. మైకెల్సెన్‌పై అలవోకగా గెలుపొందాడు. మహిళల సింగిల్స్‌లో రైబాకినా 6-4, 6-4తో కర్తాల్‌పై, పెగులా 6-3, 7-6తో బెన్సిక్‌పై నెగ్గి క్వార్టర్ ఫైనల్ చేరారు.



## సెమీస్‌లో బాంబ్రీ జోడీ

**కాలిఫోర్నియా:** భారత డబుల్స్ టెన్నిస్ స్టార్ యూకీ బాంబ్రీ ఏటీపీ మాస్టర్స్ 1000లో తొలి సారి సెమీఫైనల్లో ప్రవేశించాడు. ఆంద్రీ గొరాన్సన్‌తో కలిసి ఇండియన్ వెల్స్ టోర్నీలో బరిలోకి దిగిన యూకీబాంబ్రీ జోరు చూపుతున్నారు. యూకీ జోడీ క్వార్టర్ ఫైనల్లో 6-3, 7-6తో ఆస్ట్రియా-ఇటలీ జోడీ అలెగ్జాండర్ ఎర్లర్, ఆండ్రియా వవస్సోరీపై వరుస సెట్లలో అలవోకగా గెలుపొందారు. గంటా 30 నిమిషాలు సాగిన క్వార్టర్ ఫైనల్ పోరులో యూకీ జోడీ తొలి సర్వ్ నుంచి ఆధిక్యం చాటింది. అయితే రెండో సెట్ లో వీరికి ఆస్ట్రియా-ఇటలీ జోడీ నుంచి అనూహ్య పోటీ ఎదురైంది. ఇరువూరు పోటాపోటీగా పాయింట్లు సాధించడంతో టై బ్రేకర్‌కు సాగింది. టై బ్రేకర్‌లోయూకీ జోడీ 7-2తో ముగించి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది.

# స్విస్ ఓపెన్‌లో కిరణ్ జార్జ్ సంచలనం

## మూడో సీడ్‌పై విక్టరీ

## కిడాంబికి నిరాశ



**బాసెల్:** స్విస్ బిడబ్ల్యూఎఫ్ 300 బ్యాడింటన్ టోర్నీలో భారత షట్లర్ కిరణ్ జార్జ్ సంచలనం నమోదుచేశాడు. అన్ సీడెడ్‌గా బరిలోకి దిగిన కిరణ్ జార్జ్ తొలి రౌండ్‌లో 23-21, 21-19తో మూడో సీడ్ లోహ్ కీన్ య్యూను ఓడించాడు. ప్రస్తుతం 42వ ర్యాంకులో ఉన్న కిరణ్ జార్జ్ తొలి సెట్ నుంచి జోరు చూపాడు. టైబ్రేకర్ లో 23-21తో నెగ్గిన కిరణ్... రెండో సెట్ లోనూ ఆధిక్యం చాటాడు. 21-19తో గెలుపొంది కిరణ్ ముందంజ వేశాడు.కిరణ్ జార్జ్ రెండో రౌండ్‌లో హాంకాంగ్ షట్లర్ జాసన్ గునావన్‌తో తలపడతాడు.



కాగా భారీ అంచనాలతో స్విస్ ఓపెన్ బరిలో దిగిన కిడాంబి శ్రీలంకకు తొలి రౌండ్‌లోనే చుక్కెదురైంది. మాజీ ప్రపంచ నెంబర్ వన్ కిడాంబిని హాంకాంగ్ ప్లేయర్ గునావన్ కంగుతినిపించాడు. తొలి సెట్ 21-15తో నెగ్గి చక్కని శుభారంభం చేసిన కిదాంబి ఆ తర్వాతి సెట్లలో కొనసాగించలేకపోయాడు. రెండో సెట్‌ను 12-21తో చేజార్చుకున్న కిడాంబి... కీలకమైన మూడో సెట్‌లో మరింత సులువుగా ఓడాడు. మరో భారత షట్లర్ ప్రణయ్ కూడా ఇంటిదారి పట్టాడు. గాయంతో తొలి రౌండ్‌లోనే ప్రత్యర్థికి వాకోవర్ ఇచ్చాడు.ఆయుష్, ఉన్నతి హూడా కూడా తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు.

# సుమిత్ అంటిల్‌కు జావెలిన్ స్వర్ణం

**న్యూఢిల్లీ:** ప్రపంచ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిక్స్‌లో భారత్ ఖాతాలో స్వర్ణం చేరింది. డబుల్ పారాలింపిక్ గేమ్స్ స్వర్ణ పతక విజేత జావెలిన్ త్రోయర్ సుమిత్ అంటిల్ టాప్ పోడియంపై నిలిచాడు. జావెలిన్ త్రోలో 69.24 మీటర్లు నమో దుచేసి స్వర్ణం అందుకున్నాడు. పుష్పేంద్ర సింగ్ 56.91 మీటర్లతో రజతం, పూనమ్ రామ్ 49.48 మీటర్లతో కాంస్యం సాధించారు. జావెలిన్ త్రో తన అంచనాలను రెండు మీటర్లు మించిందని అంటిల్ చెప్పాడు. పురుషుల 400మీటర్ల ఈవెంట్‌లో సుబోధ్ భట్ 51.88 సెకన్లలో చేరి స్వర్ణం గెలుచుకున్నాడు.లాంగ్ జంప్‌లో శాలిష్ కుమార్ 5.47 మీటర్ల దూరం దూకి స్వర్ణం అందుకున్నాడు.



# సన్ రైజర్స్ జట్టులో పాక్ క్రికెటర్



**లండన్:** పాకిస్థాన్ క్రికెటర్ అబ్రార్ అహ్మద్‌కు సన్ రైజర్స్ ఏకంగా 2.34 కోట్లు ధర పెట్టింది. ఇది ఐపీఎల్ వేలం అనుకుంటే పొరపాటు. ఇంగ్లాండ్ వేదికగా జరిగే పరిమిత ఓవర్ల క్రికెట్ లీగ్ ది హండ్రెడ్ కోసం. వేలంలో స్పిన్నర్ అబ్రార్ ను 2.34 కోట్ల ధర పెట్టి సన్ రైజర్స్ లీడ్స్ దక్కించుకుంది. ఈ జట్టులో సన్ గ్రూప్‌కు వాటా ఉంది. వేలంలో సన్‌రైజర్స్ సీఈవో కావ్యా మారన్, ప్రధాన కోచ్ డానియల్ వెట్టోరి కూడా పాల్గొన్నారు. సన్‌రైజర్స్ లీడ్స్ జట్టుకు హ్యారీ బ్రూక్ సారథిగా ఉన్నాడు. దీంతో పాకిస్థాన్ ప్లేయర్‌తో భారత్‌కు చెందిన ఫ్రాంచైజీ యాజమాన్యం ఒప్పందం చేసుకోవడం ఇదే మొదటిసారి. కాగా పాకిస్థాన్ క్రికెటర్‌ను తీసుకోవడంపై సన్‌రైజర్స్ ఫ్రాంచైజీపై తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి.

# వాణిజ్యం

# బిలియనీర్స్‌లో టాప్‌త్రీ వీరే!



**ముంబయి, మార్చి 12:** భారత్‌లో బిలియనీర్ల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. గతేడాది 205 మంది ఉండగా, ఈ ఏడాది ఆ సంఖ్య 229కి చేరింది. వీరిలో 30 మంది కొత్తగా ఈ క్లబ్‌లో చేరారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ 9,970 కోట్ల డాలర్ల సంపదతో భారత్, ఆసియాలోనే అత్యంత సంపన్న వ్యక్తిగా తన స్థానం నిలుపుకున్నారు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఆయన 21వ స్థానంలో నిలిచారు. అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ 6,380 కోట్ల డాలర్ల నికర ఆస్తితో దేశంలో రెండో స్థానంలో ఉన్నారు.

ఇక మహిళల విషయానికొస్తే ఓపీ జిందాల్ గ్రూప్ చైర్మన్ సావిత్రి జిందాల్ 3,910 కోట్ల డాలర్ల ఆస్తితో దేశంలోనే అత్యంత ధనిక మహిళగా నిలిచారు. ప్రపంచవ్యాప్తంగా టెస్లా అధినేతఎలాన్ మస్క్ తిరుగులేని ఆధిపత్యంతో ఉన్నారు. 83,900 కోట్ల డాలర్ల ఆస్తితో ఆయన వరుసగా రెండో ఏడాది ప్రపంచ నంబర్ వన్ ధనవంతుడిగా నిలిచారు. గూగుల్ వ్యవస్థాపకులు లారీ పేజ్, సెర్గే బ్రిన్ వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంపద కూడా 27 శాతం వృద్ధి చెంది 650 కోట్ల డాలర్లకు చేరుకుంది. ఈసారి ఫోర్బ్స్ జాబితాలో తెలుగు వారి హవా స్పష్టంగా కనిపిస్తోంది. మొత్తం 15 మంది తెలుగు బిలియనీర్లు ఈ లిస్టులో చోటు దక్కించుకున్నారు. వీరిలో మెజారిటీ ఫార్మా రంగానికి చెందినవారే. దివీస్‌ల్యాబ్స్ మురళి దివి 1,010 కోట్ల డాలర్లు జిఎంఆర్‌గ్రూప్ జీఎం రావు 390 కోట్ల డాలర్లు అపోలో గ్రూప్ ప్రతాప్ సి రెడ్డి 360 కోట్ల డాలర్లు,

హెటిరోగ్రూప్ బీ పార్థసారథి రెడ 340 కోట్లు బయోలాజికల్ ఈ మహిమ దాట్ల 320 కోట్ల డాలర్లు, అరబిందో పీవీ రాంప్రసాద్ రెడ్డి 300 కోట్ల డాలర్లు,

మైహోమ్ జూపల్లి రామేశ్వర రావు 230 కోట్ల డాలర్లు, మేఘా ఇంజినీరింగ్ కృష్ణారెడ్డి పిచ్చిరెడ్డి వరుసగా 210 కోట్ల డాలర్లు, 200 కోట్ల డాలర్లు సంపదతో ఉన్నారు. ప్రపంచంలో అత్యధిక బిలియనీర్లు ఉన్న దేశాల్లో భారత్ మూడోస్థానంలో ఉంది.

అమెరికాలో 989 మంది, చైనాలె 610 మంది, మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. భారత బిలియనీర్ల మొత్తం సంపద ఈ ఏడాది లక్ష కోట్ల డాలర్లకు అంటే సుమారు రూ. 92 లక్షల కోట్లు చేరుకోవడం ఒక విశేషం.

# ఆరు నగరాల్లో రియాల్టీ శరవేగంగా వృద్ధి

## గ్రోత్‌ఇంజిన్లు ఈ నగరాలేనని స్క్వేర్‌యార్డ్ సంస్థ వెల్లడి

**ముంబయి, మార్చి 12:** దేశంలోని రెండు, మూడు శ్రేణి నగరాల్లో భూముల ధరలు మరింతగా పెరుగుతాయని ప్రాపర్టీ సంస్థ స్క్వేర్‌యార్డ్స్ ప్రకటించింది. భారీస్థాయిలో మౌలికవనరుల ప్రాజెక్టులు, పారిశ్రామిక విస్తరణ వంటివాటితో భూములకు డిమాండ్ మరింతపెరుగుతుంది. రియాల్టీ నెక్స్ట్ గ్రోత్ ఇంజిన్స్ రెండుమూడు శ్రేణి నగరాల మార్కెట్లలో ఎక్కువ ఫోకస్ ఉంటుందని, భూములధరలు ఈనగరాల్లో 25 నుంచి 100శాతం వరకూ వచ్చే నాలుగేళ్లలోపెరుగుతాయని ప్రకటించింది. కొత్తమౌలికవనరుల కారిడార్లు, ఉపాధి హబ్‌లుగా ఈ నగరాలుంటాయి. భువనేశ్వర్, కటక్, ఈరోడ్; పూరి, వారణాశి, విశాఖపట్టణాల్లో తదుపరిదశ రియల్ ఎస్టేట్ వృద్ధి ఉంటుంది. ప్రభుత్వ మౌలికవనరుల ప్రాజెక్టుల వ్యయం భారీగా ఉండటంవల్లనే వృద్ధి పెరుగుతుందని స్క్వేర్‌యార్డ్ అంచనావేసింది. పారిశ్రామిక కారిడార్లు, లాజిస్టిక్స్ నెట్‌వర్కులు, ఉపాధి హబ్‌లు ఉన్న ప్రాంతాల్లోనే భూములకు డిమాండ్ పెరుగుతుందని అంచనా. మెట్రోకారిడార్లకు 500 మీటర్లనుంచి ఒక కిలోమీటరు పరిధిలోని వాటికి 8 నుంచి 25వాతం ప్రీమియం ఉంటుందని, కారిడార్‌లస్థాయిలో పూర్తయితే 15 నుంచి 40శాతం డిమాండ్‌పెరుగుతుందని అంచనా. ఎయిర్‌పోర్టులు, ఎక్స్‌ప్రెస్ వేస్‌తో ఈ రియాల్టీ మరింత పెరుగుతుందని అంచనా. 30 నుంచి 70శాతంవరకూ పెరుగుదల ఉంటుందని అంచనా. ప్రభుత్వ మూలధన వ్యయం పెంచడం, ఉపాధివ1ద్ధి వంటి వాటితో ఆర్థిక స్థిరత్వం ఉంటుందని, నివాసిత రియాల్టీరంగం రూ.12.2 లక్షలకోట్ల పెట్టుబడులకు ఆస్కారం ఉంటుందని అంచనావేసారు. మధ్యస్థాయి హౌసింగ్ 50 లక్షలనుంచి రూ.కోటి ధరల విభాగంలో కూడా పెరుగుదల గణనీయంగా ఉంటుంది. 200కిపైగా లెగసీ ఇండస్ట్రియల్‌క్లస్టర్స్ వస్తున్నాయి. సెమికండక్టర్ మిషన్ 2.0, ఎలక్ట్రానిక్స్‌లో విస్తరణ, రసాయనాలు, ఆదునిక ఉత్పత్తి విధానాలు పెరుగుతుండటంతో భూములకు డిమాండ్‌మరింత పెరుగుతుందని స్క్వేర్‌యార్వ్ సర్వేలో వెల్లడించింది. పారిశ్రామికరంగం ప్రగతితోనే నివాసిత గృహాలకు కూడా డిమాండ్ పెరుగుతుందని ప్రత్యేకించి ఎలక్ట్రానిక్స్, సెమికండక్టర్ రంగాల్లోనే ఈ వృద్ధి ఉంటుందని అంచనా. ఈ వృద్ధికారణంగా హౌసింగ్‌కు స్థిరమైన డిమాండ్ ఉంటుందని, రెండు,మూడోశ్రేణి నగరాల్లోనే ఈ వృద్ధి భారీగా ఉంటుందని అంచనావేసారు. వీటిలో వాణిజ్య రియల్‌ఎస్టేట్, ఆఫీసులు, లాజిస్టిక్స్ పార్కులు, వేర్‌హౌసింగ్ సౌకర్యాలున్న రంగాలకు మరింత డిమాండ్‌పెరుగుతుంది.



# స్టాక్ మార్కెట్లపై పశ్చిమాసియా ఎఫెక్ట్ - నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, మార్చి 12:** స్టాక్ మార్కెట్లపై పశ్చిమాసియా దేశాల భౌగోళిక ఉద్రిక్తతలు తీవ్ర ప్రతాపం చూపిస్తున్నాయి. ముడిచురుధరలు పెరగడం, ఎఫ్‌పిఐల పెట్టుబడులు విత్‌డ్రా వంటివి మార్కెట్లను వణికిస్తున్నాయి. దేశీ ఈక్విటీసూచీల్లో గ్లోబల్‌ధోరణలు ప్రభావం ఎక్కువ చూపిస్తున్నాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 829.29 పాయింట్లు క్షీణించి 76,034.42 పాయింట్లవద్దట్రేడింగ్ నిలిపివేస్తే నిఫ్టీ 50 సూచీ కూడా 227.70 పాయింట్లుక్షీణించి 23,639.15 వద్ద ట్రేడింగ్‌ముగించింది. రెండు సెషన్లలో సెన్సెక్స్ 2.77శాతం, నిఫ్టీ 2.56శాతం క్షీణించాయి. మహీంద్ర అండ్ మహీంద్ర 4.39శాతం, ఎల్‌అండ్‌టి 3.28శాతం, ఐసిఐసిఐబ్యాంకు 1.91శాతం నిఫ్టీలో భారీగా నష్టపోయిన జాబితాలోఉన్నాయి. బిఎస్‌ఇ మిడ్‌క్యాప్‌సూచీ 0.24శాతం, బిఎస్‌ఇ స్మాల్‌క్యాప్ సూచీ 0.32శాతం చొప్పున పతనం చెందాయి. మార్కెట్ల ధోరణులు ప్రతికూలంగానే ఉన్నాయి. బిఎస్‌ఇలో 1713 షేర్లుపెరిగితే 2516 షేర్లు క్షీణించాయి. 190 కంపెనీల షేర్లుమాత్రం యధాతథంగా కొనసాగాయి. ఇక భారత్‌రిటైల్‌ద్రవ్యోల్బణం 3.21శాతంకు చేరింది. జనవరికంటే మరికొంతపెరిగింది. ఆహార ద్రవ్యోల్బణం ముఖ్యంగా 3.47శాతంగా ఉంది. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో భారత్‌రూపాయి 92.23వద్ద ఊగిసలాడింది. అంతకుముందురోజు 92.01వద్ద ముగిసిన సంగతి తెలిసిందే.ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు ఏప్రిల్ రెండునాటివి 0.10శాతం పెరిగి రూ.1,16,955గా కొనసాగాయి. పదేళ్ల అమెరికా ఒబ్లు 0.38శాతంపెరిగి 4.223శాతంకు చేరాయి. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడిచమురు మేనెల సెటిల్‌మెంట్లుకుగాను 4.98 డాలర్లుపెరిగి బ్యారెల్‌కు 96.96డాలర్లుగా నడిచింది. నిఫ్టీలో ఆటోసూచి 319శాతం క్షీణించింది.రెండు సెషన్లలను 6.24శాతం క్షీణించినట్లు తేలింది. వీటిలో టివిఎస్‌మోటార్స్ 5.35, మహీంద్ర 4.39, ఐషర్‌మోటార్స్ 3.92, మారుతిసుజుకి ఇండియా 3.72, అశోక్‌లేలాండ్ 3.61, హీరోమోటోకార్ప్ 3.31, టాటామోటార్స్‌ప్యాసింజర్ వెహికల్స్ 3.3శాతం, బజాజ్ ఆటో 1.88శాతం, యునోమిండా 1.54శాతం, బోష్ 1.31శాతం, భారత్‌ఫోర్జ్ 1.23శాతం చొప్పున క్షీణించాయి.

# రిటైల్‌ద్రవ్యోల్బణం 3.21%

## జనవరితోపోలిస్తే ఫిబ్రవరిలో మరింత పెరుగుదల

**ముంబయి, మార్చి 12:** భారత్‌లో ఫిబ్రవరి నెలకుగాను రిటైల్‌ద్రవ్యోల్బణం 3.21శాతంగా నమోదయింది. జనవరి నెల 2.74శాతం తోపోలిస్తే పెరిగింది. కేంద్ర అర్థగణాంకశాఖ మోస్పీ విడుదలచేసిన డేటాను పరిశీలిస్తే అఖిలభారత వినియోగరంగధరలసూచీ రిజర్వుబ్యాంకు ఎగువ అంచనాలకు అనుగుణంగానే ఉందని తెలిపింది. వార్షికపద్ధతిలోచూస్తే సిపిఐ బేస్ ఇయర్ 2024తో చస్తే ఫిబ్రవరి నెలకుగాను 3.21శాంగా ఉంది. ఈసారి పట్టణప్రాంతాలకంటే గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం ఎక్కువగా నమోదయింది. గ్రామీణ భారతావనిలో రిటైల్‌ద్రవ్యోమల్బణం 3.37శాతంగా ఉంటే పట్టణ ప్రాంతాల్లో 3.02శాతంగా ఫిబ్రవరిలోనమోదయింది. సిపిఐ సూచీ ఫిబ్రవరిలో 104.45 పాయింట్లనుంచి 104.57 పాయింట్లకుపెరిగింది. దీన్నిబట్టిచూస్తే కేటగిరీల వారీగా రానున్న కాలంలో ధరలు పెరుగుతాయని తెలుస్తోంది. ఆహార ద్రవ్యోల్బణం 3.47శాతానికి పెరిగింది. కూరగాయల ధరలు కొన్ని క్షీణించాయి. నెలవారీగాచూస్తే టొమాటో, పచ్చిబఠాణీలు, కాలిఫ్లవర్ ధరలు తగ్గాయి. ఇక వెండి ఆభరణాలు 160.84శాతంపెరిగాయి. బంగారం, వజ్రాలు, ప్లాటినమ్ ఆభరణాలు 48.16శాతం, కోకోనట్ కురిడీ 46.16శాతం, టొమాటో 45.29శాతం, కాలిఫ్లవర్ 43.77శాతంగా పెరిగినట్లు తేలింది. అలాగే కొన్ని ఆహార ఉత్పత్తులు ప్రతికూలంగా ఉన్నాయి. వెల్లుల్లి మైనస్ 31.09శాతం, ఉల్లి మైనస్ 28.20శాతం, ఆలుగడ్డలు మైనస్ 18.46శాతం, కంది మైనస్ 16శాతంగా ఉన్నట్లు మోస్పీ వెల్లడించింది. తెలంగాణలో అత్యధికంగా అంటే 5.02శాతం, రాజస్థాన్‌లో 3.53శాతం, కేరళ 3.50శాతం, ఆంధ్రప్రదేశ్ 3.45శాతం, పశ్చిమబెంగాల్ 3.44శాతంగా రిటైల్‌ద్రవ్యోల్బణం నమోదయింది. దేశవ్యాప్తంగా గ్రామీణప్రాంతాల్లో 1465 మార్కెట్లు, పట్టణప్రాంతాల్లో 1407 మార్కెట్లనుంచి ధరలను విశ్లేషించినట్లు మోస్పీ తెలిపింది.



# గ్లోబల్ డిజిటల్ వర్క్‌ఫోర్స్‌లో భారత్ నం-2

**న్యూఢిల్లీ, మార్చి 12:** గ్లోబల్ డిజిటల్ వర్క్‌ఫోర్స్‌లో భారత్ శరవేగంగా విస్తరిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా విదేశీ నియామకాలు జరిపే దేశాల్లో భారత్ మూడో అతిపెద్ద దేశంగా నిలిచింది. ప్రపంచంలోని మొత్తం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ట్రైనర్లలో 7.2 శాతం వాటాతో కీలక శక్తిగా ఎదుగుతోందని సర్వేలు చెపుతున్నాయి.

డీల్ అనే సంస్థ నివేదిక ప్రకారం, ప్రపంచంలో అత్యంత అధిక ప్రతిభా వనరులు కలిగిన దేశాల్లో అమెరికా తర్వాత భారత్ రెండో స్థానంలో ఉంది. ఫిలిప్పీన్స్, కెనడా వంటి దేశాలను భారత్ అధిగమించింది. గ్లోబల్ లేబర్ మార్కెట్‌లో వస్తున్న మార్పులను ఈ నివేదిక హైలైట్ చేసింది. ముఖ్యంగా ఏఐ ట్రైనింగ్ ఒక కొత్త వృత్తిగా ఆవిర్భవించడం, ప్రత్యేక నైపుణ్యాల కోసం స్టార్టప్‌లు అంతర్జాతీయ నియామకాలు చేపట్టడం వంటి అంశాలను ప్రస్తావించింది. భారతీయ నిపుణులకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ గణనీయంగా పెరుగుతోంది. గత ఏడాదితో పోలిస్తే, అమెరికా నుంచి భారత్‌లో నియామకాలు 24 శాతం, యునైటెడ్ కింగ్‌డమ్ నుంచి 64 శాతం, ఆస్ట్రేలియా నుంచి 61.5 శాతం పెరిగాయి. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, టెస్టింగ్, యూజర్ ఇంటర్‌ఫేస్ వంటి ఉద్యోగాలకు బాగా డిమాండ్ ఉంది. ఈ నివేదికలో ఏఐ ట్రైనర్ల వృద్ధి మరో ముఖ్యమైన అంశం. ప్రపంచవ్యాప్తంగా 600కు పైగా సంస్థల్లో సుమారు 70 వేలమంది ఏఐ సిస్టమ్‌లకు శిక్షణ ఇస్తున్నారని తేలింది. గ్లోబల్ మార్కెట్‌లో ఏఐ ట్రైనర్లు గంటకు 15 నుంచి 20 డాలర్లు సంపాదిస్తుండగా, నిపుణులు గంటకు 50 నుంచి 100 డాలర్ల వరకు ఆర్జిస్తున్నారు. భారత్‌లో ఏఐ ట్రైనర్ల సగటు వేతనం గంటకు 12 డాలర్లుగా ఉందని నివేదిక.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.